



డి స్ట్రి బ్యూ టర్లు

| | | | |
|---|---|---|---|
| [illegible] | గోకుల్ కృష్ణ | .... | విజయవాడ. |
| [illegible] | ప్రిమియర్ | .... | సికింద్రాబాద్. |
| [illegible] | కాంతి | .... | [illegible] |
| [illegible] | జయంత్ | .... | [illegible] |




కేసరీ కుటీరం లిమిటెడ్,

రాయపేట :: మద్రాసు 14.



డాంగ్రే గారి

బాలామృతం

బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను. పళ్లు మొలిచేటప్పుడు అయ్యే విరేచనములు నిలిపి. బలమును. ఆరోగ్యము నిచ్చును.

K. T. Dongre & Co. BOMBAY-4

నోవ్వా

బ్రిలియన్‌టాయిన్

లక్షలకొలది ఉపయోగించినవారిచే మెప్పొందినది




ది నోవ్వా కంపెనీ, మాహీమ్, బొంబాయి




ఆంధ్ర, సీడెడ్, నైజాములకు
పూర్ణా పిక్చర్సు లిమిటెడ్, విజయవాడ

మైసూర్ సంస్థానం, కూర్గులకు
డింలాండ్ పిక్చర్సు కార్పొరేషన్, బెంగుళూరు

## మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్నయెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు

వివరములకు:

**డా॥ పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,**

19, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

(టెలిఫోన్: 85254)

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణికోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళ్లై పిళ్ళై వీధి,
తెప్పకొలం.



## నిరంతర సహవాసి



మీరు మకాం చేస్తున్నా, లేక ఇంటిలోనే ఉన్నా, ఇటియల్ మీకు నిరంతర సహవాసిగా ఉంటుంది. దానిని నమ్మకంగా మీరు వాడవచ్చును.

సెప్టిక్ కానివ్వదు, క్రిమివిధ్వంసిని, అహ్లాదకరమైనది, విషంకాదు.

ఉత్పత్తిదారులు:

ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబరేటరీ లిడ్.,

ITI

మల్లేశ్వరం, బెంగుళూరు.




సెల్లింగ్ ఏజెంట్లు

**బెస్ట్ అండ్ కంపెనీ లిమిటెడ్,**

పోస్ట్ బాక్సు నం. 63, మద్రాసు.




పూర్ణా రిలీజ్

వివరములకు :— వినోదా పిక్చర్స్, గోపాలకృష్ణారోడ్ మదరాసు-17

# ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

స్థాపితం : 1923 (షెడ్యూల్డు బ్యాంకు) హెడ్డాఫీసు : మచిలీపట్టణం

చెల్లింపబడిన మూలధనము, రిజర్వులు రు. 37,45,000

అమలునందున్న వ్యాపారము రు. 6,00,00,000 మించినది.

## మద్రాసులో బ్రాంచీలు

| మైలాపూరు ఆఫీసు : | మద్రాసు బ్రాంచి : | త్యాగరాయనగరు ఆఫీసు : |
|---|---|---|
| 77, కచ్చేరి వీధి. | 322-23, లింగిచెట్టి వీధి | 37, పాండీ బజారు. |

## ఇతర బ్రాంచీలు

అనకాపల్లి, చీరాల, ఏలూరు, గుడివాడ, గుంటూరు, కాకినాడ, మచిలీపట్టణం, నరసారావుపేట, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తెనాలి, విజయవాడ, విశాఖపట్టణం, విజయనగరం (సిటీ), తుని, అమలాపురం, అరండల్ పేట (గుంటూరు), బాపట్ల (గుంటూరుజిల్లా), భీమవరం, గవర్నరుపేట (విజయవాడ), గూడూరు (నెల్లూరుజిల్లా), పాలకొల్లు.

## సబ్ ఆఫీసులు

ఆమదాలవలస, (శ్రీకాకుళం జిల్లా), చల్లపల్లి, (కృష్ణా జిల్లా), దుగ్గిరాల, గొల్లప్రోలు, జగ్గయ్యపేట, మహారాణిపేట (విశాఖపట్టణం), పార్వతీపురం, పెడన (కృష్ణా జిల్లా), పెద్దాపురం, పిఠాపురం, రామారావుపేట (కాకినాడ), సాలూరు, సామర్లకోట, తిలారు (శ్రీకాకుళం జిల్లా), తిరుపతి, వినుకొండ, కర్నూలు, నరసన్నపేట, ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), అనంతపూరు, కడప, బళ్లారి.

అన్నివిధములైన బ్యాంకింగు వ్యాపారములు, ఫారిన్ ఎక్సేంజి సహా కొనసాగింపబడును.

ఏలేశ్వరపు రామచంద్రమూర్తి,
యం. ఏ., సి. ఏ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజరు.

తాడేపల్లి శ్రీరాములు,
మేనేజింగ్ డైరెక్టరు.




బాదకుండగనే బట్టలను తెల్లగాను ప్రకాశవంతముగాను ఉతుకును!

S. 180-50 TL

# యువ ప్రచురణలు

మా ప్రచురణలు హిగిన్‌బాథమ్సు బుక్‌స్టాల్సులోనూ, వెంకట్రామా అండ్ కో అన్ని బ్రాంచీలలోనూ, శేషు అండు కో, తెనాలిలోనూ, బాలసరస్వతి బుక్ డిపో, కర్నూలు వారి వద్దనూ, ఇంకా పెద్ద పుస్తకవిక్రేతలందరివద్దా దొరుకుతవి. లేనియెడల మాకు వ్రాయండి. 6-0-0 విలువగల పుస్తకములు ఒకేసారి తెప్పించిన వారికి పోస్టు ఖర్చులు మేమే భరించి పంపుతాము.

**శరత్ బాబు**

| | | |
|---|---|---|
| వాగ్దత్త | [నవల] | 1-12-0 |
| శుభద | ,, | 1- 8-0 |
| దేవదాసు | ,, | 1- 8-0 |
| పల్లీయులు | ,, | 1- 8-0 |
| నవవిధాన్ | ,, | 1- 0-0 |
| చంద్రనాథ్ | ,, | 1- 0-0 |
| పరిణీత | ,, | 0-12-0 |
| బడదీదీ | ,, | 0-12-0 |
| నిష్కృతి | ,, | 0-12-0 |
| కాశీనాథ్ | ,, | 0-12-0 |

**చలం**


| | | |
|---|---|---|
| ఆత్మార్పణ | ,, | 1- 8-0 |
| వాళ్ళునలుగురూ | ,, | 0-12-0 |
| ప్రేమ లేఖలు I | ,, | 1-12-0 |
| ,, II | ,, | 1- 8-0 |
| పురూరవ | ,, | 1- 8-0 |
| దైవమిచ్చిన భార్య | ,, | 1- 8 0 |
| స్త్రీ | ,, | 2- 0-0 |

**యువ బుక్ డిపో**

గవర్నరుపేట, బెజవాడ — కోడంబాకం, మద్రాసు—24

YUVA PUBLICATIONS · MADRAS & BEZWADA


LUX
LUX TOILET SOAP
"లక్సు
టాయిలెట్ సబ్బు
నా చర్మ సౌందర్యమునకై సంరక్షణ తీసుకొంటుంది"
అని
లలిత
చెప్పుచున్నది
మనోహరమైన సువాసనతోగూడిన ఈ తెల్లటి శుద్ధ
సబ్బుతో మీ చర్మమును మనోహరముగా
నుంచుకొనండి!
సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు



త్వరలో
విడుదల!
ఏయన్. ప్రొడక్షన్సు వారి
ఆడబ్రతుకు
శ్రీరంజని...కనకం...కృష్ణకుమారి...బేబిమల్లిక
ప్రొడ్యూసర్...A. నరసయ్య...డైరెక్టర్...B.A. సుబ్బారావు
చిత్రప్రియా రిలీజ్

ఆంధ్రజ్యోతి
...సచిత్ర మాస పత్రిక......

సంపుటి 16 ] మార్చి 1952 [ సంచిక 3

# మద్రాసు మంత్రివర్గం : కాంగ్రెసు పునర్నిర్మాణం

దేశమంతటా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తి అయినవి. ఒరిస్సాలో అప్పుడే కొత్త మంత్రివర్గం అధికారాన్ని స్వీకరించింది. మార్చి నెలాఖరులోగానే, ఒక్క మద్రాసు రాష్ట్రంలోతప్ప మిగతా అన్ని రాష్ట్రాలలోను కొత్త మంత్రివర్గాలు ఏర్పడవచ్చు. కాశ్మీర్‌తోకూడా కలిపి ఇండియన్ యూనియన్‌లో 'ఎ', 'బి', 'సి' మొత్తం రాష్ట్రాలు 26 వున్నాయి. ఇందులో ఆరు రాష్ట్రాలలోతప్ప, మిగతా 20 రాష్ట్రాలలోను కాంగ్రెసు పార్టీకే పూర్తి మెజారిటీ వచ్చింది. ఆ ఆరు రాష్ట్రాలు—మద్రాసు (మొ. 375—కా 152), తిరువాన్‌కూర్ కొచ్చిన్ యూనియన్ (మొ. 108—కా 44) ఒరిస్సా (మొ. 140—కా 68), పాటియాలా తూర్పు పంజాబు సంస్థానాల యూనియన్ (మొ. 60—కా 25), మణిపూర్ (మొ. 30—కా 10) త్రిపుర (మొ. 30—కా 9) ఇందులో మద్రాసు, ఒరిస్సాలు 'ఎ' తరగతి రాష్ట్రాలు. తిరువాన్‌కూర్ కొచ్చిన్ యూనిన్, పాటియాలా తూర్పు పంజాబు సంస్థానాల యూనియన్ 'బి' తరగతి రాష్ట్రాలు. మణిపూర్, త్రిపుర 'సి' తరగతి రాష్ట్రాలు. వీనిలో ఒరిస్సాలో కాంగ్రెసు పార్టీ మంత్రివర్గాన్ని స్థాపించనే స్థాపించింది. తిరువాన్‌కూర్ కొచ్చిన్ యూనియన్‌లోను, పాటియాలా తూర్పు పంజాబు సంస్థానాల యూనియన్‌లోను కాంగ్రెసుపార్టీలే మంత్రివర్గాలను స్థాపించడానికి యత్నిస్తున్నవి. ఈ మూడు రాష్ట్రాలలోను ప్రతిపక్షాలు

నమైక్యంగాలేకపోవడం, స్వతంత్రులు కాంగ్రెసునే సమర్థించే సూచనలుండడం కాంగ్రెసుపార్టీకి ఉత్సాహంకలిగించినవి. మణిపూర్‌లో కాంగ్రెసుకు మూడవవంతు మాత్రమే స్థానాలు లభించినా ప్రతిపక్షాలుకూడా అంతంతమాత్రంగానే వున్నందున అక్కడకూడా కాంగ్రెసుపార్టీయే ప్రభుత్వాన్ని స్థాపించవచ్చు. ఇకపోతే త్రిపురలో మాత్రం కమ్యూనిస్టుల ప్రాబల్యం కిందగల యునైటెడ్ డెమొక్రటిక్‌ఫ్రంట్‌కు 16 స్థానాలు లభించినవి. మంత్రివర్గాన్ని స్థాపించేందుకు సంఖ్యాబలం దానికి చేకూరింది. ఇండియాలో మొదటిసారిగా త్రిపురలో స్థాపించబడగలదని చెప్పవచ్చు.

ఇప్పటికి చెన్నరాష్ట్రస్థితి అయోమయంగానే వుంది. కమ్యూనిష్టు—ప్రజాపార్టీల యాజమాన్యంకింద యునైటెట్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఏర్పడింది. దానిలో చేరగల వివిధపక్షాలకు ఆమోదయోగ్యంకాగల కనీస కార్యక్రమాన్ని రూపొందించడం ఇంకా పూర్తికానేలేదు. భేదాభిప్రాయాలు పొడసూపినట్టూ, అందుచేతనే కనీస కార్యక్రమం వివరాలదాకా వచ్చి నిలిచివున్నట్టూ వదంతులున్నవి. ఆదిలో మంత్రివర్గ నిర్మాణం పట్ల అంతగా ఆసక్తిని ప్రదర్శించని కాంగ్రెసుపార్టీ ఇప్పుడిప్పుడే అందుకై తీవ్రంగా యత్నిస్తున్నది. స్వతంత్రులను చేర్చుకోవాలనీ, అవసరమైతే ఇతరపక్షాలవారితో వారి ప్రతిపత్తికి, ప్రత్యేకతకు భంగంలేకుండాకూడా కనీస కార్యక్రమాన్ని ఏర్పరచుకొని మిశ్రమ మంత్రివర్గాన్ని ఏర్పరచాలనికూడా కాంగ్రెసు నాయకులు భావిస్తున్నారు. కాంగ్రెసు అధ్యక్షుడు పండిట్ నెహ్రూకూడా ఇందుకు సుముఖంగానే ఉన్నట్టు తెలుస్తున్నది. బహుశా కాంగ్రెసుపార్టీ పూనికపై మిశ్రమ మంత్రివర్గమే ఏర్పడవచ్చు కాని, కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీనాయకుడుగా ఎవరు ఎన్నికకావాలన్న దగ్గరినుంచీ విభేదాలే వున్నట్టు కనుపిస్తున్నవి. కిందటినెలలోనే సూచించినట్టు కాంగ్రెసుపార్టీ పూనికపై మిశ్రమ మంత్రివర్గ మేర్పడినా, కమ్యూనిస్ట్-ప్రజాపార్టీల పూనికపై కాంగ్రెసేతరపక్షాల మిశ్రమ మంత్రివర్గం ఏర్పడినా ఏదీకూడా ఒక ఏడాదికి మించి సుస్థిరంగా వుండజాలదనీ ఏడాదితిరగకముందే ఎన్నికలు నిజమని అనవచ్చు.

* * * *

చెన్నరాష్ట్రంలో, ముఖ్యంగా ఆంధ్రదేశంలో, కాంగ్రెసు ఓటమితో కాంగ్రెసు పునర్నిర్మాణ సమస్య ప్రాధాన్యంలోనికి వచ్చింది. చిత్తూరులో ఫిబ్రవరి 26, 27 తేదీలలో ఆంధ్ర కాంగ్రెసు సంఘం సమావేశం తర్వాత కార్యవర్గం రాజీనామా నిచ్చింది. హైకమాండ్ సూచనలు చేరేవరకు అధ్యక్షపదవిని నిర్వహించడానికి, తన పదవిని స్వీకరించేవా రెవరైనా దొరికితే అధ్యక్షపదవిని విడనాడ్డానికి శ్రీ సంజీవరెడ్డిగారు సుముఖత వెల్లడించారు. కాంగ్రెసు సంస్థను పునర్నిర్మించడాని కిది దోహదమివ్వగలదన్న తలంపుతోనే ఈ రాజీనామాలు జరిగినవి. కార్యవర్గ సభ్యులు రాజీనామాల నివ్వడంలో, లోగడ కాంగ్రెసునుంచి వైదొలగిన కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ, కృషికార్‌లోక్ పార్టీలు తిరిగి కాంగ్రెసులో చేరడానికి అవకాశంకల్పించాలన్న భావంతోనే తాము రాజీనామా చేస్తున్నట్లు సూచించారు. కాని ఆ రెండుపక్షాలవారూ చేరేసూచనలేమీ లేవు. మరి కాంగ్రెసు పునర్నిర్మాణం ఎలా సాధ్యమో ?

కాంగ్రెసును పండిట్ నెహ్రూకూడా సంస్కరించే స్థితి దాటిపోయిందనీ, ఇప్పటికి దానిని జాతీయసంస్థగా నిలపడానికి యత్నించడంకంటే రాజకీయపక్షంగా పునర్నిర్మించడం మంచిదనీ, ఎన్నికల అనంతరం రాజకీయపక్షంగా కాంగ్రెసును రూపొందించడం అత్యవసరం కావచ్చుననీ, గత అక్టోబర్ సంచికలోనే సూచించాము. ఆనాటి వూహలు అక్షరాలా సత్యమైనాయి. గాంధిజీ సలహాను సైతం కాదని కాంగ్రెసును జాతీయసంస్థగానే నిలపాలని నిన్నమొన్నటిదాకా వాదించిన పండిట్ నెహ్రూయే ఇప్పుడు స్వయంగా దానిని రాజకీయపక్షంగా పునర్నిర్మించాలని సూచించి అందుకు అనువుగా అన్నిరాష్ట్ర సంఘాలకు కొన్ని సూచనలతో ఒక సర్క్యులర్‌ను ఫిబ్రవరి 15-వ తేదిన పంపించాడు. ప్రజలతో సన్నిహిత సంబంధం కలిగి వుండాలనీ, ప్రజలతోకలిసి పనిచేయాలనీ, ప్రజల సమస్యలను అర్థంచేసుకొని, వాటిని పరిష్కరించడానికి యత్నించాలనీ, యువకులకు ఆకర్షవంతంగా పార్టీనిదిద్ది, త్యాగ నిరతితో కృషిచేయాలనీ ముఖ్యంగా ఆయన సూచించాడు. ఇందుకు కొన్ని నిబంధనలను కూడా పేర్కొన్నాడు. అది గ్రామసంఘమైనా, తాలూకాసంఘమైనా, జిల్లాసంఘమైనా, రాష్ట్రసంఘమైనా అధ్యక్షుడు ఏడాదికిమించి, కార్యదర్శి రెండేండ్లకు మించి పదవిలో వుండరాదన్న నియమాన్ని అమలుజరపాలని సూచించాడు. తాలూకా,

జిల్లా సంఘాల యాజమాన్యంకింద వుండే ప్రాంతం విస్తృతమై ప్రజలతో ఆ సంఘాలకు సన్నిహితత్వంలేకుండా పోతున్నందున స్థానిక సంఘాలకు విశేష ప్రాముఖ్యమిచ్చి పనిచేయించాలనీ, శాసనసభ్యులు విశేషంగా ఆ నియోజకవర్గాలలోనే పర్యటిస్తూ ప్రజలతో సన్నిహితత్వాన్ని వృద్ధిపరుచుకోవాలనికూడా సూచించాడు.

బహుశా ఈ సూచనలన్నీ మార్చినెల మూడవవారంలో కలకత్తాలో సమావేశం కానున్న అఖిలభారత కాంగ్రెసుసంఘ సభలో ఆమోదించబడవచ్చు. ఈ సూచనలన్నీ ఉత్తర హిందూస్థాన్‌లో కాంగ్రెసు పటిష్టంకావడానికి వుపకరించగలవేమోకాని, చెన్నరాష్ట్రంలో, ముఖ్యంగా ఆంధ్రదేశంలో, వీటివల్లకూడా ఒరిగేదేమీ వుండకపోవచ్చు. ఎంతచేసినా, ఏమిజరిగినా ఆంధ్రలో కాంగ్రెసు పునరుజ్జీవనం సంభవమా అన్న సంశయానికి తావులేకపోలేదు. కాని, రాజకీయపక్షంగానే కాంగ్రెసు పున్నర్నిర్మించ దలుచుకున్నపుడు, పూర్తిగా ఆ మార్గాన్నే అనుసరించి, గ్రామ, పట్టణ సంఘాల నుంచీ పునర్నిర్మించి, గ్రామ సంఘాల అధ్యక్షులనే గ్రామపంచాయతుల అధ్యక్షులుగాను, పట్టణ సంఘాల అధ్యక్షులనే మునిసిపల్ చైర్మెన్‌లుగాను, జిల్లాసంఘాల అధ్యక్షులనే జిల్లాబోర్డుల అధ్యక్షులగాను ఎన్నుకొని, ఆంధ్ర, తమిళ, కేరళ, కర్నాటక కాంగ్రెసు సంఘాల అధ్యక్షులు నలుగురికీ రాష్ట్ర మంత్రివర్గంలో స్థానాలు ఇచ్చి ప్రభుత్వానికీ, కాంగ్రెసుపార్టీకి సన్నిహితత్వం చేకూర్చి, ఒకదానికి మరొకదాని సహాయ సహకారాలు లభించేటట్టు చేయనిదే, ఒకదాని సలహాలను మరొకటి పాటించేటట్టు చేయనిదే, చెన్నరాష్ట్రంలో కాంగ్రెసు పునర్నిర్మాణం అసంభవమే కాగలదు. ఈ విధంగా చేసిననాడే, కాంగ్రెసు సంస్థ కిందినుంచి పునర్నిర్మించబడి, కొత్తవారి నాకర్షించి, ప్రజలతో సంబంధం కలిగివుండి, ప్రజాభిప్రాయాన్ని మన్నించి, ప్రజావిశ్వాసాన్ని చూరగొనడానికి యత్నించితే ఏనాటికైనా తిరిగి అది పాదుకొనడానికి అవకాశం రాగలదు. ఇది జరగనిదే, ఇంకేమి జరిగినా ప్రజల దారి ప్రజలదే, కాంగ్రెసు దారి కాంగ్రెసుదే, ప్రభుత్వందారి ప్రభుత్వానిదే.

శా. ఫిబ్రవరి - 29



# క్రొత్త సంవత్సరం

జానకీ, శర్మలు
సంవత్సరాది పండుగరోజు
సమయము : ఉదయము

శర్మ : జానకీ, ఓ జానకీ, ఇల్లాగరా!

జానకి : ఎందుకండీ?

శ : ఇల్లాగరా చెబుతాను.

జా : ఆ, ఎందుకండీ?

శ : ఇవ్వాళ పండగకదూ? ఆ సంగతి జ్ఞాపకంచెయ్యవేం?

జా : జ్ఞాపకంచెయ్యడం ఎందుకు, మీకు తెలియదా ఏమిటి?

శ : తెలుసులే. ఇవ్వాళ మనము ఏంజెయ్యాలో ఆలోచించావా?

జా : నేనూ పిల్లలూ కొత్తబట్టలు కట్టుకోవాలె. తెస్తారుగా!

శ : (విసుగ్గా) కొత్తబట్టలూ! కొత్తబట్టలూ! నీకు ఎప్పుడూ అదేరంధి. అది అట్లాఉంచు. ఇవ్వాళ సంవత్సరాది. పాత సంవత్సరం పోయి కొత్త సంవత్సరం వస్తున్నది.

జా : అవునండి.

శ : అవును సరే. మనము ఈరోజున ఏంజెయ్యాలంటావు?

జా : ఏంజేస్తామండీ - పిండివంటలతో భోజనం చేద్దాము!

శ : అదిసరే. ఇంకా ఏంచెయ్యాలె?

జా : కొత్తబట్టలు కట్టుకోవాలె.

శ : (విసుగ్గా) అబ్బబ్బ! కొత్తబట్టలు! కొత్తబట్టలు! ఎప్పుడూ అదేగోడవా?

జా : మరి ఏంజెయ్యాలంటారు?

శ : అట్లా అడుగు చెబుతాను. ముందు మనము గత సంవత్సరంలో జరిగిన పోట్లాటలూ, కొట్లాటలూ, అన్నీ మరిచిపోవాలి.

జా : మరచిపోక, ఇంకా కూర్చున్నయిటండీ?

శ : మరిచిపోయి, ఈ రోజునుంచీ జీవితాన్ని దిద్దుబాటు చేసుకొని, కొత్త పంథాలోకి తిప్పాలనే నిశ్చయానికి రావాలె!

మునిమాణిక్యం నరసింహారావు

జా : మీ ఇష్టం వచ్చిన నిశ్చయానికి రండి, నేనేమీ వద్దనను.

శ : నేను ఒక్కడినీ కాదు. మనం ఇద్దరం కలిసి కొత్త తీర్మానాలు చేసుకొంటేనేగాని భావిజీవితం సౌఖ్యావహమూ, సౌందర్యమయమూ కాదు.

జా : నన్నేమి చేయమంటారు?

శ : మన దాంపత్యజీవితం మృగసుమశయ్య కావటానికి నీకు తోచిన సలహాలు ఇయ్యి. ఇట్లా ఇట్లా చేద్దాము, ఇట్లా ఇట్లా ప్రవర్తిద్దాము అని మనం ఇద్దరం కలిసి కూడపలుక్కుందాము. నిశ్చయించుకొందాం.

జా : (నవ్వి) ఎందుకూ నిశ్చయించుకోటం?

శ : ఎందుకో నీకు ఇంకా తెలియలేదన్నమాట! ఈ నిశ్చయాలు మన భావి జీవితానికి కరదీపికలు అవుతాయి.

జా : ఏమో నాకు తెలియదండీ ఈ గొడవలన్నీనూ.

శ : తెలియదంటే ఎట్లా?

జా : మరి ఏంజేసేదండి?

శ : నీవు ఏమీ చెయ్యనద్దు. వచ్చే సంవత్సరంలో మనము ఏంచెయ్యాలో కాస్త ఆలోచించు, అంతే.

జా : (నవ్వి) ఏంచేస్తావండీ, (నవ్వి) - ఏమీ చెయ్యవద్దు.

శ : అదికాదే పిచ్చిమొద్దూ, ఏమీ చెయ్యవద్దు అంటావేం? ఏమీ చెయ్యక ఇల్లాగే పోట్లాడుకుంటూ ఉందామా!

జా : పోనీ పోట్లాడుకోకుండా ఉందాము.

శ : అది! అట్లా చెప్పు. కాబట్టి క్రొత్త సంవత్సరంలో మనము పోట్లాడుకో కూడదు. చూశావా మనం ఎంత మంచి నిశ్చయానికి వచ్చామో! ఎంత అద్భుత విషయము. ఈ సంగతి తోచినందుకు నిన్ను నేను అభినందిస్తున్నాను. ఈ నిశ్చయంవల్ల ఏంజరుగుతుందో ఊహించు. మన జీవితంలోనుంచి పోట్లాటలను తరిమివేశాము. ఇల్లాగ అనుకోటంవల్ల లాభం ఉందంటావా లేదంటావా?

జా : ఊరికే అనుకొంటే ఏంలాభం అండీ?

శ : బాగాచెప్పావు. కాబట్టి ఏంజెయ్యాలన్న మాట? మనం చేసుకొనిన తీర్మానాలను నిశ్చయాలనూ. అమలులో పెట్టాలె. వానిని అనుసరించి ప్రవర్తించాలె. అదేగదూ నీవనటం?

జా : అవును అదే!

శ : అయితే. అది రెండో తీర్మానంగా తీసుకొందాము. ఇప్పటికి రెండు తీర్మానాలు అయినవి. ఉండు, ఉండు, ఇవి ఒక కాయితంమీద వ్రాస్తే మంచిది.

మొదటి తీర్మానం.—

క్రొత్తసంవత్సరంలో నాకు, అంటే భర్త అయిన వాడు, నీపైన, అంటే భార్య అయిన నీపైనగానీ, నీవు నాపైనగాని, మన ఇద్దరికి కలిసి ఇంకొకరిపైగానీ, ఇంకొకరికి మనపైగానీ, కోపంరావటం కూడనిపని అనిన్నీ, అట్టిది జరగకూడదనిన్నీ తీర్మానించటమైనది.

జా: (నవ్వి) అదేమిటండీ, ఇంకొకరికి కూడా మనపై కోపం రాకూడదూ అంటే రాకుండా ఉంటుందా?

శ: అంటే మన ప్రవర్తన అల్లాగ ఉండాలన్న మాట. ఎవ్వరికీ కోపం తెప్పించేలాగున ప్రవర్తించకూడదు.

జా: సరే, కానివ్వండి.

శ: కానివ్వండి అంటేకాదు. ఈ తీర్మానానికి ఒక అక్షరం అటూ, ఒక అక్షరం ఇటూ జరగకూడదు. తెలిసిందా?

జా: జరిగితే?

శ: జరిగితే నేనూరుకోను!

జా: ఊరుకోక?

శ: ఊరుకోక ఏంచేస్తానో చెప్పాలే ఏమిటి?

జా: నానాగోలచేస్తారు అంతేగా?

శ: చెయ్యక ఊరుకొంటానా?

జా: అంటే మీరు కొత్త సంవత్సరంలో క్రొత్తరకం పోట్లాటలకు కావలసిన సామాగ్రి కూరుస్తున్నారు అన్నమాట,

శ: అదిగో అల్లాగ విపరీతార్థాలు తీస్తేనే వళ్లు మండేది!

జా: వళ్లు మండుతున్నదా?

శ: మండదూ, నీవు అనేమాటలు ఎల్లాగున్నయి!

జా: (నవ్వి) ఇందాకటి తీర్మానం ఏమైపోయిందండీ. తీర్మానంచేసిన ఉత్తర క్షణంలోనే మీకు కోపంవచ్చిందే; ఇక ఆ తీర్మానంవల్ల ప్రయోజనం ఏమిటీఅంట?

శ: మంచిపనే అయింది. ఇప్పుడు నాకు కోపంవచ్చింది. ఇంకా కాసేపటికి నీకువస్తుంది: కాబట్టి ఈ తీర్మానం చాలదన్నమాట! కోపం రా కూడదూ అన్న నిశ్చయం నిలబడటానికి ఇంకా ఒకటి రెండు తీర్మానాలు పోటీగా పెట్టాలని తేలింది. చూశావా?

జా: అల్లాగే తోస్తుంది!

శ: కాబట్టి ఇప్పుడు కోపంరాకుండా ఉండాలంటే మనలో ఎవరుగానీ ఇతరులకు కష్టం కలిగించే మాటలు అనకూడదు. అంతేనా?

జా : అంతే.

శ : సరే. అయితే తీర్మానం వ్రాస్తానుండు.

"ఈ నూతన సంవత్సరాదినుండి నీ మనస్సుకు కష్టంకలిగించే మాటలు నేనూ, నా మనస్సుకు కష్టంకలిగించే మాటలు నీవూ అనకూడదనిన్నీ, మనము ఇద్దరమూ ఎవ్వరి మనస్సుకూ కష్టంకలిగించేలాగున మాట్లాడరాదనిన్నీ తీర్మానించటమైనది."

అమ్మయ్య, ఇక మన జీవితం కొత్తపంథాలో నడుస్తుంది. ప్రశాంతంగా ఉంటుంది. (నవ్వి) నిజంగా ఇట్టి గట్టి ఏర్పాటులు చేసుకోకపోబట్టేకదా మొగుడూ పెళ్ళాలు పోట్లాడుకోటమూ!...

జా : తిట్టుకోటమూ.

శ : తిట్టుకోటమూ.

జ : అంపరి నోళ్ళలోనూ పడటమూ.

శ : అల్లరిపాలు కావటమూ.

జా : చివరకు ఎవదారి వారుచూచుకోవటమూ.

శ : ఏడుస్తూ కూర్చోడమూ! (నవ్వి) కాబట్టి (పెద్దగొంతుకతో) సంవత్సరాది పండుగనాడు పంచభక్ష్య పరమాన్నాలతో భోజనంచేసి తృప్తినిపొందటమూ, నూతన వస్త్రములను ధరించటమూ మొదలగు కార్యక్రమంతో సరిపుచ్చుకొనక, ప్రతి గృహస్థూకూడా, తీర్మానపూర్వకముగా ఇల్లాగ కృతనిశ్చయుడై భావిజీవిత సౌఖ్యమును సమకూర్చుకోవలసినదని ప్రపంచానికి నేను ఇప్పుడే చాటి చెబుతున్నాను.

## రెండవ రంగం

అదే ఇల్లు - పడకగది
సమయం : మధ్యాహ్నం భోజనానంతరం

శ : అయిపోయిందా. ఇకనుంచి మన ఇల్లు స్వర్గం అనుకో.

జా : అనుకొంటాను.

శ : ఇక మన ఇంట్లో పోట్లాటలుండవు. కీచులాటలుండవు. ఏమీ ఉండవు!

జా : (నవ్వి) ఎందు కుండవు మైయండి!

శ : మనము ఒకరినొకరు ప్రేమించుకొంటాము.

జా : ఎందుకు ప్రేమించుకోమూ!

శ : (తృప్తితో) అంటే నీవు నన్ను ప్రేమిస్తావు. నేను నిన్ను ప్రేమిస్తాను. ఏమంటావు బాగుందా?

జా : (నవ్వి) చాలా బాగుంది.

శ : (సంతోషంతో)— నేను నిన్ను ప్రేయసీ, ముద్దులచిలకా, రంగుల చిట్టీ అని పిలుస్తాను.

జా : (నవ్వుతూ) ఎబ్బే! అదేమిటండీ?

శ : ఇంగ్లీషువారు అంతే జానకీ. మై డార్లింగ్ మై డవ్ అని పిలుస్తారు.

జా : పిలిస్తే పిలిచారు. మనకు అవన్నీ ఏమీవద్దు.

శ : వద్దంటే కథ అంతా పాడైపోతుంది.

జా : అవ్వ! ఎక్కడైనా ఉందా ఈ అల్లరి. ఏమీ వద్దు. మామూలుగా పిలుద్దురూ మీకు పుణ్యం ఉంటుంది.

శ : నీకు తెలియనప్పుడు ఊరుకో. నేను అల్లాగ పిలుస్తాను. నీవు అల్లాగే నా ముద్దులభర్తా......

జా : (నవ్వి) ముక్కులైన భర్త. ఇక ఊరుకోఃనన్నానా?

శ : పోని, అదట్లా ఉంచు. ఇంకా, ఏమేమి మంచిపనులు చేద్దాము ఈ క్రొత్త సంవత్సరంలో?

జా : ఇంకేమున్నవి. ఇప్పుడనుకొన్నవి చేస్తే చాలు!

శ : అట్లా అనబోకు. చిన్న చిన్న విషయాలలో ఎన్నిటిలోనో మనం క్రొత్త క్రొత్త నిశ్చయాలకు రావాలె. జీవితంపై నూతన కాంతులు ప్రసరించాలె. కొత్త సంవత్సరములో మనము ఆరోగ్యాన్ని, శాంతిని, కాంతిని, సంపాదించాలె.

జా : (పెద్దగా) అల్లాగేనండి.

శ : అల్లాగే అంటే కాదు. సకల కల్యాణగుణ సంపత్కరమైన నూతనజీవితానికి ఇదే ప్రారంభం.

జా : (పెద్దగా) సరేనండి!

శ : (పెద్దగా) సరేనంటే కాదు. పట్టుబట్టి కార్యం సాధించాలె. జ్ఞానమును సంపాదించవలె. శమన దమన నిగ్రహాపూర్వకమైన జీవిత నిష్ఠను సాధించవలె. జీవిత పాషాణాన్నుంచి పీయూషధారలు పిండవలె. జీవితాన్ని (ఆవేశంతో) రసగంగాధరం చేయవలెను. జీవితము కొత్త కాంతితో, కొత్త సౌందర్యంతో భాసించవలె. (ఆయాసంతో) జీవితం రమణీయ రేఖలతో రాణించేలాగున, ప్రసన్నరూపసౌందర్యంతో భాసించేలాగున......

జా : అబ్బబ్బ! కొంత ఆపుగురూ మీ ఉపన్యాసం. అది సరేకాని ఆరోగ్యం కావాలంటున్నారు. అట్లా అయితే ఆ పొడుకాఫీ తాగటం మానరాదూ?

శ : మరి, అల్లాగ చెప్పు. నేను వద్దన్నానా. చెప్పావుకాబట్టి బ్రతికి పోయివావు. లేకపోతే నా ఉపన్యాసంతో...

జా: అబ్బ! ఇక ఆ విషయం ఎత్తకండి. ఈ నూతన సంవత్సరంలో మీరు కాఫీ తాగకూడదు.

శ: తాగను. కాఫీ, టీ—కోకో ఏవీ త్రాగను. నీవు మళ్ళీ ఎప్పుడైనా బ్రతిమిలాడుతావేమో! కాస్త తాగండి కాస్త తాగండని! ఇప్పుడే చెపుతున్నా. గుక్కెడు కూడా తాగను. ఆ వాసనకూడా దగ్గరకు రానీయను.

జా: మరి ఆ సిగరెట్టు?

శ: సిగరెట్టు వెధవ సిగరెట్టు—(తాగుతూఉన్న సిగరెట్టును పారేయబోయి, సందేహించి మరొక్కసారి, పెద్దదమ్ము లాగి) దానిముఖం చూడను. దరిద్రపు సిగరెట్టు. దానివలననే కొంప గుల్లఅయింది. (దగ్గరలో పడేలాగున విసిరివేస్తాడు)

జా: నెలకు పది పదహేను రూపాయలు అయ్యేవి!

శ: పదిహేను అని నీకు చెప్పేవాడిని. నిజానికి పాతిక రూపాయలుఅయ్యేవి!

జా: పాతిక రూపాయలే!

శ: అవును జానకీ. పాతిక అయ్యేవి. ఆ పాతికా ఉంటే, ఎందుకైనా అక్కరకొచ్చేది. నెలకు పాతికచొప్పన సంవత్సరానికి మూడువందలు ధ్వంసం చేశాను. నీకు సంవత్సరానికి ఓ చంద్రహారం వచ్చేది. అవివేకినై, మందమతినై, జడుడనై ప్రవర్తించాను. సిగరెట్టు తాగుటకు (ఇందాక పారవేసిన చిలక్కొట్టను తెచ్చి, మరొక్కసారి గాఢంగా పీల్చి) ఇదే కడసారి. ఇదే తుది దినము. ఇక దానిముఖము చూడను. (విసిరి పారేస్తాడు. జాలిగా చూస్తాడు)

జా: ఆ మాటమీద నిలబడి ఉండాలె మరి.

శ: ఉంటాను. ఉండాలని కృతనిశ్చయుడనైనాను. ఇంతేకాదు. ఈ రోజు నుంచి తెల్లవారుఝామున లేచి స్నానంచేస్తాను.

జా: చెయ్యండి. పాపం,అన్నయ్యగారు మీకు ఎన్నాళ్ళనుంచో చెబుతున్నారు.

శ: తప్పకుండా చేస్తాను. చెయ్యటమేకాదు, చేసి ప్రశాంతంగా కూర్చుని కాసేపు దైవప్రార్థనకూడా చేస్తాను.

జా: భగవద్గీత చదవండి.

శ: బాగా చెప్పావు. గీతాపారాయణ చేస్తాను. నీవేమో తులసిపూజ చేసుకో.

జా: అదే నేను ఇన్నాళ్ళనుంచీ మీకు చెపటం. కాస్త భక్తిగా ఉండాలని!

శ: ఉండాలె మరి. ఉండకపోతే మనకూ పశువులకూ ఏమి భేదం? భక్తిలేని జీవితం ఏమి జీవితం! వెధవ జీవితం!

జా: ఇప్పటి కాలంలో......

శ: నాకు తెలుసునే జానకి. నాకు అన్నీ తెలుసు. భక్తీ, దేముడూ, దైవం, అన్నీ పోయినయి ఈ రోజులలో. మనం అల్లాగ కాదు. భక్తిగా ఉందాము.

జా: ఇహానికీ పరానికీ కూడా మంచిది.

శ: బాగా చెప్పావు. అదే నేనూ అనుకొంటున్నాను. అయిందా జానకీ, దేముడు మేలుచేస్తే, ఇంకా ఎల్లాగ ఉండాలో, ఏమి చెయ్యకూడదో ఏమి చెయ్యాలో చెప్పు!

జా: మీరు పెందలాడే ఇంటికి రావాలె రోజూను!

శ: తప్పకుండా వస్తాను. ఆరింటికే వస్తాను.

జా: ఇప్పుడిల్లాగే అంటారు. దారిలో ఎవరో స్నేహితుడు కనపడతాడు. కాఫీహోటలుకు రమ్మంటాడు.

శ: దారిలో ఏ స్నేహితుడూ నాకు కనపడడు. కనపడ్డా కాఫీహోటలుకు రమ్మనడు. చెబుతున్నాను నమ్ము. రమ్మన్నా నేను పోను.

జా: ఎందుకు పోరులెండి.

శ: పోను. నమ్ము. ఈ తీర్మానాల కాయితం వాడికి చూపిస్తాను. అప్పుడు ఇంకేంచేస్తాడు? చచ్చినట్లు నోరు మూసుకొని వెళ్ళిపోతాడు. అది సరేకాని నీవు రోజూ వేళకు వంటచెయ్యాలె. అదొకటి ముఖ్యం.

జా: దానికేం భాగ్యం, తప్పకుండా చేస్తాను.

శ: సరి. అంతా బాగానే వచ్చిందనుకో. మన సంసారం శాంతంగా జరగటానికి ఇంకా ఏమిచెయ్యాలో ఆలోచించు. ఎందుకంటే ప్రతి చిన్న విషయములోనూ మనము జాగ్రత్తపడకపోతే లాభంలేదు. ఉండుండు. జ్ఞాపకం వచ్చింది. నీవు పండగకూ పబ్బానికీ, ఆ చీర కావాలనీ, ఈ చీర కావాలనీ గోల చేయకూడదు. నేను ఏ చీర ఇస్తే, ఆ చీరే తీసికొని తృప్తిపడి ఊరుకోవాలె.

జా: సరే అనుకోండి. మీరైనా డబ్బు దూబరా చేయకూడదు.

శ: చెయ్యను. ఎందుకు చేస్తానూ?

జా: చెయ్యనంటే కాదు. ఆ వచ్చిన జీతం జీతం నాచేతిలో పడేయాలె.

శ: పడేస్తాననుకో. మరి నాకేమైనా కావాలంటే?

జా: నేనిస్తాను.

శ: రైట్. సరే. కాని ఒకటి. ఇప్పుడే చెబుతున్నానమ్మాయ్. నీవు రవికలకని, పిల్లల బట్టలకని అయిందానికీ, కానిదానికీ డబ్బు ఖర్చుచేస్తే నే నూరుకోను.

జా: ఎందుకు కర్చుచేస్తానండి... నే నేమన్నా అంత తెలివితక్కువదాన్నా?

శ: అంత కాదనుకో. అయినా. అది సరేగాని, మరిచిపోయినా, ఇంకొకటి! నీవు సినిమాకు వారానికి ఒకసారికంటే ఎక్కువగా వెళ్ళకూడదు.

జా: మీరూ! మీరుమటుకు? మీరు నాతో రావలసిందేకాని ఎప్పుడుబడితే అప్పుడు పోకూడదు!

శ: అబ్బ! ఎన్ని ఏర్పాట్లు చేశాము. ఎన్ని కట్టుదిట్టాలు చేశాము. ఆc. చాలా బాగుంది. ఇక మనకు పొరపు ఎందుకొస్తుందే జానకీ.

జా: (నవ్వి) ఎందుకొస్తుందండీ?

శ: ఎట్లా వస్తుందీ అంట!

జా: ఎట్లా వస్తుంది? వస్తుంది. ఇకరాదు.

శ: (మీసంమెలేసి) మన సంసారం చూచి అందరూ తమ తమ సంసారాలను దిద్దుకొంటారు. చూడు వాళ్ళెట్లా కాపరంచేస్తున్నారో చిలకా గోరంకులలాగ అనుకుంటారు. ఏమంటావూ?

జా: అనుకోరు మరీ!

శ: అనుకొని తీరతారు.

జా: నిజమే!

శ: అప్పుడు మనది ఆదర్శ దాంపత్యము అవుతుంది. మనఇల్లు ఆదర్శగృహం అవుతుంది.... ఇప్పుడే వస్తాను. నీవు ఇక్కడే ఉండు. ఎవరో పిలుస్తున్నారు.

## మూడో రంగం

శర్మ - జానకి

అదే ఇల్లు, హాలు

సమయం: సాయంత్రం మూడున్నర

జా: రండి కాఫీ పుచ్చుకోండి.

శ: కాఫీ ఎందుకుచేశావు? కాఫీ తాగకూడదనేగా మనం అనుకున్నది. అప్పుడే ప్రతిజ్ఞాభంగమా!

జా: ఈ కాస్తకు పెద్ద ప్రతిజ్ఞాభంగం ఏమిటి లెద్దురూ! పండగపూట కూడానా! నాకే జాలేసింది.

శ: నేనప్పుడే అన్నాను. నీవు బలవంతపెడతావు అని!

జా: ఏదో పండగపూటగదా అని!

శ: సరే ఇదే ఆఖరుసారి అన్న మాట. ఇక నీవు కాఫీ ఇయ్యబోకు. ఇచ్చినా తాగను.

జా: సరే తాగండి. అదేమిటి సిగరెట్టు వెలిగిస్తున్నారు! మన నిశ్చయంఏమైంది?

శ: ఇదే ఆఖరుసారి తాగటం. ఇక తాగను, ఏదో పండగపూట అని!

జా: జారిపోతున్నారు.

శ : నేనేమీ జారటంలేదు. నీవు భయపడకు. ఈ ఒక్క సిగరెట్టే! ఒక్కటంటే ఒక్కటే! దీని తరువాత చచ్చినా తాగను.

జా : సరే. కానీయండి. ఏంజేస్తాం.

శ : (సిగరెట్టు ఆప్యాయంగా తాగుతూ) మన ఆదర్శాలకూ నిశ్చయాలకూ వ్యతిరేకంగా ఎప్పుడూ ప్రవర్తించకూడదు. అనుకొన్నవన్నీ అనుకొన్నట్లు జరగాలి.

జా : (నవ్వి) జరుగుతున్నాయి

శ : జరిగితీరుతయ్యి. అది సరేగాని మనం ఇకముందు ఎట్లాఉండాలని, ఏవిధంగా ప్రవర్తించాలాని నిశ్చయించుకొన్నామో ఒక్కసారి చెప్పుకొందామా?

జా : మరిచిపోకుండా జ్ఞాపకం ఉంటానికా?

శ : అదీ సంగతి...ఊ ఏదీ...చెప్పు...గబగబా చెప్పేసెయ్యాలి అన్ని విషయాలూ! ఊఁ మొదలెట్టు. పోనీ నేనే మొదలెడతాను.

(ఈ క్రింది సంభాషణ చాలా వేగంగా జరుగుతుంది, ఒకరు వాక్యం పూర్తి చేసీ చెయ్యటంతోనే రెండోవారు మాట అనేస్తారు)

శ : నీవు నాకు కష్టంకలిగించేమాట ఏదీ అనవు.

జా : మీరూ అనరు.

శ : నీవు శాంతంగా విసుక్కోకుండా ఉంటావు!

జా : మీరూ శాంతంగా ఉంటారు.

(నవ్వులు)

శ : నీవు ఎప్పుడుమాట్లాడినా నవ్వుతూ మాట్లాడుతావు.

జా : మీరు నవ్వుతూ జబాబు చెపుతారు.

శ : నీవు ఇల్లు శుభ్రంగా ఉంచుతావు.

జా : మీరు కాయితాలూ, పుస్తకాలు, ఇంటినిండా పారెయ్యరు.

శ : ఒకవేళ నేను పారేసినా నీవు తీశేస్తావు.

జా : నేను తీసివేయకపోతే మీరే తీసివేస్తారు—

(నవ్వులు)

శ : నీవు పిల్లలను శుభ్రంగా ఉంచుతావు!

జా : మీరేమున్నా వాళ్లకు కావలసిన బట్టలూ అవి కొనిస్తారు.

(నవ్వులు)

శ : నీవు శుభ్రమైన వంటచేస్తావు.

జా : మీరు పెట్టింది తినిపోతారు.

(నవ్వులు)

శ: నీవు ఎప్పుడూ వినుకోవు!

జా: మీరు ఎప్పుడూ కోప్పడరు.

(నవ్వులు)

శ: నీవు నవ్వుతూ మాట్లాడుతావు.

జా: మీరు ప్రేమతో పలకరిస్తారు.

(నవ్వులు)

శ: నీవు రతీదేవిలాగ ఉంటావు.

జా: మీరు మన్మథుడులాగ ఉంటారు.

(నవ్వులు)

శ: నీవు శక్తికి మీరిన కోరికలు కోరవు.

జా: మీరు శక్తివంచన లేకుండా నాకోరికలు తీరుస్తారు.

(నవ్వులు)

శ: భలే భలె! నిజంగా జానకీ మనం అనుకొన్నవన్ని అక్షరాలా జరిగితీరాలె. ఏమంటావు?

జా: తప్పకుండా.

శ: నిజంగా మనము అల్లాగజరిపితే, జీవితం మధురతమము అయిపోతుంది. సంసారం సాగరం అనీ, దుఃఖకారణమనీ అనేవాళ్లందరికీ కూడా....

జా: బుద్ధి చెప్పినట్లు అవుతుంది.

శ: నిజం అంటావా, కాదంటావా?

జా: నిజం అండి!

శ: ఈ సంగతి చాలామందికి తెలియదుసుమా జానకీ... వెధవలు తెలివి తక్కువ దద్దమ్మలు! పండగ అంటే తినటం అనే వాళ్ల ఉద్దేశము (నవ్వు)

జా: ఇల్లాగ నూతన పంథా కార్యక్రమము ఆలోచించే శక్తి ఏదీ వాళ్లకూ... (విరగబడి నవ్వుతుంది).

శ: అందరి సంగతి ఎందుకు, మీ అన్నయ్యకు తెలుసూ ఈసంగతి?

జా: మీ అన్నయ్యకు మటుకు తెలుసా ఏమిటి!

శ: నూతన సంవత్సరంలో మనము పోట్లాటలు లేకుండా హాయిగా ఆనందంగా ఉంటాము. మీ అన్నయ్యా వదినా పోట్లాడుకుంటూ కొట్లాడుకొంటూ ఉంటారు. ఏమంటావు?

జా: అంతేగా మరి!

శ: పోనీ తనకు తెలియకపోతే నన్ను అడిగి అయినా తెలుసుకోకూడదూ మీ అన్నయ్య? అబ్బో, ఆయన కెంతగర్వం!

జా: పోని నేను చెబుతాలెండి ఈసంగతి.

శ: అందుకనే మరి, నీవు చెప్పబోకు ఈ రహస్యం. వాళ్లను మామూలుగానే ఉండనియ్యి. ఆ గర్వం కొస్త అణగాలె!

జా: సరేలెండి.

శ: మన ఇల్లే స్వర్గసీమ. మనదే ఆదర్శదాంపత్యం. ఏమంటావు?

జా: అంతే లెండి.

శ: ఇల్లాగ తీర్మానాలు చేసుకోవాలె. జీవితాన్ని దిద్దుబాటు చెయ్యాలె. ఈ సంగతి తెలియకపోతే ఏంలాభం? సరే కాని, జానకీ—నేను అల్లాగ వీధిలోకి వెళ్లివస్తాను. నా రంగుల పిట్టా, నా ముద్దుల గువ్వా... ...

జా: చాలు చాలు వెళ్లండి.

శ: (రంగులపిట్ట - నా ముద్దులగువ్వ - అనుకుంటూ వెళ్లిపోతాడు సంతోషంతో)

## నాలుగో రంగం

అదే ఇల్లు

శర్మ - జానకి

స్థలం—జానకి వంట ఇంట్లో శర్మ హాలులో

సమయము: రాత్రి తొమ్మిది.

శర్మ: నా రంగులపిట్ట ఏంజేస్తున్నది? నాముద్దులగువ్వా! (హాలులో చినిగి పోయిన కాయితాలూ గుడ్డపేలికలూ బొమ్మలూ, చిందరవందరగా పడేసి ఉండటంచూచి)—జానకీ కొంపఅంతా ఇల్లాగుండేం?

జా: ఎల్లాగుందండి?

శ: శుభ్రంగా లేదేం?

జా: శుభ్రంగా లేకేమండి?

శ: ఈ కాయితాలూ గుడ్డపేలికలూ, బొమ్మలూ ఇవన్నీ ఏమిటి?

జా: పిల్లలు కాయితాలు చించి పోశారుకామాలు. వాళ్లు అక్కడే ఆడుకొన్నారులెండి ఇందాకటినుంచి!

శ: ఛాఛా. కొంప కొంపగాలేదుగద!

జా: ఎల్లా ఉందండీ?

శ: దరిద్రంగా ఉంది.

జా: పిల్లలుగల ఇల్లు అల్లాగే ఉంటుంది.

శ: (కోపంగా) చాల్లే ఊరుకో.

జా: ఊరుకోక ఉరెట్టుకుంటానా!

శ: ఎట్లా మాట్లాతుందో! ఇకేకామాలు నవ్వుతూ మాట్లాడటం అంటే!

జా: మీరు ప్రేమగా పలకరించటం ఇదేకామాలు!

శ. ప్రేమగానే పలకరించాను రంగులపిట్టా అని.

జా. నాబొంద. ఆమాట అనంగానే సరా! దాని తరువాత!

శ: తరువాత నేనేమీ అనలేను. అదిసరేకాని వంట అయిందా? ఆకలవుతున్నది.

జా: కాలేదు.

శ: కాలేదు. రాత్రి తొమ్మిది గంటలు అయినా ఇంకా వంటకాలేదూ?

జా: ఎట్లా అవుతుందండి? పసిముండ చంకదిగక ఒక్క తీరున పోరు పెట్టింది. ఏంజేసేది? మీరు పెందరాళే ఇంటికి వస్తానని వచ్చారా?

శ: అది వేరే సంగతి. నేను పెందరాళే వస్తే వంట అయ్యేదా ఏమిటి?

జా. ఆ అయ్యేదే!

శ: ఎట్లా అవుతుంది?

జా: మీరు కాస్త పసిదాన్ని చంక నేసుకొంటే నేను అరగంటలో వంట చేసేదాన్ని.

శ. అయితే నన్ను రోజూ పెందలాడే ఇంటికి రమ్మనటం ఇందుకా?

జా: అవును. అయితేనేం తప్పా?

శ: తప్పా అని అడుగుతున్నావు! నా చేత చాకిరీ చేయించుకొంటానికా?

జా: దీనిని చాకిరీ అంటారా ఏమిటి?

శ: మరేమంటారు?

జా: ఏదో ఒకటి అంటారు. పసితల్లిని ఎత్తుకొని ఆడించటంటూ చాకిరీట! ఇంక నే నేంచెప్పేది ఈ మనిషికి!

శ: చాలుగాని ఇక ఊరుకో.

జా: ఊరుకొంటాను. తొమ్మిది గంటలకు ఇంటికొస్తే ఊరుకోక ఏంజేస్తాను! పైగా పెందరాళే ఇంటికి వస్తానని ఒక తీర్మానమూ, ఒక వాగ్దానమూనూ!

శ: బాగుంది. ఆఫీసరు రానీయకపోతే ఏంజేసేది?

జా: రాత్రి తొమ్మిది గంటలదాకా కూర్చోమన్నాడా?

శ: అన్నీ అన్నిగానే ఉన్నయి. మధ్య ఓ స్నేహితుడు కనపడి లాక్కెళ్ళాడు. వాడి దుంపతెగ!

జా: కాఫీ హోటలుకు కదూ!

శ: నీకు అన్నీ తెలుసు!

జా: అవునండి. మీరు కాఫీ హోటలుకే వెళ్లారు.

శ: వెళ్ళబట్టే సరిపోయింది. వెళ్ళకపోతే ఆకలితో మాడేవాణ్ణి. నీవు ఇంత వరకూ వంట చెయ్యకపోతివికదా! 'వంట వేళకు ఎందుకుచెయ్యవూ' అని ప్రొద్దున దీర్ఘాలంతీస్తివే ఏమైంది ఆ ఏర్పాటు?

జా: బాగుందండోయ్! అయితే పిల్లను నేను ఏడవమన్నానా. పోనిద్దురూ. అక్కడికి మీరు చేస్తానన్నవన్నీ మీరు చేసినట్లు!

శ: అన్నీ తు. చా. తప్పకుండా చేస్తున్నాను.

జా: ఆ చేస్తున్నారు! అదేంపని?

శ: ఏమిటి? ఏమిటి చెపుదూ?

జా: ప్రొద్దున మీరు సిగరెట్లు తాగనని చెప్పలేదూ!

శ: చెప్పాను. చెప్పినట్లు చేస్తున్నాను.

జా: ఆ. ఆ నోట్లోదేమిటి. ఒకచెంప తాగుతూనే!

శ: అబ్బ! ఏమి తెలివైనదానివె! ఇది సిగరెట్టా?

జా: ఏమిటిమరి అది?

శ: చుట్ట! చుట్ట తాగుతున్నాను.

జా: ఏదైతే నేమి?

శ: ఏదైతే నేమా! చాలా భేదం ఉంది. నేను సిగరెట్లు తాగనన్నాను. తాగను. సిగరెట్లు తాగనన్నానుగాని, చుట్ట తాగనని నేనేమీ వాగ్దానం చెయ్యలేదు. నీ మోస్తరుగా మాట అని నిలబెట్టుకోలేని రకం కాదు.

జా: నేను ఏమన్నాను, ఏం నిలబెట్టుకోలేను?

శ: నీవు వేళకు వంటచేస్తాననలేదూ?

జా: అన్నాను.

శ: అని ఇదేమిటి?

జా: వేళకు వంటచేయటం అంటే, ప్రొద్దున పది గంటలకు వంటచెయ్యటం అన్నమాట. వేళ అంటే ఆఫీసువేళ. రాత్రిపూట వేళకు వంట ఏమిటి నాబొంద!

శ: తెలివితేటలు ఎక్కువ అవుతున్నవి.

జా: మీదగ్గర చదువుకొన్నాగా!

శ: చాల్లె ఊరుకో. అన్నీ అర్థాలు తీస్తావు.

జా: నేనేమీ తీయటంలేను.

శ: ఇంతవరకు అన్నం పెట్టకపోతివి కడుపులో మాడుతుంటే.

జా: కాఫీ హోటలులో తిన్నాకూడానా?

శ: ఏం తిన్నావు? ఏమీ తినలేదు.

జా: కాఫీ హోటలుకు వెళ్ళొస్తే కాస్త ఆకలితీరింది అనలేదూ మీరు?

శ: అంటే?

జా: అంటే తిన్నట్టుకాదూ? ఎందుకండీ అబద్ధం?

శ: అబద్ధం అంటే కోపం వస్తుంది జాగ్రత్త. ఏమీ అబద్ధంలేదు. నేనేమీ తినలేదు. కాస్త కాఫీ తాగాను అంతే!

జా: ఇంకేం. తింటే ఏం, తాగితే ఏం? అంతా ఒకటే. ఇంటిదగ్గర వాళ్ళు ఎంత అవస్థపడుతున్నారో అని తోచకపోయిన తరువాత!!

శ: కోపంగా మాట్లాడుతున్నావు.

జా: అవును.

శ: ప్రొద్దుటి తీర్మానం ఏమైంది?

జా: మీరు అంతగా మండిపోతుంటే ఇంకా తీర్మానం ఎక్కడుంటుంది.

శ: నేనా మండిపోతున్నది?

జా: మీరే.

శ: నేనుకాదు. నీవు.

జా: మీరే.

శ: చాల్లే. నోరుమూసుకో.

జా: అట్లా ఎంతమాట పడితే అంతమాట అంటుంటే, ఇంకా అపేక్ష ఏమున్నట్టూ?

శ: అపేక్ష లున్నాయి.

జా: (పెద్దగ) లేవు.

శ: (కోపంగా) ఉన్నాయి.

జా: ఉంటే పోట్లాట ఎందుకొస్తుంది?

శ: నీవు ప్రారంభిస్తే వచ్చింది.

జా: నేను ప్రారంభించాను. (విసుగ్గా) చాల్లె ఊరుకోండి.

శ: నువ్వే ప్రారంభించావు.

జా: నేనుకాదు మీరే.

శ: నువ్వే. (కోపంగా)

జా: పోట్లాటలు ఉండకూడదని తీర్మానాలు పైగా!

శ: ఛీ. ఆడది ఇల్లాంటిదైన తరువాత ఎన్ని తీర్మానాలు చేస్తే ఏంలాభం?

జా: విస్తట్లో అన్నం వడ్డించాను. మీ నాన్నను రమ్మని చెప్పవే అమ్మాయీ.

శ: వస్తున్నానని చెప్పమ్మా.



ధర్మాసుపత్రినుంచి ఒడ్డణ్ణి గుడిసెకి తీసుకువచ్చారు. "ఆసుపత్రిలో వుంచడం అనవసరం, ఈ వ్యాధి కుదరదు, కావలిస్తే ఇంటికి తీసుకుపొండి" అని వైద్యుడు చెప్పగా తల్లిదండ్రుల గుండెలలో రాయిపడింది.

పాపయ్య పొలాలలోను, ఇళ్లదగ్గిర, ఏదో కూలినాలిచేసుకొని సంసారాన్ని లాగుకువస్తున్నాడు. మగవాడి సంపాదన తిండికి చాలకపోగా చాయమ్మ అక్కడక్కడ ఇంటిపనులుచేస్తూ, దొరికినపుడు కూలికి పోతూంటుంది.

వాళ్లగుడిసె చెరువు కొమ్ముగట్టుమీద ఉంది. చుట్టూ గడ్డిగాదర, తుప్పలు, తాటిచెట్లున్నూ. అంతా తేమగా, గలీజుగా వుంది. చిన్న చిన్న గుంటలలో నీరు మురిగిన కంపుకొడుతూంది. అదంతా గతిలేని పరిసరాలు. ఆ గుడిసెపక్కనే మరికొన్ని గుడిసెలున్నాయి.

ఒడ్డడు కుక్కిమంచంమీద ఎగశ్వాస దిగశ్వాసగా ఉన్నాడు. ఆశవదలక తలిదండ్రులు మామ్మూలు గచ్చాకు పుచ్చాకు వైద్యం చేయిస్తూనే వున్నారు.

వాలుతూన్న సూర్యుడి కిరణాలు తాటిచెట్ల తలలను ప్రకాశవంతంగా చేస్తున్నాయి; ఎగిరే పక్షిరెక్కల కిందభాగాన్ని బంగారురంగు పూస్తున్నాయి. రోగిని చూడడానికి వచ్చిన పొరుగు గుడిసెల అమ్మలక్కల మొహాలమీద నైరాశ్యం తాండవమాడుతూంది. వాళ్లలో ఒక అమ్మ నోరువిప్పి "తాటితోటకివెళ్లి తాయత్తుతెచ్చి కడితే తగ్గవచ్చు!" అని ఆశాభావం సూచించింది. 'ఔను' అంటే 'ఔను' అన్నారు మిగతవాళ్లు. వాళ్లవాళ్ల అనుభవాలలో నెగ్గిన కేసుల్ని ఉదహరించారు. 'ఈ దారికూడ తొక్కిచూడక తప్పదు' అనిపించింది చాయమ్మకి. 'ఈ వైద్యం కూడ-చేయించడం మంచిదే కాని డబ్బు మాటో!" అనుకొన్నాడు పాపయ్య. అమ్మలక్కలు మొహంమీద దైన్యం వేళ్ళాడుతూండగా నడిచిపోయేరు. రోగిపక్కని పాపయ్య మూగబాధతో కూర్చున్నాడు.

"నువ్వు ఇక్కడేవుండరా. అమ్మగారింటికి వెళ్ళొస్తాను" అంది చాయమ్మ, మనస్సులో ఏదో ఆలోచన మెరియగా. గడప అవతల అడుగుపెట్టగా ఒక ముసలి

టేకుమళ్ల కామేశ్వరరావు

ముష్టివాడు ఎదురయేడు. చాయమ్మ "ఒరేయ్! ఆ మూకుటిలో రేత్రిగంజి వుంది. ఇంకావుంటే సెడిపోద్ది గాని అడికి పోసెయ్యరా!" అని మొగుడితోచెప్పి, గబ గబ వెళ్లిపోయింది.

మునలివాడు "ఇన్ని గంజినీళ్ళు పోయించండి అయ్యా! నడవలేక పోతున్నానండి అయ్యా! మీ పాదాలకి దండమండి బాబయ్యా!" అంటూ ప్రార్థించాడు.

"ఫో! ఫో! గంజిలేదు గట్టాలేదు" అన్నాడు పాపయ్య.

మునిలివాడు కఱ్ఱ పొడుచుకుంటూ వెళ్లిపోయాడు.

ఒక చిన్నపిల్ల వచ్చింది. "ఏదేనా ఉంటే పడెయ్యండి అమ్మా! మొన్నటికాడి నుంచి కడుపుకేమీలేదు బాబయ్యా! మీ పాదాల సొచ్చుండి అమ్మగారూ!" అంటూ సన్నని కంఠంతో దీనంగా అరిచింది.

"ఫో! ఫో! ఏమీలేదు" అని పాపయ్య జవాబుచెప్పగా ఆ పిల్ల వెళ్లిపోయింది. పాపయ్య మోకాళ్ళమధ్య తలపెట్టుకొని కూర్చున్నాడు.

చాయమ్మ తిన్నగా ఒక మేడ ఇంటి ముందుకి వెళ్లింది. ముందున్న కన్నాల సిమెంటు ప్రహారీగోడకి ఆ చివర ఈ చివర పెద్ద ఇనపకమ్మీల గేట్లున్నాయి. చాయమ్మ గేటులో అడుగుపెట్టింది. గేటుకి 'కుక్కలున్నాయి జాగ్రత్త' అనే బల్ల తగిలించిఉంది. ఇంటిముందున్న తోటలో మొక్కలమీంచి తేమతోకూడి చల్లని కమ్మని వాసనకొట్టింది. అమె అడుగులువేస్తే అక్కడినేల పాడైపోతుం దేమో అని అనుమానిస్తూన్నట్టుగా మెల్ల మెల్లగా అడుగులువేసుకొంటూ వసారా మెట్లదగ్గరికి వెళ్ళింది. కిటికీకి కట్టున్న అల్‌శాషియన్ కుక్క బొంయిమని అరిచింది.

చాయమ్మ "అమ్మా!" అని గట్టిగా పిలిచింది.

పిల్లలందరూ గంతులువేస్తూ ఆడు కొంటున్నారు. సావిటిలో మగవాళ్ళు ఏదో వ్యవహారం మాట్లాడుకొంటున్నారు. గుమ్మంముందర కూలివాళ్ళు పందిరి వేస్తున్నారు. స్తంభాలకి కట్టడానికి గెలలు గల అరటిచెట్లు, పచ్చని కొబ్బరి అకులు అక్కడక్కడ పడున్నాయి. ఒక పనివాడు తోటలో చిన్న చిన్న ఎలెక్ట్రిక్ బుట్లకి, ఎఱ్ఱని, పచ్చని, నీలి మొదలైన రంగుల కాగితాలు చుట్టి మొక్కలకి తీగెనమేతంగా కట్టి అలంకరిస్తున్నాడు. చాయమ్మకి ఈ సందడి అర్థంగాలేదు. ఆ తోటలో వాడికే సాయంచేస్తూన్న మరొక కుఱ్ఱవాడి దగ్గరికి వెళ్ళి "ఏంటి బాబూ! ఇసేసం?" అని అడిగింది.

"పెద్దమ్మాయిగారికి పెళ్ళి!"

ఇంటిలో వండుతూన్న అరిసెల వాస నను పసిపట్టి "ఔను!" అని చాయమ్మ అనుకొంది. సింహద్వారంవైపున ఆమె కేకకి సమాధానం రాకపోగా, తూర్పువైపు గుమ్మందగ్గరికి వెళ్ళి కేకవేద్దామనుకొంది. బయలుదేరింది. అక్కడ కారుడ్రైవరు గారేజిలోంచి మోటారుకారుని బైటపెట్టి అంతా సరిచూస్తున్నాడు. చాయమ్మ గుమ్మందగ్గిర నిల్చుని "అమ్మా!" అంటూ కేకబెట్టింది.

ఆడుకొంటూన్న పిల్లలూ "పో! పో!" అంటూ బదులుచెప్పేరు.

"అబ్బాయిగారూ!" అంటూ చాయమ్మ పిలిచింది.

గంతులువేసుకొంటూ ఒక కుర్రవాడు ఇవతలకి వచ్చాడు.

"అమ్మగారితో చాయమ్మ వచ్చిందని ఒకపాలి చెప్పండి!" అని బతిమాలు కొంది.

ఆ పిల్లవాడు వెళ్లిపోయేడు.

ఇంటిలోంచి గుప్పుమని అత్తరువు వాసన, తలనూనెవాసన వ్యాపించాయి.

"మాయమ్మ దర్శనమే లేదు!" అనుకొంటూ చాయమ్మ నిల్చుంది.

పాపయ్య గుడిసెదగ్గరకి ఒక మొండి బండవాడు వచ్చాడు. వాడిచుట్టూ పిల్లలు చేరేరు. కుక్కలు దూరంగా నిల్చుని అరుస్తున్నాయి. వాడు "గెంజి! గెంజి!" అని అరిచాడు.

పాపయ్య "గెంజిలేదు, పానకంలేదు పోరా!" అన్నాడు.

వాడు పోయేడు.

ఒక బుడబుడక్కలవాడువచ్చి బుడబుడమని డమరుకం వాయిస్తూ సోదె చెప్తున్నాడు.

పాపయ్య గట్టిగా "ఇంటిలో ఎవరూ లేరు, పో" అన్నాడు.

చాయమ్మ అరుపులువిని ఇంటి యజమాని వచ్చి "ఎందుకమ్మీ! అలాగు ఉట్టినే అరుస్తావ్, బాజాభజంత్రీలతో బేర మాడుకొంటూాంటేను" అని అడిగేడు.

"అమ్మగారికోసం వచ్చానండి అయ్యగారూ!" అంది.

"ఏమి? పనికి అమ్మ రమ్మందా?"

"ఉ" అని చాయమ్మ అబద్ధమాడింది.

ఆయన వెళ్ళి ఇల్లాలితో చెప్పేడు. ఆమె తళుకులతో, పట్టుచీరె మిలమిలలతో ఇవతలకవచ్చి "ఎందుకేవచ్చావు?" అని అడిగింది.

"మీ ఇంటిలో చాకిరీచేసి తీర్చుకుంటానమ్మా రెండు రూపాయలుంటే దయచేయించండి! ఎంతేనా పున్నెముంటుందండి. బిడ్డను బతికించిన వాళ్లవుతారండి అమ్మా! మీ పాదాలే సాచ్చి! బిడ్డకి ఎంతేనా జబ్బుగావుందండి తల్లి! రచ్చించండి అమ్మగారూ!" అంటూ గుక్క తిప్పకోకుండా చెప్పకొంటూాండగా, ఇంటావిడ "కిందటిమాటు బాకీడబ్బులు తీర్చుకొన్నావా?" అని అడిగింది.

"అయా ఇయాకూడ కలిపి తీర్చుకుంటానండి అమ్మగారూ! కడుపుకులేక కూలికిపోయేనండి అమ్మా! లేదనకండి అమ్మా! ఏదో పొరపాటొచ్చింది, ఛమించండి అమ్మా!" అంటూ బతిమాలుకొంది.

"ఆ డబ్బులే తీర్చుకోనిదానివి, మళ్లీ డబ్బులిస్తే అవీ ఇవీకలిపి తీర్చుకుంటా! పో! పో! కావలిస్తే పనిచేసుకొని నెల అయేక జీతంపట్టుకెళ్లు" అంది ఇల్లాలు.

"కాదండి అమ్మా!"

"కాదండి లేదు, అవునండి లేదు! ఇంటిలో పనితోటే మేము ఊపిరాడక అవస్థపడుతూాంటే ఇదో గోలా మాకు! ఇప్పుడు మాకేమి ఆలోచించడానికి టైంలేదు పో. మరొకప్పు డెప్పుడేనా తీరుబాటుగారా!" అంటూ ఇల్లాలు, మరిమాట వినిపించుకోకుండా వెళ్లిపోయింది.

చాయమ్మ ఒక్క క్షణం మానుపడి నిల్చుంది. నడవడానికి కాళ్ళాడలేదు. చేతులుజోడించి 'దేవుడేగతి!' అను కొంటూ అడుగువేసింది.

గుడిసెలో ఏమీ కనబడడంలేదని పాపయ్య దీపం వెలిగించాడు.

ఒక కుష్ఠువాడువచ్చి "ఏదో ఇంత గంజినీళ్లు పోయించండి అమ్మా!" అని అరిచేడు. కాని సమాధానంరాకపోగా ముందుకుపోయేడు.


నెత్తిమీద అమ్మవారిపెట్టి కిందికిదింపి దారిలోపెట్టి, సన్న కొనగల మోకుతో, ఒంటిని టపటప బాదుకొంటూ 'మల్లే లమ్మా! మల్లేలమ్మా!' అని నృత్యం చేస్తూ ఒకడు పాపయ్య గుడిసెముందరికి వచ్చేడు. 'ఏదేనావుంటే ఇంత పడె య్యమ్మా!' అని అడిగేడు. లోపలినుంచి సమాధానం రాకపోగా ముందుకి అడుగు వేశాడు.

చాయమ్మ అడుగులు లెక్కపెట్టు కొంటూ కొంపకి బయలుదేరింది. చీకట్లు కాలమేఘాలలాగు ఆవరిస్తున్నాయి. అలవాటయినదారి అవడంబట్టి ముందుకి నడకసాగిస్తూంది. గుడిసెముందు ఒక ముసలిముద్ద, ఒకకఱ్ఱ ఆధారంగావంగుని, రెండోచేతితో వణుకుతూన్న మూకుడు పట్టుకొని 'సందాకవళం పెట్టించు అమ్మా. నాలుగునాళ్ళనుంచి గంజిలేదు తల్లీ! బతికించు అమ్మా!" అంటూ హీనస్వరంతో బతిమాలుతూంది.

గుమ్మంలోకి అడుగుపెట్టింది చాయమ్మ. దీపందగ్గిర కూర్చున్న మొగుడితో "ఆ గంజినీళ్ళు పోశావురా?" అని అడిగింది.

"ఏమో? నేనుచూశానేంటి. నచ్చినోడి లాగు ఏమీతోచక నేను పడుంటే!" అన్నాడు మొగుడు.

చాయమ్మ గంజిచట్టిని తియ్యా బోయింది. కాని తీసేముందు మంచం మీద బిడ్డణ్ణి చూద్దామని దీపం ఎత్తింది. రోగికళ్లు అరమూతలుగా ఉన్నాయి. ఆమెచేతులు వణికాయి. దీపం కింద పడిపోయింది. కొయ్యబారిన బిడ్డడు చేతికి తగలగా, కెవ్వున కేకవేసింది. పాపయ్య మొఱ్ఱోమన్నాడు. ఆమె బిడ్డణ్ణి చేతులలోకి తీసుకొని గుడిసె ఇవతలకి అడుగువేసింది. కాళ్ళకి ఏదో మెత్తగా తగిలింది. దృష్టి మరలించింది. ముష్టి ముసలిది దారికి అడ్డంగా చచ్చిపడుంది.






"కిష్టయ్యా, నేను నీకన్నా పెద్దవాణ్ణి: చెప్పుతున్నాను. విను. పిల్లను పంపించడము మంచిది" అన్నాడు అంజయ్య.

"అదే ఆలోచిస్తూ ఉన్నాను. అమ్మాయి అభిప్రాయము కనుక్కోవలెను. అదేమీ చిన్నదికాదు. బి. ఏ. ప్యాస్ అయింది. మైనారటీకూడా వెళ్ళిపోయింది."

"ఇదుగో చూస్తూఉన్నాను. నీదిఒకటే ధోరణి. ఇంకా కాకపోతే మీరు భార్యాభర్తలు ఇద్దరూ మీ అమ్మాయిని అడిగి తెలుసుకోండి. దానికి తెలియకపోతే నచ్చ చెప్పండి. అంతేకాని ఈ ఉత్త ఉత్త వాయిదాలు వేయవద్దు."

"అందుకే ఎల్లుండివరకూ వాయిదా అడుగుతున్నాను."

"ఇంక వాయిదాలేదు. సాయిదాలేదు. మీఅల్లుడు మీకు మూడుఉత్తరాలు వ్రాసినాడు. ఒక్కదానికీ మీరు జవాబువ్రాయలేదు. తీరళ్లా వాడు మమ్ములను వెంటపెట్టుకొనివస్తే ఇంకా మూడురోజులు వాయిదాఅంటున్నావు. లాభములేదు. రేపు ఉదయము జనతా ఎక్స్‌ప్రెస్‌లో మేము వెళ్లిపోతాము. మరిఒకమాట చెప్పకుండా మీ అమ్మాయిని ప్రయాణము చేసి ఉంచండి," అంటూ అంజయ్యలేచినాడు.

"కిష్టయ్యబాబూ, అమ్మాయిని పంపించు, సుఖపడుతుంది." అంటూ అంజయ్యభార్య సుభద్రమ్మ చెప్పింది. అంజయ్యా సుభద్రమ్మా,వారితో కృష్ణయ్య అల్లుడు కోటయ్యా లేచి వెళ్ళిపోయినారు. వాండ్లు వెళ్లుతూఉంటే కృష్ణయ్యచూస్తూ ఊరకున్నాడు. ఆయనభార్య సంపదమ్మ లోపలినుంచివచ్చి పెనిమిటిని తీవ్రముగా చూస్తూ "భోజనానికి అయినా ఉండ మనక్కరలేదా?" అంది.

"చాలులే. అసలు రేషణ్‌తో చస్తూ ఉంటే....లంఘణాలలో మనుగుడుపులట...ఇంతకూ నీ కూతురు వాళ్లతో పోతాను అంటూఉందా?"

"అయితే పోనుఅని మీతో ఏమైనా చెప్పిందా?"

శ్రీనివాస శిరోమణి

"ప్రశ్నకు ప్రశ్న జవాబుకాదు."

"వాళ్లు దానిని పంపించమంటూ వచ్చినారు. పంపిస్తా అనో పంపించము అనో చెప్పవలెను: కాని ఈ వాయిదాలు ఏమిటి ?"

"సరే ముందు నీ సంగతిచెప్పు."

"పంపించటమే - నా ఉద్దేశము."

"ఆ పల్లెటూళ్లో - మన అమ్మాయి - ఆ జంతువులలో కాపురము చేయకలదా?"

"మనమూ ఆ జంతులలోనుంచే వచ్చాము."

"ఛా ఛా. మాట్లాడకు...నీవు ఒక జంతువు."

ఇంతలో శాంతవచ్చి "అమ్మా, నాన్న గారికి కోపం తెప్పించకు. కాపురానికి పోవలసింది నేను. మీరు ఇద్దరూ తకరారు పడటము దేనికి?"అంటూ తల్లినిసర్దింది.

కృష్ణయ్య కుర్చీలో చేరగిలబడి పోయి నాడు. ఆకాశమువంకచూస్తూ ఆలోచనలో పడ్డాడు. దరీ త్రోవా కనుపించలేదు. "శాంతా"అనిపిలిచినాడు."ఓయ్"అంటూ శాంతవచ్చి ఎదుట నిలుచున్నది. "మరి ఏమి ఆలోచించినావు" అని అడిగినాడు.

"నాకేమీతెలియదు" అన్నది శాంత.

"మీఅమ్మ ఏమి సలహాచెప్పింది ?"

"ఏమీ చెప్పలేదు."

"మరి ఎట్లా ?"

"ఏమో"

"నేను చెప్పతాను, విను. నీవు బి.ఏ. ప్యాస్ అయినావు. రేపోమాపో నీకు ఉద్యోగము వస్తుంది. మరి నీ పెనిమిటిది పల్లెటూరు. వాడు నాల్గోక్లాసు చదివినాడు అనుకొంటాను. మరి నీవుపోయి ఆ పల్లె టూళ్లో వాళ్లతో వేగకలవా? ఏమంటావు?"

"నాకు ఏమీ తోచటములేదు."

"అందుకే నిదానముగా సాధక బాధకాలు ఆలోచిద్దాము."

"మరి వాండ్లు తొందరపెడుతున్నారుగా ?"

"వాండ్ల తొందరకు ఏమిలే."

ఇంతలో సంపదమ్మ అందుకొని "అవును. అవును. ఇట్లాగే ఏడేండ్లు నిదానించినారు. మరి మీరు ఏమి ఆలోచన చేసి దీనిని చదువులోకి దింపినారు ? మీ దిక్కుమాలిన వాయిదాలనుంచే తక్కిన ఇద్దరు పిల్లలకూ ఇంతవరకూ పెళ్ళిళ్ళు కాకుండాపోయినవి. వీండ్ల చదువులు పాడుఅయిపోను! కొంప దివాలా అయి పోయింది," అంటూ ఎగరొప్పతూ నిలుచున్నది.


"ముందు నీవు అవతలకుపో—నిన్నెవరు పిల్చినారు." అన్నాడు కృష్ణయ్య.

"చాలు చాలు మీకు తగిపోయింది; ఈడేరిన పిల్లలను ఇంట్లో అట్టిపెట్టుకొని నిబ్బరముగా...."

"ఇదుగో నీవు మాట్లాడినావూ అంటే..."

"అమ్మా ఊరకోవే" అంది శాంత.

కృష్ణయ్యకు ఒండ్లు తెలియని కోపము వచ్చింది. కిక్కురుమనకుండా బయటికి వెళ్ళిపోయినాడు. ఇంతకూ ఈవిధముగా పరిణమిస్తుంది అని కృష్ణయ్య ఎన్నడూ



కలలోనైనా అనుకోలేదు. తీరల్లా సమయము వచ్చేసరికి ఏమిచేయవలెనో పాలుబోలేదు.

ఏడు సంవత్సరాలనాడు కృష్ణయ్యా రామాయపాలెములో పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు పని చేసినాడు.

అప్పుడు శాంతకు పధ్నాలుగు ఏండ్లు వయస్సు. కోటయ్యాకు ఇచ్చి పెండ్లి చేసినాడు. కోటయ్యా తండ్రీ తల్లీ చాలా మంచివాండ్లు అనీ, పల్లెటూరివాండ్లు అయినా చాలా మర్యాదస్థులు అని అప్పుడు ఆ సంబంధము చేసినాడు. పయిగా ఆడపిల్లలకు చిన్నప్పుడే పెళ్ళి చేయటము మంచిది అని అప్పుడు అనుకొన్నాడు. వియ్యంకుడు నరసయ్యాకూడా పోలీసు అధికారి తన కూతురిని ఇస్తాను అంటున్నాడు. కొడుకు వృద్ధిలోకి వస్తాడు అనుకొన్నాడు. అందరూ బాగుంది అంటే బాగుంది అన్నారు. పెద్దలు పెళ్లిముహూర్తము నిశ్చయించినారు. కూతురికి కృష్ణయ్యా వెయ్యి రూపాయలు నగలు పెట్టేట్టూ నరసయ్యా కోడలికి అయిదువందల రూపాయలు ఓలి ఇచ్చేటట్టూ ఏర్పాటు చేసుకొన్నారు. తీరల్లా పెండ్లినాడు కృష్ణయ్యా కూతురికి వెయ్యిరూపాయల నగలూ పెట్టలేక పోయినాడు. కాని నరసయ్యాదగ్గిర అయిదువందల రూపాయల ఓలి రకాయించి పోలీసు జబర్దస్తీతో వసూలుచేసినాడు. ఆ తరువాత ఆ అయిదువందల రూపా

యలూ కృష్ణయ్య పులుసులో వేను కొన్నాడు. పదిహేనువందల రూపాయలకూ నగలుపెట్టి కోడలిని కాపురానికి పంపించమంటూ వచ్చినాడు నర్సయ్య. అట్లాగే నగలతోనే పంపిస్తాను అంటూ కాలక్షేపము చేసినాడు కృష్ణయ్య.

కాలము గతించింది. దైవికముగా కృష్ణయ్యకు ఆ ఊరునుంచి బదిలీ అయింది. చివరకు మద్రాసులో పెద్ద ఇన్స్పెక్టరు హోదాలోకి వచ్చినాడు. కూతురికి నగలు చేయించి అత్తవారి ఇంటికి పంపించవలెను అని కొంతకాలము అనుకొన్నాడు. కాని జతపడలేదు. పాపము ఎంత సంపాదించినా చాలేదికాదు. ప్రతి రోజూ ముక్కా - ముక్కతోపాటు చుక్కా అలవాటు అయిపోయిందేమో ఎంత వచ్చినా ఏనుగులు తిన్న వెలక్కాయల మాదిరిగా అయిపోతూ ఉండేది. ఇక కూతురి కాపురము తెల్లవారినట్టే నను కొన్నాడు. అందువల్ల శాంతను చదువులో పెట్టినాడు. అమె చదువులో చిచింద్రీ మాదిరిగా తయారు అయింది. ఇట్టే బి. ఏ. ప్యాస్ అయింది. తక్కిన ఇద్దరు ఆడపిల్లలుకూడా ఇంటర్మీడియేట్ స్కూలుఫైనల్ క్లాసులకు వచ్చినారు. కృష్ణయ్యకు వయస్సు మళ్లింది. ఫించన్ పుచ్చుకోవలసి వచ్చింది. పిల్లల చదువులకూ బండి దొర్లించడానికి అలవికాని రోజులు వచ్చినవి. పగటిపూట ముక్కా రాత్రిపూట చుక్కా మానివేసినాడు. కాని బోటు ఏ క్షణమో అడుగుపట్టేట్టుగా ఉంది. అయితే శాంత ఆ సంవత్సరము బి. ఏ. కావడము మేలు అయింది. కృష్ణయ్యకు ప్రాణము లేచివచ్చింది. ఆమెకు పోష్టల్ డిపార్టుమెంటులో ఉద్యోగముకోసము భగీరథ ప్రయత్నము చేస్తూఉన్నాడు. ఇక తన కష్టాలు గట్టెక్కబోతున్నవి అను కొంటున్నాడు. బ్రహ్మానందములో ఉన్నాడు.

ఇట్లాంటి సమయములో కోటయ్య పెండ్లాన్ని పంపించవలసింది అంటూ వారానికి ఒక ఉత్తరముచొప్పున మూడు వారాలు మూడు ఉత్తరాలు దూకించినాడు. నగలూ అక్కరలేదు - నాణ్యాలూ అక్కరలేదు. ఇష్టము అయితే శాంతను కాపురానికి పంపించవలసింది అనీ లేక పోయేట్లయితే వేరే పిల్లనుచూచి పెండ్లి చేసుకొంటాను అనీ ఆఖరు ఉత్తరములో తెలియచేసినాడు. పాపము కృష్ణయ్యకు మింగుడుపడలేదు! మొగుణ్ణి వదులుకోమని కూతురితో చెప్పలేదు! ఉద్యోగ ప్రయత్నము కట్టిపెట్టడానికి అంతకన్నా మనస్సు ఒప్పలేదు. తల్లిమాత్రము ఏది ఏమి అయినప్పటికీ కూతురు కాపురానికి వెళ్ళవలసిందేను అని పట్టుపట్టింది.

శాంత ఎటూ నిర్ణయించుకోలేక పోయింది. బుద్ధితెలిసిన తరువాత పల్లెటూళ్లో ఎన్నడూ ఉండలేదు. పయిగా పెనిమిటికి చదువురాదు అనీ, అత్తమామలు పొలముపోయి పనులుచేసే

వాడు అని చెప్పినారు. ఏవేవో పిచ్చి పిచ్చి ఊహలు అన్నీ బుర్రలో దూరినవి. ఇంతలో, నాల్గో వారమూ వచ్చింది. కోటయ్యా అతని మేనత్త సుభద్రమ్మా ఆమె పెనిమిటి అంజయ్యా వచ్చినారు' పల్లెటూరివాండ్లు అయినా మహా బెట్టు సరిగా ఎక్కడో అన్నము తిని కృష్ణయ్య ఇల్లు వెతుక్కుంటూ వచ్చినారు. ఎక్కడ బస చేసిందీ వాళ్లు చెప్పనూ లేదు, కృష్ణయ్యా అడగనూలేదు. వాండ్లు అంత సేపూ మాట్లాడి వెళ్లుతూఉంటే ఆ రాత్రి భోజనానికి అయినా వాండ్లను తండ్రి ఉండమనలేదే అని శాంత కించపడ్డది. అయితే అనుభవిస్తున్న దారిద్ర్యము ఆమెకు తెలియకపోలేదు. ఇక తాను ఉద్యోగములో చేరి తండ్రికి సంపాదించి పెట్టటమా, లేక కాపురానికి పోవటమా అనే తికమకలో పడ్డది. పెనిమిటి చదువు రానివాడు అయితే కావచ్చును. కాని అనాకారివాడుగా కనుపించలేదు. మంచి యౌవనములో ఉన్నాడు. దేహదార్ఢ్యమే కాకుండా లోకజ్ఞానము ఉన్నవాడుగా కూడా తోచినాడు. "అమ్మా అమ్మా" అంటూ నిద్రపోతూఉన్న తల్లిని శాంత లేపింది.

"ఏమిటే అర్ధరాత్రివేళ" అంటూ తల్లి లేచింది.

"అమ్మా మెల్లిగా మాట్లాడు - మా అత్తగారినీ మా మామగారినీ నీవు ఎరుగుదువా?"

"అయ్యో అదేమిటే మేము ఆ ఊళ్లో ఉన్నఅన్నినాళ్లూ వాళ్లేకాదుటే మాకు అండ. మీ అత్తగారికి ఒకరు ఇద్దరుకాదు. ఆరుగురు ఆడపిల్లలు. మీ ఆయన ఒక్కడే మొగపిల్లవాడు."

"వాళ్లందరికి పెళ్ళిళ్లు అయినవా?"

"అదేమి కర్మమే - నలుగురికి పెళ్లిళ్లు అయినవి. వాళ్లు కాపురాలు చేస్తూ ఉన్నారు. పెద్దదాని పెనిమిటి ఆఊళ్ళోనే ఉన్నాడు. రెండోదాని మొగుడు రెవెన్యూ ఇన్‌స్పెక్టరు. మూడోదానిని ఒక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుకు ఇచ్చినీ పెండ్లి అప్పుడే పెండ్లి చేసినారు. నాల్గోదాన్ని ఎవరికి ఇచ్చినారో తెలియదు. ఇంతకూ మీ అత్త గారు ఎంత మంచిది అనుకొన్నావు!"

"అయితే మరి ఎన్నడూ మనఇంటికి రాలేదేం?"

"మరి మీనాన్నపెట్టిన పేచీనుంచి ఏ ముఖము పెట్టుకొని వస్తుంది -"

"అమ్మా వాండ్లకు స్థిరాస్తి ఏమి అయినా ఉందా?"

"సరేలే, నర్సయ్యగారు అంటే బంగారము పండిస్తారు అని లోకము అంతా చెప్పుకొంటారు. ఆయనకు సొంత పొలము నాలుగో అయిదో యకరాలు ఉంది అనుకొంటాను. కాని బాపనవాండ్ల పొలాలు అన్నీ కౌళ్లకు తీసుకొని చేయిస్తూ ఉంటాడు. ఎన్ని బఱ్ఱెలు ఎన్ని ఆవులూ, ఎంతమంది జీతగాండ్లూ! అబ్బో వాండ్ల అదృష్టము చెప్పతరమా."

"అయితే...."

"అయితే లేదు - గియితే లేదు. మీ నాయన పోలీసు దర్జాకుపోయి నీ కాపురానికి ముప్పతిప్పలు తెచ్చిపెట్టినాడు."

"అమ్మా - ఆ ఊళ్లో మంచినీళ్లు కాలవనుంచి తెచ్చుకోవలసిందేటగా - ?"

"ఓసి నీకడుపుడకా, నీభయము అదా! నిన్ను కాలవకుపోయి నీళ్లు తెమ్మంటారేమోనని అనుకొంటున్నావా? సరి సరి. మీనాయన కాబట్టి నిన్ను బజారుకు పోయి వెచ్చాలు తెమ్మంటాడు: మార్కెట్టుకుపోయి కూరా నారా తెమ్మంటాడు. ...బ్రాహ్మణుల అడవాండ్లూ వడ్డెవాండ్ల అడవాండ్లు తప్ప మన కాపుల ఇండ్లలోనూ కమ్మవారి ఇండ్లలోనూ అడవాండ్లు ఎప్పుడూ నీళ్ళుతేరు. బ్రాహ్మణుల అడవాండ్లమాదిరిగా పదిమంది ఎదుటా కాలవలో మునిగి - పాడు - తడిచీరలతో వీధులలో బిందెలు ఎత్తుకొని వస్తూఉంటే మన ఇండ్ల ఏ మొగవాడు ఒప్పుకొంటాడు? - పిచ్చిదాన! నిశారున నిల్చుని భావుల దగ్గిర నీళ్లు నెత్తిన దిమ్మరించుకోవడము బాపన అడవాండ్లకు తగిపోయింది కాని మన ఇండ్లలో అట్లా చేయనిస్తారా..."

"అయితే అంట్లు తోమడం..."

"ఓసి వెర్రిబాగులదానా, ఉద్యోగస్తుడి పెండ్లాము అయితే అంట్లు తోముతుంది. గుడ్డలు ఉతుకుతుంది. పాచిపని చేస్తుంది. రైతుల ఇండ్లలో కసవు ఊడ్చి కలాపి పెట్టేది జీతగాండ్లు, అంట్లు తోమేదీ గుడ్డలు ఉతికేదీ చాకలివాండ్లు! సాయంకాలము పక్కలు పరచేదిన్నీ చాకలివాండ్లే - వాండ్లకు కావలసినంత అన్నము పెట్టుతారు. వాండ్లు ఆ పనులుఅన్నీ చక్కగా చేస్తారు."

"ఏయ్ - చాలులే - నీ లెక్చరు. సంతోషించారులే." అంటూ కృష్ణయ్య గదమాయించినాడు.

"ఇక కొమార్తెకు తాము ఉద్యోగ తిరుమంత్రోపదేశము చేయండి" అని సంపదమ్మ మెదలకుండా పడుకొన్నది.

* * *

తెల్లవారబోతూ ఉంది. సుభద్రమ్మా అంజయ్యా వచ్చినారు. నిద్ర మంచముమీదనే కృష్ణయ్యను పట్టుకొని "కిష్టయ్యా, అమ్మాయి ప్రయాణానికి సిద్ధముగా ఉందా? నీకు తెలియదున్నూ - నీ అల్లుడు కోటయ్య ఎంతో బుద్ధిమంతుడు. తెలివిఅయినవాడు. నీకూతురిని సుఖపెట్టుతాడు. నిన్ను అదుకొంటాడు," అన్నాడు.

"నాది ఏముంది? అది వస్తానంటే - అయినా దానికి చీరలు ఉన్నవో లేవో-రెండు రోజులు అయినతరువాత..."

"అదుగో మళ్ళీ మొదలుపెట్టినావు. నరసయ్యకు ప్రాణము మీదికి వచ్చింది. కోడలను చూడవలెను అనుకొన్నాడు. పాత తగూలు అన్నీ మరిచిపోయినాడు. ఇకను ఇప్పుడు నీవు కాదు అనవద్దు," అంటూకృష్ణయ్య ఏమిజవాబుచెప్పేదీ విని

...చుకోకుండానే లోపలికి పోయినాడు. లోపల సుభద్రమ్మ శాంతను బుజ్జగిస్తూ ఉంది. శాంత, "పెద్దమ్మగారూ, నాల్గు రోజులు పోయినతరువాత..." అంది.

"నాల్గురోజులు పోయినతరువాత నిన్ను ఎవరు అక్కడికి తీసుకొని వస్తారు? అక్కడికి రావడానికి మీ నాయనకు ఏమో ముఖము చెల్లదు. నీవు ఎట్లా వస్తావు?"

"నేనే వచ్చేస్తాను."

"నీవు ఒక్కతెవూ రావటము ఉత్తది. సరే ఎవరి కర్మము ఎట్లా ఉందో-" అంటూ పెనిమిటిని చూచి "పదండి" అన్నది. కాని కదలకుండానే "ఓ సంపదమ్మా, నీ అల్లుడు కారుతెస్తాను అని పోయినాడు. వాడు రాగానే మేము వెళ్ళుతున్నాము. మమ్ములను కాస్త జ్ఞాపకము ఉంచుకో. నీవు నీ కూతురుతో చెప్పేది ఏమిఅయినా ఉంటే నీ అల్లుడు వచ్చే లోపలనే చెప్పవమ్మా" అంటూ బయటికి నడిచింది.

శాంత దిగాలుపడి కూర్చుంది. సంపదమ్మ కూతురిని మిర్రి మిర్రి చూస్తూ "ఇంతకూ ప్రయాణము మానుకొన్నావు అన్నమాట?" అంది.

"అట్ల ఉండవే."

"నీ మనస్సులో ఉంది ఏదో కాస్త వెళ్ళబెట్టుదూ."

"పల్లెటూరు."

"పోయి చూడనిదే ఆ కష్టమూ సుఖమూ ఎట్లా తెలుస్తుంది?"

"బాగుండకపోతే?"

"అప్పుడు ఆలోచించవలెను."

"చదువులేదే అని..."

"అదిగో అదే మళ్ళీ మొదలుపెట్టినావు. నీకూ మీ నాయనకూ ఒకటే జబ్బు."

"అదికాదే అమ్మా, చదువుకొన్న వాండ్లకూ చదువుకోనివాండ్లకూ తేడా..."

"ఆ చూస్తూనే ఉన్నాను. మీ నాయన బి. ఏ. ప్యాస్ అయినాడు. నాకు ఓనమాలు అయినా రావు. నేను లేకుండా మీ నాయన్ను ఒక్క వారమురోజులు ఉండమను. చూద్దాము."

"అదికాదులేవే - ఆడవాండ్ల సంగతి వేరు"

'నీ బుర్రకాయ. బి. ఏ. ప్యాస్ అయితే కాని ఈ ప్రపంచములో మనుష్యులు మొగవాండ్లు కారుఅంటావా?"

"తల్లక్రిందులుగా మాట్లాడకే అమ్మా"

"ఏమిటే-తలకిందులు. బి. ఏ. ప్యాస్ అయి ముప్పయి ఏండ్లు పోలీసు ఉద్యోగము జమాయించిన ఆయనకు అక్షరాలు రాని ఆడుది వంటఇంటికి పడకటింటికి పనికివచ్చింది - బి. ఏ. ప్యాస్అయిన ఆడుదానికి చదువురానివాడు పనికిరాడు! దేనికి పనికిరాడో చెప్పు..."

"చాలులే నీ వితండవాదము" అని శాంత నవ్వింది.

"ఏమిటే నీ గోల - వాండ్లు మోటవాండ్లు అనేనా?"

"ఇక మాట్లాడకు" అంటూ శాంత తళ్ళా మందహాసము చేసింది.

ఇంతలో వీధిలో కారుచప్పుడు అయింది. కోటయ్య అంజయ్య సుభద్రమ్మ ముగ్గురూ ఇంట్లోకి వచ్చినారు. శాంత రాను అనేట్లయితే వాళ్లు అమాంతమూ అమెను ఆ కారులో పడవేసుకొని పోయే ధోరణిలో కనిపించినారు. శాంత గమనించింది. పెట్టెబేడా గబగబా సవరించుకొంది. కృష్ణయ్య కిమిన్నాస్తి.

కోటయ్య మామగారి పాదాలకూ అత్తగారి పాదాలకు నమస్కారము చేసినాడు. శాంత అదేపని చేసింది. కారు తుర్రుమంది.

* * *

శాంత అత్తవారి ఇంటికి వెళ్ళిపోయి ఆరు నెలలు అయింది. రామాయపాలెము చేరినరోజున వ్రాసిన ఉత్తరము తప్ప మరి జాబులేదు. సంపదమ్మకు కొంచెముఅయినా తోచడములేదు. సుఖముగా ఉంటూఉన్నందువల్లనే ఉత్తరమూ పత్రమూ లేదు అన్నాడు కృష్ణయ్య. సంపదమ్మ నిబ్బరించలేకపోయింది. కురుపు సలిపినట్టు కృష్ణయ్యను సలపడము మొదలుపెట్టింది.

సకుటుంబంగా రామాయపాలెము ప్రయాణముఅయి పోయినారు.


లంకఅంత ఇల్లు. ఎటుచూచినా ధాన్యపు రాసులు. ఆవులూ బర్రెలూ - పిల్లకోళ్ళు—

శాంత కళకళలాడుతూ అంత పొడుగునా ఇంత లావునా కనిపించింది. అట్లా ఉన్న తమ అక్కనుచూచి చెల్లెండ్లు ఇద్దరూ ఆశ్చర్యపోయినారు. రెండో చెల్లెలు కొంచెము మాటకారి. "అక్కయ్యా రోజూ గారెలూ అరిసెలూ తింటున్నావా - లేక రోజుకు ఒక కన్నె పెట్ట చొప్పున తింటున్నావా ఇంతలావు అయినావు" అని అడిగింది.

"ఛా ఊరుకో" అంటూ సంపదమ్మ రహస్యముగా "అమ్మాయి నీవు నీళ్ళు పోసుకొని ఎన్నినాళ్లు అయిందే" అని అడిగింది.

శాంత సిగ్గుపడి నవ్వుతూ వూరకుంది.

సంపదమ్మకు పట్టరాని సంతోషము వచ్చింది. కూతురుని గట్టిగా కౌగలించుకొంది.






హనుమాయమ్మ కాపరానికొచ్చి ఆరేళ్ళ యిందికాని సంతానం కలుగలేదు. పల్నాటివీరుడైన బాలచంద్రుణ్ణి కనటానికి ఐతాంబ నోచిననోములన్నీ మాలక్ష్మమ్మ గారు కోడలిచేత నోపించింది కాని ఆ అమ్మాయికి నెలమాత్రం తప్పించలేక పోయింది! కాఫీపొడుముకీ కందిపప్పుకీ అప్పుకొచ్చిన అమ్మలక్కలు వేళాకోళంగా, 'ఏమె హనుమానూ, మేమంతా పొరివుండకోసం కనిపెట్టు క్కూచుంటే నువ్వలాగ వూరుకోడం బాగుండలేదు!' అనేవారు. హనుమాయమ్మకది ప్రాణ సంకటంగా పరిణమించేది. ఆ ప్రసక్తి వచ్చినప్పుడల్లా మాలక్ష్మమ్మ ముఖం చిట్లించుకుని, ఆ పిల్లకి వినపడేటట్లే, 'మాచమ్మ!' అనీ 'గొడ్డుది!' అనీ తడుతోండేది. 'ఇలా అంటూంది మీఅమ్మ!' అని సేతురామయ్యతో ఆపిల్ల మొఱపెడితే 'ఉన్నమాట అంటే వులుకెందుకు?' అన్నాడా మగమహారాజు.

సేతురామయ్యకి జ్యోతిషంరాదు కాని అందులో అతగాడికి చాలానమ్మకంవుంది. కనపడ్డ జ్యోతిష్కులందరికీ అతడు తన జాతకం, హనుమాయమ్మ జాతకం చూపించి సంతానయోగం వుందా, లేదా అని అడిగేవాడు. జాతకాలను పరిశీలించి నప్పుడు జ్యోతిష్కులు అతడుకోరిన యోగం విషయంలో వున్నదని కొందరూ లేదని కొందరూ భిన్నాభిప్రాయానికి వచ్చినా, పైకిచెప్పటంమటుక్కి వారంతా 'ఉంది' అనే అన్నారు. 'లేదు' అని చెప్పి నైరాశ్యం కలుగచెయ్యటంకన్న 'ఉంది' అని చెప్పి, ఫలానికి ఎదురు చూసేటట్టు చెయ్యటమే పెద్దమనుష్యులైన జ్యోతిష్కుల పద్ధతి. ప్రతి జ్యోతిష్కుడూ 'సంతానయోగం వుంది' అనటంతోనే మాలక్ష్మమ్మ, 'వుంటే పుట్టరేంమరి?' అని గద్దించి అడిగేది. దానికి దైవజ్ఞుడేం చెబుతాడు? హనుమాయమ్మే, 'తొందరపడితే ఎలాగ? ముందు ముందు పుడతారు' అంది ఒక మారు. 'పుడతారు! ముదిమయ్యాక ముచ్చటా, అరవయ్యేళ్లొచ్చాక సమర్తాను!' అని కసిరి కొట్టింది.

---

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

మరో యేడాది దొర్లిపోయింది. సంతానం కలుగలేదన్న అసంతృప్తి మాలక్ష్మమ్మకి బహిరంగంగానూ, సేతురామయ్యకి లోలో పలా విజృంభిస్తోంది. ఇలా ఉండగా వారింటి కొకనాడు వల్లభాచార్యుల నే జ్యోతిష్కుడొకడు దిగేడు. గుమ్మం ఎక్కుతూనే సేతురామ్మయ్యతో, 'కామేశం గారి కుమారుడవేనా నువ్వు?' అని ఏక వచనంలో సంబోధించాడు.

సేతురామయ్య, 'చిత్తం. తమదర్శనం ఇదివరలో చెయ్యలేదు.' అన్నాడు.

'నువ్వు నన్నెరగవులే. మీనాయనతోటే నా పరిచయం. చాలా యోగ్యుడాయన' అంటూ, మేనమామో పినతండ్రో లాగ ఇంట్లో ప్రవేశించాడు. స్నానంచేసి,నామాలు దిద్దికూచుని సేతురామయ్యతో,'అబ్బాయ్, ఈ ఊరు జడ్జీగారు టెలిగ్రాం ఇస్తే వచ్చాను. వారి అబ్బాయికి సంబంధాలొస్తున్నాయిట. పెళ్ళికుమార్తెల జాతకాలు చూపించాలని రప్పించారు. మరోగంటలో వారింటికి వెళ్లాలి...ఈలోగా ఊరికే కూచోడ మెందుకు? మీజాతకాలిలా తే. ఫలాలు చూసి చెప్తాను. తూచి చెప్పినట్లు నిదర్శనాలు కనపడతాయి!' అన్నాడు.

సేతురామయ్య, 'ఇంక జాతకాలను ఏ జ్యోతిష్కుడికీ చూపించను!' అని నిశ్చయానికొచ్చికూడా, 'ఏమో ఏ పుట్టలో ఏ పాముందో' అన్నట్టు తెచ్చి వాటిని పైకి తీసి, ఆచార్యులవారికి అందించాడు.

జాతకాలలో పేర్లు ఉన్నాయిగనక ఏ జాతకం ఎవరిదో తెలిసిపోతూనేఉంది. ఆచార్యులవారు హనుమాయమ్మ జాత కమే తీసుకు పరిశీలించారు. 'భేషైన జాతకమోయ్ ఇది!' అన్నారు. ఒక నిముషంసేపు నిశ్శబ్దంగా పరిశీలించి ఉన్నట్టుండి సేతురామయ్యకేసి చూసి, 'ఐతే అబ్బాయ్, మీకింకా సంతానం కలగలేదన్నమాట!' అన్నారు.

'ఈయన ఇట్టే కనిపెట్టేశాడే!'అని ఆశ్చర్య పోతూ సేతురామయ్య, 'లేదండి' అన్నాడు.

ఆచార్యులవారు విచారంపొలకబోస్తూ, 'ఇంత గొప్ప జాతకానికి ఈ ఒక్క లోపం పెట్టేడా విధాత! సంతానయోగం లేకుండా చేశాడు!' అన్నాడు.

ఇతర జ్యోతిష్కులు ఉన్నదన్న సంతాన యోగం ఈయన లేదనటంతోనే సేతు రామయ్యకు ఆచార్యులవారిపై అమితమైన గౌరవంకలిగింది. ఆచార్యులవారు, 'జడ్జీగా రింటికి వెళ్ళటానికి వేళఅయింది' అని లేచారు.

సేతురామయ్య, 'తమరికి అభ్యం తరము లేకపోతే సాపాటు మాయింటనే చెయ్యాలి' అన్నాడు.

'మీఇంటోగనక నాకేమీ అభ్యంతరం లేదు కాని ఈమాటుకి వదిలెయ్యి. జడ్జీగా రింట పని చూసుకుని నేను అలాగే వెళ్లి పోతాను. ముందు ముందు నేను తరుచూ వస్తోనే ఉంటానులే.' అని వెళ్ళిపోయారు.

సేతురామయ్యకి అయన వెడుతోంటే, ఒక అప్పుడు వెళ్ళిపోతూన్నట్లనిపించింది. ఆ విచారంలో పరధ్యానంగా ఉండటంవల్ల సేతురామయ్య గమనించలేదుగాని ఆచార్యులవారు పుచ్చుకున్న రోడ్డు జడ్జీ గారి బంగళాకు వెళ్ళేదిమాత్రం కాదు.

ఆచార్యులవారు మళ్ళీ, పక్షం తిరక్కుం డానే వచ్చారు. 'ఏమిటోయ్, ఎదో విచారంతో కుంగిపోతున్నట్లున్నావు! పిల్లలు కలుగలేదనేనా?' అన్నారు రావటంతోనే.

సేతురామయ్య అంత కుంగిపోక పోయినా ఆయన అమాట అనటంతోనే అంతపనీ జరిగినట్లే తోచిందతగాడికి. 'అ భగవంతుడు ఇవ్వనప్పు డేంచేస్తామండి' అన్నాడతడు.

ఆయన, 'అబ్బే, అలా నిస్పృహ చెందకు' అన్నాడు.

'నిస్పృహకేముందిలెండి! ఎక్కడి నుంచో ఓ సలుసునుతెచ్చి పెంచుకోవాలి' అన్నాడు సేతురామయ్య.

'ఛీఛీ. అలాంటి తెలివితక్కువపని మాత్రం ఎన్నడూచెయ్యకు! ఏ చెట్టుకా చెట్టు మొగ్గతొడిగి అది పువ్వూ, పిందే, కాయా అవాలికాని మరోకాయనుతెచ్చి అతుకుపెడితే అతుకుతుందిటోయ్ వెఱ్ఱి వాడా!' అన్నాడు ఆచార్యులవారు.

'తమరు సెలవిచ్చినది రైటే. కాని ఆ చెట్టుకి మొగ్గతొడిగేయోగం లేనప్పుడేమిటి చేసేది?'

'ఏమిటా? ఆ చెట్టుకాకపోతే మరోపాటి. గొడ్డుచెట్టునిపట్టుకు వేలాడుతావా?' అన్నాడు ఆచార్యులువారు.

సేతురామయ్య గుండె ఝల్లుమంది. మాలక్ష్మమ్మకీ అమాటలు వినపడ్డాయి. 'ఇదేమిటీ? ఇన్నాళ్ళూ నాకీఊహ తోచిందే కాదు! నాబుద్ధి బ్బూడిదగానూ!' అనుకుం దామె. ఆచార్యులవారు ఇంక ఏమీ అన కుండానే వెళ్ళిపోయారు.

ఆయన అయింట్లో నాటిన విషబీజం హనుమాయమ్మకి తెలియదు. ఆయన మళ్ళీ వచ్చేసరికి ఆమె వూళ్ళో లేదు కూడాను. మేనకోడలి పెళ్ళి అని పుట్టింటికి వెళ్ళింది. ఆచార్యులుగారు ఈమాటు కొందరి పెళ్ళికుమార్తెల జాతకాలు వెంటబెట్టుకొచ్చారు. ఒక్కొక్క జాతకమే పరిశీలిస్తూ సేతురామయ్యకు ఫలాఫలాలు విశదీకరించి చెప్పటం మొదలెట్టేరు. అతడు వయసుమళ్ళిన వితంతువులు పురాణం వింటూన్నట్లూ, బుద్ధిమంతులైన విద్యార్థులు పాఠంవింటూన్నట్లూ, భక్తిశ్రద్ధలతో ఆయన చెప్పేదంతా విన్నాడు. మాలక్ష్మమ్మ కూడా వచ్చి నిలపడేసరికి ఆచార్యులవారు ఒకజాతకం తీసి, 'అక్కగారూ, ఈ జాతకురాలికి పదిమంది పిల్లలు పుట్టేయోగంవుంది. ఐదుగురు మగపిల్లలూ, ఐదుగురు ఆడ పిల్లలూను! ఔను; ఆడా, మగా సంతానం కలుగుతేనే సరదాలన్నీ తీరటం! ఏమంటారు?' అన్నాడు.

'ఏమనటానికి ఏముంది? మాకా
అదృష్టం వుందా అంటాను' అంది
మాలక్ష్మమ్మ.

'అదృష్టానికేముందిందులో. మీ అబ్బా
యేమైనా ముసిలివాడా, ముక్కిపోయిన
వాడా? నడియవ్వనంలో వున్నాడు'
వెనకాల బోలెడు ఐశ్వర్యం. ఎవడుపడితే
వాడు కళ్ళనద్దుకుని ఇస్తాడు తనపిల్లని.
మీకెందుకన్నా లేనిపోని సందేహాలు? మీరు
'మహబాగ'నండీ రేపు సాయంత్రానికి
మీకి సంబంధం నిశ్చయంచేయిస్తాను!'
అన్నాడు ఆచార్యులవారు.

సేతురామయ్య జాగ్రదవస్థలోనేవున్నా
నోరుతెరిచి 'ఇదేమిటి? నాకు రెండోపెళ్లి
తలపెడుతున్నారా?' అనలేకపోయాడు.
ఎవరిదో కంఠస్వరం ఒకటి ఎక్కడో
దూరంగా పాతాళంలోంచి వస్తూన్నట్లుగా
వినపడి, 'ఏమండీ, అలా ఊరుకుంటా
రేం? పండంటి కాపరానికి ద్రోహం తల
పెడుతూన్న ఈ దుర్మార్గుణ్ణి మెడమీద
చెయ్యివేసి అవతలకి గెంటెయ్యరేం?'
అన్నట్లయింది సేతురామయ్యకి. 'ఇది
ద్రోహమా, కాదా?' అన్న ఆలోచనలో
పడ్డట్టున్నాడు. ఆలోచనతెగక పెద్దలైన
ఆచార్యులవారినే అడిగి సందేహనివృత్తి
చేసుకుందామని కాబోసు నోరుతెరిచాడు.
కాని అతణ్ణి మాటాడనిచ్చేదెవరు? 'కుర్ర
నాగమ్మవి నీకేంతెలుసు? నీ బాగోగులు
చూసేదాన్ని నేనున్నానుగా?' అన్నట్లు
మాలక్ష్మమ్మ అతగాడికి అడ్డువచ్చి, 'అన్న
గారూ, మీమేలు మేం ఎన్నటూ మరవలేం
ఈ సంబంధం ఖాయంచేయించండి' అంది.
ఆపిల్ల యెవరో వాళ్ళ సాంప్రదాయమెట్టిదో
తెలుసుగోడానికి ఆవిడకు అవసరమే లేక
పోయింది. ఆ హాలుగుమ్మంలో నిలబడి
వున్న ఆమెకు కుడివైపునుంచి ఐదుగురు
మనుమలూ, ఎడంవైపునుంచి ఐదుగురు
మనుమరాళ్ళూ వచ్చి తన్ను ఉక్కిరి
బిక్కిరిచేస్తున్నట్లు తోచి ఆమె మహదానం
దంలో మునిగిపోయింది. హనుమాయమ్మ
అనే వ్యక్తి ఎక్కడా ఆమె మనోవీధిలో
గోచరించనేలేదు.

మర్నాడు సాయంత్రానికి ఆచార్యుల
వారు ఒక లావుపాటి పొట్టి ఆయనను
వెంటబెట్టుకువచ్చాడు. 'ఈయనేనమ్మా
మీ వియ్యంకుడు. మీవాడికి ఉత్తిపిల్లనే
గాకుండా ఈయనశక్తికి వీలైనట్లు కొంత
కట్నంకూడా యేర్పాటుచేయించాను.
ఊరికే లాంఛనంకిందగాని, మీకది
తాంబూలంఖర్చుకి రాదనుకోండి' అన్నాడు.
ఆమాటలకి మాలక్ష్మమ్మ చాలా సంతో
షించింది.

"రేపేవచ్చి పిల్లనిచూసుకోండి. 'శుభస్య
శీఘ్రం' అన్నారుకదా" అన్నారు
ఆచార్యులవారు.

సేతురామయ్య సందేహిస్తో చాటుగా
తల్లితో "ఏమే అమ్మా," అన్నాడు.

"'ఏమే' ఏమిట్రా? ఆ పట్టిగొడ్డుతో
ఇంకా ఎన్నాళ్లురా కాపురం? బతి
కుండగా ఒక్క నలుసునైనా ఎత్తుకునే

అదృష్టం లేదుట్రా నాకు? రేపుచస్తే నీకు మాత్రం తద్దినాలుపెట్టేదిక్కు ఉండొద్దూ? ఆఖరికి ఈ ఐశ్వర్యమంతా యెవరికి వప్ప చెప్పి వెడదామనీ నీవుద్దేశం?" అని మాలక్ష్మ ఒక్కవూపు వూపేసరికి, అతడు ఆత్మకమంతా వదిలిపోయినవాడికిమల్లే లేచి ప్రయాణంకట్టేడు. "ఇది ధర్మంకాదు సుమండీ! ఇలాగైతేనాగతేంగాను!" అని ఎవరో అంటూన్నట్లనిపించిందిగాని, "ఒక్క గాని ఒక్క నలుసునైనా కన్నావుకాదు మరి! నేనేంచేసేది?" అంటూ అతడు ఆ పొట్టి అయనను అనుసరించి వెళ్ళేడు. "ఎందుకైనా మంచిద"ని మాలక్ష్మమ్మా వెళ్ళింది.

వయసొస్తే వంకరకాళ్లు కూడా తిన్నడబతాయన్నట్లు ఆ పదహారేళ్ళ శ్యామల ఆ తల్లికొడుకుల కళ్లకి బాగానే ఆనింది. 'పిల్లలతల్లి కాబోయేలక్షణాలు చూస్తేనే తెలుస్తున్నాయి!' అని మెచ్చు కుంది మాలక్ష్మమ్మ. 'మనకి అంతకంటే కావలసినదేముంది?' అన్నాడు సేతు రామయ్య. "'అలస్యా దమృతం విషం' కనుక రేపురాత్రి మూహూర్తానికే ఈ శుభ కార్యం కానిద్దాం" అన్నారు అచార్యుల వారు. అక్కడ హనుమాయమ్మ మేన కోడలి పెళ్ళికి అదేముహూర్తం. ఆ పెళ్లిలో పెళ్ళికూతురుచేత చురుగ్గా తలంబ్రాలు పోయిస్తూ ఆ ఆనందానుభూతిలో మగ్నురాలై యున్న హనుమాయమ్మకు అదేనమ యంలో తనభర్త నెత్తిపైన మరొకర్తె తలంబ్రాలుపోస్తోన్నదని ఎలాతెలుస్తుంది పాపం!

తరువాత హనుమాయమ్మకి నరగతి చూచాయగాతెలిసి మొదట 'కిట్టనివాళ్ళు తెచ్చిన పుకారు' అనుకుంది; వెంటనే గుండె ఝల్లుమని "ఏమో!" అనిపిం చింది. ఇంక అక్కడ వుండలేక రెండో అన్నగారిని వెంటబెట్టుకుని అత్తింటికి చేరుకుంది. ఇంకా ఎక్కడి అత్తిల్లు! ఆమెకు భర్త పరాయివాడయాడు. శ్యామలతండ్రి ఇచ్చిన మూడువందల రూపాయలూ పుచ్చుకొని శ్రీమాన్ వల్లభా చార్యులు ఆమె కన్నెచెఱతీర్చి, ఈమె గొంతుక కోసేశాడు!

హనుమాయమ్మ అన్న ఉమాపతి, గదిలో తలుపు బిడాయించుకుని కూచున్న సేతురామయ్యను ఉద్దేశించి 'తియ్యరా తలుపు వెధవా? నీకు జరగ వలసిన అసలుపెళ్ళి చేస్తాను!' అంటూ దభీదభీమని తలుపు తన్నేడు.

మాలక్ష్మమ్మ దూరాన్నుంచి 'కోరుకున్న మనువర్తి ఇస్తాను. అల్లరిచెయ్యక అవతలికి వెళ్ళండి!' అంది.

ఉమాపతి రుద్రుడైపోయి కాలిచెప్పు వూడదీసి 'ఏమిటన్నావు ముండా!' అంటూ అటువైపు పరుగెత్తేడు. ఏడుస్తూ కూచున్న హనుమాయమ్మ తటాల్న లేచి అన్న కాళ్ళకి అడ్డుపడి 'వద్దుబాబోయ్, వద్దు' అని గోలపెట్టింది. ఉమాపతి కేసుపెడతా నన్నాడు. 'వద్దు' అంది హనుమాయమ్మ.

పక్కింటి నరసమ్మగారు రహస్యంగా, 'ఇంత భూమిఐనా రాయించుకోవే, వెఱ్ఱి పిల్లా!' అంది. 'వద్దు' అంది హనుమాయమ్మ. 'అలాగైతే ఇంక మనకిక్కడేం పని?' అంటూ ఉమాపతి ఆమెను బండి ఎక్కించి తీసుకుపోయాడు.

మాలక్ష్మమ్మ శ్యామల్ని గదిలోకి పంపించిన రాత్రే, వసారాలో మంచం మీద పరుండి, 'ఇంక శ్యామల మళ్ళీ వెలపల ఉండకూడదు!' అని భగవంతుణ్ణి ప్రార్థించింది. కాని శ్యామల నెలా అవకుండానే అవతల కూర్చుంది. నెల తరవాత నెల రెండు సంవత్సరాలు క్యాలెండర్లలో కాగితాలు చిరుగుతూ వచ్చాయేకాని మాలక్ష్మమ్మ కోరిక సిద్ధించ లేదు. ఒకనాడు వల్లభాచార్యులు వస్తే ఆమె నిర్మొకమాటంగా, 'ఏమండీ, పద్ధెనిమిది పిల్లలన్నారు ఏకంగా? ఇంతేనా, మీ జ్యోతిషం?' అని అడిగేసింది.

ఆ దుర్మార్గుడు తొణుకూ బెణుకూ లేకుండా, 'సూర్య చంద్రాదులు గతులు తప్పడం ఉంటుందేమోగాని నా జ్యోతిషం తప్పదు. ఈ పిల్ల కింకా సంతానం కలగ లేదూఅంటే లోపం ఈజాతకురాలిదికాదు!' అన్నాడు.

మాలక్ష్మమ్మ ఊరుకోక 'మరెవరిది?' అంది.

'చెపుతా. ఏమోయ్, సేతురామయ్యా, ఏదీ నీ జాతకం? చూతాం పట్టుకురా.' అన్నాడు వల్లభాచార్యులు. ఆ జాతకాన్ని ఎగాదిగా ఐదు నిముషాలు పరీక్షించి, తేలుకుట్టినట్లు ఉబ్బెత్తుగా లేచి, 'ఇదీ కారణం!' అన్నాడు. సేతురామయ్యా, తల్లీకూడా నోళ్ళు తెరిచి చూస్తోంటే ఒక్కక్షణం ఆగి ఆ కుత్రిమ కార్తాంతికుడు, 'అబ్బాయ్, లోపం అంతా నీ జాతకంలో ఉంది. నీ జాతకంలో సంతానయోగం లేదు! ఆనాడు దీన్ని కూడా చూడకుండా ఈ పిల్లని నీకు పెళ్ళి చెయ్యటం నాది పొరపాటే!' అంటూ చరచరానడిచి వెళ్ళిపోయాడు.

సేతురామయ్య చాలా దిగులుపడ్డాడు. 'లోపమంతా నా జాతకంలో పెట్టుకుని, హనుమకి అపచారం చేశామన్నమాట!' అన్నాడు.

మాలక్ష్మమ్మ, 'ఇప్పుడు దానిమాట తలపెట్టడం ఈ శ్యామలకి అపచారం చెయ్యడం! ఊరుకో!' అని కూకలేసింది.

మరోనెల గడిచేనరికి శ్యామలకి డోకులు ప్రారంభించాయి! మాలక్ష్మమ్మ ఆనందానికి మేరలేదు. గబగబా పరుగెత్తివెళ్ళి కొడుకుతో, 'ఒరే నానీ' అంది.

ఏమిటమ్మా?' అన్నాడు సేతురామయ్యా.

ఆమె మునిముని నవ్వుతో 'శ్యామలకి కడుపురా!' అంది. అనేసి, శ్యామల దగ్గిరకి పరుగెత్తింది. పని గట్టుకువెళ్ళి అందరికీ చెప్పింది; వియ్యాలవారికీ, దగ్గిర బంధువులకి కబురు చేయించింది. సారెకావిళ్లు ఎక్కడెక్కడినుంచో రావటం ప్రారంభించాయి. మిఠాయి వుండలను ఇరుగు


పొరుగులకు పంచిపెట్టడమే చూసుకుంది గాని మాలక్ష్మమ్మ సేతురామయ్యా అదో మోస్తరుగా వుంటున్నాడన్న సంగతి గ్రహించిందికాదు.

'నాజాతకంలో సంతానయోగం లేనప్పుడు శ్యామలకి కడుపు వచ్చిందంటే యేమన్నమాట?'-ఇదీ సేతురామయ్యలో బయలుదేరిన అనుమానం! ఈ అనుమానం ఆ అభాగ్యుడి హృదయంలో అణువులా ప్రవేశించి, శ్యామలకు నెలలు నిండుతోన్నకొద్దీ వృద్ధిచెంది పెనుభూతమై కూచుంది.

తల్లి అడిగింది. 'ఏమిట్రా అలాగున్నావ్?' అని 'ఏమండీ అలాగున్నారు?' అని అమాయకంగా శ్యామల అడిగింది. ఎవరేమడిగినా అతడు చెప్పేడుకాదు. లోపలబయల్దేరిన ఆ హాలాహలం అతణ్ణి లోలోపలే దహించింది.

శ్యామల మగశిశువుని ప్రసవించిందనీ, బారసాలకు రావలసిందనీ పచ్చకార్డు వచ్చింది. తనకు ఆరోగ్యంగాలేదని సేతరామయ్యా వెళ్లలేదు. అతడు క్రమంగా శుష్కించి మంచంబట్టేడు. ఆ రోగం ఏమిటో వైద్యుడికి తెలవనేలేదు. కొడుకూ కోడలూ బారసాల పీటలమీద కూర్చుంటే చూడాలని మాలక్ష్మమ్మ మనసుపడింది గాని ఆ ముచ్చట ఆమెకు తీరనేలేదు. మొగుడికి చాలా జబ్బుగాఉందని తెలవటంతోనే, పిల్లవాడికి మూడోనెల వెళ్ళకుండానే శ్యామల శిశువుతో అత్తింటికి వచ్చింది. 'ఇదుగోరా నీ కొడుకు!' అంటూ మాలక్ష్మమ్మ మనుమణ్ణి తీసుకొచ్చి కళ్ళుమూసుకుని అయాసపడుతోన్న సేతురామయ్యకు చూపబోయింది.

సేతురామయ్య పడుకున్నవాడల్లా లేచి కూచుని మండిపడుతో, 'నాకొడుకా? కాదు! నే చచ్చాక వీడు నా తద్దినాలు కూడా పెట్టడానికి వీల్లేదు' అంటూ మంచంమీదనుంచి కిందపడిపోయాడు. మరో క్షణానికి శవంచుట్టూ అంతామూగి రోదనంచేశారు. తన అపరాధం ఏమిటో తెలవకుండానే ఆశిశువూ క్యారుమన్నాడు.






"ఏమే అలావున్నావ్?" అని అడిగాడు.

"..............."

"నిన్నే .... ఏమిటంత నీరసంగా ఉన్నావ్?"

"కొంచెం బద్ధకంగావుంది." ఆమె ఎంత ప్రయత్నించి, వారించినా, కొంటెగా చిరునవ్వు ఆ ఎర్రని పెదవుల్లోంచి దూసుకుపోయింది.

"ఏం....మళ్లీ మాట్లాడటం మానేశారేం?" అని అడిగింది.

"ఊహ్!"

"మీకోరిక....తీరేట్టే వుందిలేండి."

"ఆ....పదేళ్లనుంచి తీరుతోంది....ఇక తీరుతుంది" అన్నా డతను.

ఆమె చిన్నబుచ్చుకుంది. అతనది గమనించి, "సరసము విరసముకొఱకే అన్నారు .... నీలాంటివాళ్లను చూసే .... అప్పుడే కోపంతో మందార పువ్వయావు" అని ఆమె బుగ్గపై చిటికవేశాడు.

ఇదివరకటికన్నా అతను యిప్పుడు భార్యపై చాలా ప్రేమ చూపిస్తున్నాడు. ఆతని అప్పగారు చూడటానికి వచ్చి, విస్తుపోయింది. "ఓరి .... వీడిగారాబం .... ఎంత...."

పదిరోజులపాటు ఉండాలనుకొని వచ్చిన సోదరి కాస్తా మూడోరోజునే మూటకట్టింది. పొద్దున్న పక్కలెత్తేదీ తమ్ముడే. సాయంకాలం పక్కలువేసేదీ తమ్ముడే.

దొరక్క, దొరక్క దీపాలులేని ఇల్లు దొరకటం....తమ్ముడు....శుభ్రంగా బి. ఏ. ప్యాసయిన తమ్ముడు దీపపుబుడ్లలో కిరసనాయిలుపొయ్యటం .... సరిపోయింది. తను ఉండబట్టికాని, లేకపోతే సెలవుపెట్టి వీడు విస్తళ్లుకూడా ఎత్తును.

"ఒరే....కంచంలోతప్ప చెయ్యికడుక్కొని ఎరగనివాడివి .... ఒక్కమాటుగా చక్కని పంటబ్రాహ్మడివయి ఊరుకున్నావ్?" అని తమ్ముడిని హేళన చేసింది.

తమ్ముడు నవ్వి ఊరుకున్నాడు.

"ఆ ఆఫీసులో వీడికి పనేంసాగుతోందో మరి...." అంది స్వగృహానికి వెళ్లిన భర్తతో.

"అవునులే .... నీకిప్పుడు గుర్తెందుకుంటుందీ? నలుగురు ఆడపిల్లలను, ఇద్దరు మగపిల్లలని కన్నాక...." అన్నాడు నీళ్ళునములుతూ భర్త.

వేలూరి సహజానందం

"ఓహెూ! నరే....అవునులెండి...., పాపం,...ఎంత ఇదిగా వుండేవారు...., అందుకేగావును....మీరు నీళ్లుపోసు కొనేప్పుడు....చిన్నపిల్ల లిద్దరకూ కూడా పొయ్యమంటే, మాటైనా మాట్లాడకుండా, కాగెడునీళ్లు పోసుకొనివచ్చి, కుర్చీలో షతికబజపంచేయటం...." అని ఆమె తన అక్కను వెళ్లబోసుకుంది.

అతనేమీ మాట్లాడలేదు.

ఆమె మళ్ళీ అందుకుంది.

"మా తమ్ముడుకూడా అడిగాడు. 'ఏమిటె అక్కా ఇంత చిక్కావు' అని.... పిల్లను సాకలేక నాపని అవుతోంది.... కాస్త....మీరు"

"మీతమ్ముడు అలా గారాబంగా చూస్తున్నాడనేగా, ఇప్పుడు ఈసడించావు."

అమె నాలిక కొరుక్కుంది.

అత్తగారూ, మావగారూ వేంచేశారు. సావిత్రికి తల్లిదండ్రులను చూడటానికి కూడా సిగ్గువేసింది. ఏదో, ఆ పదేళ్లే బాగా ఉంది. ఇప్పుడేమిటో, ఇదిగావుంది. తల్లి వచ్చిన మర్నాడే కొబ్బరికాయలు కొట్టించి, కొడుకుపుట్టాలని దీవించింది.

నత్యనారాయణకూ సిగ్గుగానేవుంది. నలుగురిలో తిరగటానికి లోలోపల చాలా ఉత్సాహంగానేవున్నా, బైటవాళ్లు వ్యంగ్యంగా అనేమాటలు, కొంటెగాచూసే చూపులు అతన్ని కించపరుస్తున్నయ్. నలభయ్ఏళ్లు వచ్చిన తనకు ఇప్పుడు.... ఏమైతేం!

మొదట్లో కొద్దిరోజులపాటు భార్యాభర్తలు బిడియపడ్డారు. కాని తర్వాత సరిపుచ్చుకున్నారు.

చూస్తూవుండగానే ఆరోనెల వచ్చేసింది. నత్యనారాయణ మెల్లగా అన్నాడు. "మీ అక్కయ్యను రమ్మని వ్రాయనా?"

"ఇప్పటినుంచే ఎందుకండీ? పైగా కిందటిసారే ఆవిడకు మీధోరణి నచ్చలేదు." అంది.

"కాస్త....సాయంగా వుంటుందిగా!"

"ఏంవద్దులెండి....మీరు వంట చేయటం, నీళ్లు కాగబెట్టటం....బట్టలు పిడిచి ఆరేయటం....ఇవన్నీ చూస్తే నామీద రుసరుసలాడుతుంది, మీ అక్కయ్య. ఇప్పుడు నేనేమైనా బరువులెత్తుతున్నా కనకనా!" అంది సావిత్రి.

సావిత్రి తల్లివచ్చి, పురుటికి పంపమని అల్లుడినడిగింది. సావిత్రి వెళ్తానని ఊగింది. కాని నత్యనారాయణ బోధించాడు.

"అది....పల్లెటూరు....కుగ్రామం"

"అయితే...."

"ఇది,...బస్తీ...."

"అయితే...."

"అయితే ఏమిటి? అక్కడ డాక్టర్లా? మంత్రసానులా?"

అమె పెద్దగా నవ్వింది.

అతను చికాకుపడ్డాడు.

"ఏమిటండీ!"

"ఏమిటేమిటి.... తొలికాన్పు....కాస్త డాక్టర్లువున్నచోట...."

"మా ఊళ్ళో వాళ్ళంతా సుఖంగా కన..."

అతనింక మాట్లాడలేదు. కాని క్రమేపీ ఆమె ముఖంలోని ఆ చపలదరహాసం పోయి, గంభీరత వ్యాపించింది. కళ్లలో ఆలోచన ప్రతిబింబిస్తోంది. శరీరమంతా ఒక్కసారి పాలిపోయినట్టయింది.

"నే....వెళ్లను....నే....వెళ్లను" అంది, అస్పష్టస్వరంతో.

సత్యనారాయణ తన ప్రబోధంయొక్క ఫలితం గమనించి, "ఛా.... ఏమిటా భయం....ఛష్....దగ్గర, కలసివుంటాం గదా అని అన్నాను....పోనీ,...పెద్దది ఆమె వచ్చి, అడుగుతోంది వెళ్లు" అన్నాడు.

ఇంక అతనెంత బతిమాలినా, బామాలినా ఆమె సుతరామూ వినలేదు.

"అల్లుడు తీసుకో వెళ్లమంటుంటే, నువ్వు రానంటా వేమిటే?" అంది తల్లి.

"నేను....రాను....రాను....ముమ్మాటికీ రాను...వీలుంటే నువ్వే ఇక్కడికిరా.... ఆనాటికి" అంది కూతురు.

"వీలుంట మేమిటే? అక్కడ ఒక్క క్షణం ఉంటానుటే? ఏమిటి నీ అస్తా విస్తం...నరే....వారం వారం ఉత్తరం వ్రాస్తూవుండు. ఎనిమిదో నెల రాగానే వస్తాను."

తల్లి వెళ్లిపోయింది.

* * *

నిద్రలోంచి ఉలిక్కిపడి లేచింది....దీపం పెద్దదిచేయబోగా, అదికాస్తా కిందపడి భగ్గుమంది. ఈ చప్పుడుకు అతనూ లేచాడు....

"ఏమిటే...."

"ఏంలేదు."

"మరలా కంగారుగా చూస్తున్నా వేమిటి?"

"ఏంలేదు .... పొద్దున బిచ్చకత్తె ఒకత్తె...."

సందులోంచి గొంతుచించుకుంటూ ఏడ్పు వినబడుతోంది.

ఆమె కళవళపడ్డది.

అతను ఆమెపక్కనే కూర్చున్నాడు.

"బిచ్చకత్తె....బాలింతరాలు....రెండు రోజుల పసిగుడ్డు...."

"పసిగుడ్డు...."

"గుడ్డి....పసిగుడ్డు...."

ఆమె ఇంక మాట్లాడలేదు. ముచ్చెమటలుపోసింది.

అతనెంతో ధైర్యంచెప్పాడు.

"ఛా....అవన్నీ మనస్సుకు పట్టించుకో కూడదు. అసలింక తలుపులుతీసి, ఎవరికీ ముష్టివేయకు."

"ఛా .... ఆమాట .... అనద్దు.... మా తాతయ్య పక్షవాతంలో పడిపోయికూడా, "అమ్మా....మాధాకబళం" అని వినబడ గానే, "అమ్మాయి...." అని పిలిచేవాడు."

"మరి వాళ్లనుచూసి భయపడిపో తుంటివి...."

ఆమె జవాబుచెప్పలేదు. ఆ తెల్లవార్లూ ఉభయులూ మేల్కొనే వున్నారు.

తెల్లవార్లూ సందులోంచి ఏడ్పు ఒక్కొక్కసారి పెద్దగా, ఒక్కొక్కసారి తగ్గుగా వినబడుతూనేవుంది.

నాలుగురోజులయ్యాక ఆ పచ్చి బాలింత రాలు మళ్లీ గడపముందుకు వచ్చింది.

"ఇది....నాలుగోకాన్పమ్మా....పోనీ.... గుడ్డివాడే అయినా జీవిస్తాడనుకుంటే.... వాడుకూడా....మట్టిలో కలిసిపోయాడు.'

అడగకపోయినా, ఆ కళ్లుగుంటలుపడ్డ తల్లి తన గర్భశోకాన్ని విన్పించింది.

ఈసారి సావిత్రి భయపడలేదు. కాని స్థాణువులానుంచుంది.... భిక్షుకలోకం యొక్క అకలి చక్రాలు కదిలినయ్.... పొట్టపెరిగినపిల్లలు....పుడకల్లా కాళ్లు.... వళ్లంతా కురుపులతో వున్నవాళ్లు....మూగ వాళ్ళు....దారిద్ర్యం, దుఃఖంవేరు....కాని ఈ భయంకర, వికృతసంతానాన్ని కడుపులో పెట్టుకొని, ఆకలికార్చిచ్చుల మధ్య పెంచుకుంటున్న ఈ దీనమాతల భగ్న హృదయాల్లో ఏదీపం వెలుగుతోంది? సంస్కారహీనులు, సంపదహీనులు. తమ వంటిమీదకు గుడ్డ అక్కర్లేదు. మంచి గుడ్డ ఇవ్వు....అదిచింపి, పంచుకుంటారు. పారేసిన మెతుకులు చాలు....కాని సాక్షాత్తు భగవంతుడే తమ కడుపున పుట్టినట్టు, ఎంత మమతతో బంధించుకుంటారు?

సావిత్రి బిచ్చగాళ్లను చూడటం ఇది మొదటిసారికాదు. ఈ పెద్ద, బరువైన పుస్తకం గడపలముందు పేజీలు తెఱచుకొన్నదివ్వాళేకాదు. కాని సావిత్రికిదివఱకెప్పుడూ ఇందులోని కన్నీటి వాక్యాలు ఇంతస్పష్టంగా కనుపించలేదు. ప్రతి అక్షరంలోనూ ఏదో దీపం వెలుగుతున్నట్టుంది. ఈ సప్తసముద్రాలను మించిన ఈ ఆకలిఘోషలో, ఏదో స్పష్టాస్పష్టంగా ....హృదయాన్ని కలచివైస్తున్న విషాద, మధురరాగం వినబడుతోంది. ఈ ఆకలి, ఈ చినుగు, దుమ్ముగుడ్డలు, ఈమడ్డి, ఇవి తనకు పరాయివేఅయినా, ఆ మధుర రాగం, ఆ వినిర్మలదీపం....ఇవి తనలోనూ ప్రతిధ్వనిస్తున్నయ్. ప్రకాశిస్తున్నయ్.... అక్కడ....ఆపై ఉత్తుంగతరంగాల కింద, లో, లోన అగాధంలో....అక్కడ.... తనకూ, వాళ్లకూ మధ్య ఎడంలేదు.

ఇదివఱకల్లా కేవలం పైశాచిక వికృతాకారాలతో విసిగి, వేధించివెళ్లే అముష్టి కళేబరాల్లో ఇప్పుడేదో జ్యోతి భగ్గునవెలిగి, ఇన్నాళ్లు తనకగబడని ఏదో మాధుర్యం కళ్లకు కొట్టవచ్చినట్టుగా కనబడుతోంది.

ఇన్నేళ్ళూ ఈ ఆకలి పుస్తకంలో అక్షరాలపై దుమ్ముపడి వుంది. ఇప్పుడొక్క మలయమారుతంతో ఆ ధూళి అంతా తొలగి, ఉజ్జ్వలంగా కనపడుతున్నయ్.

సావిత్రిలో మార్పు సత్యనారాయణకేమీ అర్థంకాలేదు. మొదట్లో భయం అనుకున్నాడు. కాని ఇప్పుడు ఏవో అనేక ఆలోచనలు ఆమెను నిద్రపోనీయట్లేదని గ్రహించాడు.

ఆమె మాటల్లో, నడతలోకూడా మార్పు వచ్చింది. చనిపోయిన పితామహుని పదే పదే తలచుకుంటుంది, ఎంతటి సహృదయుడు? ఆ శుష్క, నిర్జీవనేత్రాల్లో ఆమె ఇప్పుడు శతసహస్ర నేత్రాలను, అశ్రుపూరిత నేత్రాలను చూడగలుగుతోంది.

ఓ దయామయా? ఎంత ప్రేమ నిమిడ్చు కున్నావు, ఆ రెండు కళ్లలో! ఇంకిపోని నీ ప్రేమ ఇప్పుడు అర్థమైంది.

*　　*　　*

డాక్టరు, మంత్రసాని వచ్చారు. నొప్పులు పొద్దున్న ఆరంభమైనా, పురుడింకా రాలేదు. సత్యనారాయణ ఆదుర్దాకు అంతులేదు. ఆ ఆదుర్దా ఆనందంతో నిండి వున్న ఆదుర్దా. మగపిల్లవాడు పుట్టాడని తన జోస్యం.

రెండుమూడుసార్లు తనువెళ్లి సావిత్రిని గదిలో చూశాడు. కాని తీవ్రబాధలో తను వచ్చిన స్పృహ లేకుండా పడివుంది సావిత్రి.

నిశీథందాటింది....డాక్టరు, మంత్రసాని ఆయాసపడుతూ గదిలోంచి బైటికి వచ్చారు. వాళ్లకళ్ళు చూడగానే సత్యనారాయణకు భయంవేసింది.

డాక్టరు మెల్లగా అన్నాడు. "మృత శిశువు...."

సత్యనారాయణ గుండెలో మంట భగ్గుమన్నది.

మంత్రసాని అన్నది "మగపిల్లవాడు."

సత్యనారాయణ కళ్ళలో నీళ్ళు తిరిగినయ్.

డాక్టరన్నాడు "పుట్టుగుడ్డు."

సత్యనారాయణ నిశ్చేష్టుడయాడు. తీవ్రభయంతో కంపించాడు.

డాక్టరు విచారించాడు. "మృతశిశువు"

సత్యనారాయణ మళ్ళీ నేలమీదకు వచ్చాడు. వెంటనే గదిలోకి వెళ్లబోయాడు.

మంత్రసాని చెప్పింది.

"ఆవిడకు స్పృహలేదు. ఓ గంటకు స్పృహవస్తుంది. కంగారు చేయకండి."

సత్యనారాయణ మెల్లగా లోపలకు వెళ్లాడు.

గుడ్డతో కప్పబడిఉన్న శిశువును చూడగానే మళ్ళీ అతనిగుండె జలదరించింది. గుడ్డిపిల్లడు! తనకు ఇన్నేళ్ళకు....లేక.... లేక....

అత్తగారు అంది. "పచ్చనిపసిమి.... బతికే అదృష్టం లేకపోయింది."

బతికే అదృష్టం!

*　　*　　*

సావిత్రి కళ్ళుతెఱచి, కాసేపు అయోమయంగా చూసింది. తర్వాత తల్లి దగ్గరకు వెళ్ళి మెల్లగా కూతురి ప్రశ్నలకు జవాబు చెప్పింది.

అంత నిస్సత్తువ, నైరాశ్యం, దుఃఖం లోనూ ఒక్కమాటుగా తలెత్తి, మెఱుస్తున్న కళ్ళతో అడిగింది. "పిల్లడేడీ.... అమ్మా!"

గుమ్మంలో నిలబడ్డ సత్యనారాయణ చెప్పాడు....మృత్యుభూమిలో నున్నాడని.

సావిత్రి గుడ్లు పత్తిగుడ్లలా బైటికి పొడుచుకొవచ్చినయ్.

సత్యనారాయణ అన్నాడు. "అంధ, మృతశిశువు."

సావిత్రిగుండెను, గొంతుకను చీల్చుకుంటూ సన్నని ఎలుగు బైటపడింది.

"ఎ....డి? నా బిడ్డ!"

ఆ ఆక్రందనకు తెల్లపోయి మంచు న్నాడు సత్యనారాయణ.

సావిత్రి ఇంకేమీ అడగలేదు. మాట్లాడ లేదు.

కొంతసేపటికి తెప్పరిల్లుకొని భర్త అన్నాడు.

"ఆ వికారశిశువుని చూసి భయపడుతా వని, వెంటనే...."

* * *

చంద్రునిలో మచ్చలా, సావిత్రి ముఖంలో విషాదచ్ఛాయ నిత్యనివాసమేర్పరచు కుంది. మృత్యుద్వారాన్ని సైతం తట్టి ఆ శీతలముఖాన్ని ముద్దిడే అనంతప్రేమ సావిత్రి నిలా దహించివేస్తుందని సత్యనారాయణ అనుకోలేదు.

* * *

గడపలోనుంచుంటుంది సావిత్రి....మళ్లీ భిక్షుకలోకంయొక్క ఆకలిచక్రాలు కదిలి పోతయి.... వికృతస్వరూపులు, వికలాంగులు, దారుణ వ్యాధిపీడితులు....ఒకరి నొకరు అనంతప్రేమతో పెనవైచికొని, ఆకలిలో, దుమ్ములో, చినుగుల్లో సాగి పోయే ఆ దౌర్భాగ్య, దీనముఖాల్లో, పసి బిడ్డలు వేళ్లాడే ఆ బాలింతల జోలిలో సావిత్రి ఆ దీపకాంతినే చూస్తోంది.... వీళ్లకు సంస్కారంలేదు....సంపదలేదు... ఏమీలేవు....కాని జీవితంయొక్క కూకటి వేరు, కొనవూపిరి అయిన ఆ....ప్రేమ.... వారు పోగొట్టుకోలేదు.

శూన్యాకాశంలోకి చూస్తుంది సావిత్రి... వ్యథితమైన మనోగగనంలోకి చేతులు చాస్తుంది .... మృతుడు కావచ్చు .... అంధుడు కావచ్చు....కాని హృదయానికి హత్తుకొనే అదృష్టంకూడా లేకపోయింది. జీవిస్తే ప్రేమించి, మృతమైతే ద్వేషించే ప్రవృత్తులమధ్య తనకెక్కడ శాంతి.... ఇంకొకపిల్లడు పుట్టవచ్చు. పిల్ల పుట్టవచ్చు.

భర్త ఆస్తికి వారసత్వంలేని లోటును నింపుతారు. కాని ఈ తనలోటు ఎలా నిండుతుంది? ఎప్పుడు నిండుతుంది? మూగ, మృత, అంధ, అజ్ఞాత శిశువుమీద ఈ అనతిక్రమ్యమైన ప్రేమ ఏమిటి? చల్లార్పటానికి ప్రయత్నించినకొద్దీ ప్రజ్వ లిస్తున్నది ఈ శోకవహ్ని....జ్వాల....

అన్నినాళ్ల క్రితం....సందులోంచి నిశీథంలో హెచ్చుతగుల్లో వినబడిన భిక్షుకస్త్రీ యొక్క నిష్ఫల దుఃఖారావం మళ్ళీ సావిత్రి చెవుల్లో ఘోష పెట్టింది.

* * *

సత్యనారాయణకు 'ప్రమోషన్' అయింది. బదిలీ అయింది. ఇప్పుడు నౌకర్లు....చాకర్లు....వంటమనిషి....ఇద్దరు మగపిల్లలు....ఒక ఆడపిల్ల...

"ఎప్పుడూ అలా కూర్చుంటావేం.... పిల్ల పుట్టినరోజు పండగైతేకూడా!" అన్నాడు భర్త.

కొత్త చొక్కా, పరికిణీతో పిల్ల గంతులు వేస్తోంది. ఇద్దరు కుర్రాళ్లు రేగిపళ్లు విరజిమ్ముతున్నారు.

"చూడు....ఎలా ఆడుకొంటున్నారో.... నవ్వుతూ పలకరించు....." అన్నాడు భర్త.

పిల్లలు ముగ్గురూ ఒళ్ళోకి వచ్చారు.... గుండెకు అదుముకుంది....కాని...అదిగో... వీధిగుమ్మంలో గుడ్డిబాలుడు కమ్మని గొంతుకతో పాడుతున్నాడు. భర్తవెనక పిల్లలు వెళ్లిపోయారు..బిచ్చగాడికి రేగిపళ్లు పెట్టుతున్నాడు పిల్లవాడు....వాడు పడిన పళ్లను తడుముకుంటూ తీసుకుంటున్నాడు.

కళ్ళుమూసుకుంది సావిత్రి. కాని ఆన కట్టలకు తలొగ్గని మహా ప్రవాహంలా కన్నీరు ప్రవహించింది.

పిల్లలు గంతులేస్తున్నారు....భర్త ఏవో నర్దుతున్నాడు....సావిత్రి వళ్లంతా చెవులు చేసుకొని, వీధిలోంచి అస్పష్టంగా ప్రతిధ్వనిస్తున్న గుడ్డిబాలునిపాట వింటోంది.

"ఓ ప్రభూ! ఆ మట్టిపాత్రలో యెంత అమృతం నింపావు! ఈ స్వర్ణకలశంలో ఎంత విష, విషాదాన్ని నింపావు!... ఓ అంధ గాయకుడా! ఈ అభాగ్యురాలి హృద్ఘోషను విన్పించు....నా అజ్ఞాత శిశువుకు! ఓ మృత్యువా? నిన్ను ధిక్కరించను....కానిఒక్కసారి... ఈ దీనహస్తాలను.... ఆ శీతల శరీరాన్ని తాకనియ్యి."

శూన్యంలోంచి, ఆకాశంలోంచి, మనో గగన తమో దిక్కులనుంచి శైశవపదప్రతిధ్వని సావిత్రికి విన్పించింది....పెక్కు దుఃఖంలో, తప్పిపోయిన పసిబిడ్డ వచ్చి ఆమె గుండెకు హత్తుకున్నాడు....స్పృహ వచ్చి, కళ్లు తెఱచేసరికి, ముగ్గురు పిల్లలు తండ్రి ఓదార్పుకు ఆగకుండా పెద్ద పెట్టున ఏడుస్తున్నారు.



# ఆ హో హ

[షేక్స్పియర్ వ్రాసిన "ఒథెల్లో" అనుసరించి వ్రాసినది]

[గతసంచిక తరువాయి]

## ద్వితీయాంకమ్ము, ప్రథమరంగము

[విక్రమసింహపురిలో సముద్రపుటొడ్డున; ప్రొద్దుటివేళ; ప్రవేశము రఘునాథరావు, యిద్దరు పౌరులు.]

ర: ఏం తుపానండి? మిన్నూ మన్నూ ఏకంచేసేస్తూ వుంది. సముద్రుడి ఆర్భాటంచూస్తే రెండింటినీ పొట్టపెట్టుకుందామని చూస్తూ వున్నట్టుంది కాని—ఎక్కడా ఎవరినీ బ్రతకనిచ్చేటట్టులేదు.

మొదటి పౌరుడు: అలాగేవుంది ప్రభూ—నే పుట్టి పెరిగిన యీ డెభ్భైఏళ్ళలోనూ ఈలాంటి తుపాను ఎప్పుడూ చూడలేదు. తుపానంటే మా ఊరికి క్రొత్తయేమీలేదుకాని తాటిప్రమాణాన్ని యిలా కెరటా లెప్పుడైనా లేచాయా?

రెండో పౌరుడు: వర్షం కొస్త తగ్గిందికదా అనుకుంటే యిలా ఆకాశం ఎత్తునా సముద్రుడు పొంగిపోవడం చాలా విచిత్రంగావుంది. నక్షత్రమండలం కూడా ఆవరించి లోకం అంతా అంధకారంచేసేద్దామనా ఆయన ప్రయత్నం?

ర: కొండా కొండా ఢీకొన్నట్లు ఈ కెరటాలు క్రుమ్ములాడుతో వుంటే వీటిమధ్య చిక్కుకున్న పడవలన్నీ ఛిన్నాభిన్నంకాక యేమవుతాయి? ఉక్కురేకులు తొడిగినాసరే, ఆఖరికి వజ్రపురేకులు తొడిగినాసరే—అన్నీ తూట్లుతూట్లు పడిపోవలసినవే. (మూడో పౌరుడు తొందరగావస్తాడు) ఏమండీ యేమిటి విశేషం?

మూ: ప్రక్కరేవులో ఓ పడవవచ్చి ఆగింది, ప్రభూ. తుకాజీగారు అనే ఆయన ఆ పడవలో వచ్చారట. ఆయన మహారాజుగారి అశ్వ సేనాపతిట.

రెం: ఆయన ఎలా రాగలిగాడు?

మూ: ఒడ్డునిచేరే, ఆయన—సేనాపతి నాగోజీగారూ—చెరో పడవలో వస్తూ వుంటే—నిన్నరాత్రో సుడిగాలివచ్చి నాగోజీగారి పడవని దూరంగా ఈడ్చుకుపోయిందట. నాగోజీగారు యేమయ్యారో అని తుకాజీగారు చాలా కంగారు

పడుతున్నారు. నాగోజీగారి కళాసుమాత్రం చాలా గట్టివాడట. ఏమాత్రం అవకాశమున్నా పడవ ఒడ్డుకి చేర్చగల సమర్థుడట!

ర: దేముడు రక్షించి నాగోజీగారు ఒడ్డు చేరుకున్నారంటే మనం అందరం అదృష్టవంతులమన్నమాట. ఆయనవుంటే—శత్రుసేన లెన్నివచ్చి మీదపడ్డా మనకి ఫరవావుండదు. అసలు ఆయన పేరు చెపితేనే (తుకాజీ వస్తాడు) ఏమండీ, తుకాజీగారూ రండి. మీరొచ్చారని ఇప్పుడిప్పుడే ఈయన కబురుతీసుకొచ్చారు.

తు: నే ఒక్కడ్నే రావడంకాకుండా, నాగోజీగారూ నేనూ కలిసివస్తే బాగుండును. ఆయన యేమయ్యారో అన్న విచారం నాకు లేకపోను. ఆయన పడవని యీడ్చుకుపోయిన సుడిగాలి నాపడవనీ ఈడ్చుకుపోతే బాగుండును.

ర: నాగోజీగారూ మీరూ విడిపోయినది ఎప్పుడు?

తు: నిన్న సాయంత్రమండీ. కన్యాకుమారి దాటామో లేదో (తెరలో పడవ వచ్చింది, పడవ వచ్చింది అను కేకలు) ఓవేళ నాగోజీగారు వచ్చారేమో. వస్తే యీపాటికి ఫిరంగి గుళ్ళు కాల్చివుండరా?

ర: నాగోజీగారూ, మీరూగాక యింకెవరు అక్కడినుంచి వస్తున్నారు?

తు: నాగోజీగారి భార్య - ఆవిడ్ని వెంటపెట్టుకుని కురపయ్య - మా వెనకాలే బైలుదేరి ఉండాలి.

ర: నాగోజీగారికి పెళ్ళయిందా?

తు: ఈమధ్యే అయింది. చేసుకుంటూ చేసుకుంటూ మహా చక్కటి ఆవిడ్నే చేసుకున్నారులెండి. ఒక్క చక్కదనమే కాదు; చక్కదనానికి తగ్గ తెలివితేటలు, తెలివితేటల్ని మించిన యోగ్యత - యిన్ని సమకూడిన మనిషి నాగోజీగారి అదృష్టమా అంటూ ఆయనకి లభ్యమయింది.

ర: ఎవరండీ ఆవిడ?

తు: మీరు శాంతవాహనప్రభువుని ఎరుగుదురుకదా? ఆయన కూతురు అనూరాధమ్మ. అదుగో ఆవిడే యిక్కడికి వస్తూవుంది. (అనూరాధ, రేవతి, కురపయ్య, మోహనరావు వస్తారు; అనూరాధతో) రండి. ఏమోయ్ కురపయ్యా, యింత వేగిరం ఎలావచ్చావు? దారిలో ఏమీ యిబ్బంది పడలేదుకదా?

కు: ఏ యిబ్బందీ పడలేదు కదా, తెరచాపలు ఎత్తివత్తడంతోనే గాలిదేవుడు మా పక్షముండి సరాసరి యిక్కడికి తీసుకొచ్చి విడిచిపెట్టాడు.

అ: తుకాజీగారూ. సేనాపతిగా రింకారాలేదేం?

తు : ఈపాటికి వస్తూవుంటారు.

అ : ఏం మీరిద్దరూ ఓసారే బైలుదేరారుగా? మీరు ముందూ ఆయన వెనుకా అయ్యారేం?

తు : ఆయన పడవ కాస్త వెనకపడింది. దాంతో నే ముందయ్యాను. ఈపాటికి ఆయనా వస్తూవుంటారు. ఏం ప్రమాదముండదు. మీతో వచ్చిన ఆవిడ –

అ : కురపయ్య పెళ్ళాం రేవతి; నేనొక్కర్తెనూ వుండలేక వెంట పెట్టుకువచ్చా.

కు : మీకు బాగా కాలక్షేపం అవుతుందిలెండి.

అ : ఏం అలా అంటున్నావు?

కు : వినేవాళ్ళుండాలికాని – మా ఆవిడ నోరు విప్పిందంటే మాయించడం బ్రహ్మతరంకాదు. నే అప్పుడప్పుడు ఆడదై పుట్టి నా పెళ్ళాం అయిపోయిందికాని – మొగాడై పుడితే మహావక్త అనిపించుకుని దేశదేశాలలోనూ పేరు ప్రఖ్యాతులు సంపాదించుకునేదే అనుకుంటూ వుంటా. ఆవిడకి యీవిషయం తెలుసు ఆవిషయం తెలియదు అనుకోడానికి వీల్లేదు. అన్నిట్లోనూ వున్నానంటుంది; తను చెప్పినదే కాని ఎదటివాళ్ళ మాట వినిపించుకోనైనా వినిపించుకోదు. ఆవిడ—

అ : వెళ్ళవోయ్, నువ్వు కాస్త వుంటే గంపంత చేసి చెపుతావు. నీపెళ్ళాం కడుపులో వున్నమాట దాపరికంలేకుండా చెప్తుందన్నమాటే కాని – నువ్వు చెప్పిన లక్షణాలు ఏవీ దానిదగ్గర లేవు.

కు : మిమ్మల్ని అప్పుడే బుట్టలో పడేసింది! ఈ చాకచక్యం అందరి ఆడవాళ్ల దగ్గర వుంటుంది కాబోలు!

తు : ఏమిటోయ్, ఆడవాళ్ళందరినీ ఎత్తిపొడుస్తున్నావ్!

కు : కాదండీ, నాపెళ్ళాం యింత తెలివైనదికదా అని సంతోషిస్తున్నా. నే అనుకోవడం మా ఆవిడ కాస్త మందమతేమో, అందుచేతే కాబోలు వంటింట్లో వున్నంతసేపు పడకటింటిమీద ధ్యాసం పెడుతుంది, పడకటింటిలో వున్నంతసేపూ వంటగొడవే చెపుతూ వుంటుంది, అనుకునేవాడిని.

అ : రేవతీ, నీమొగుడికి ఆడవాళ్ళంటే అసహ్యమా ఏమిటే?

కు : అసహ్యమయితే యీ పెళ్ళాంతో యిన్నాళ్ళూ ఎలా కాపురం చేసుకొచ్చా, చెప్పండి. అసహ్యానికి కాదుకాని, ఆడవాళ్ళు నేర్పరులనే చెప్పాలి. నమ్మినవాళ్ళనీ నమ్మనివాళ్ళనీ కూడా – వాళ్ళకి మోసగించడంవచ్చు. ఆడదానికి యిన్ని విద్యలు నేర్పినవాడెవడా అని నాకు సందేహంతోనే వుంటుంది – అ

కోపాలు, ఆ తాపాలు, ఆ నవ్వులు, ఆ ఏడుపులు, ఆ మర్మాలు, ఆ మాయలు, - యివన్నీ పుట్టుకతోటే వాళ్ళకొస్తాయి కాబోలు.

అ : వెళ్ళవోయ్ నీ ఉపన్యాసమంతా యెక్కడో కంఠోపాఠం చేసుకొచ్చి వట్టుంది (తెరలో 'ఓడొచ్చింది, ఓడొచ్చింది' అని పెద్ద కేకలు; ఫిరంగిమ్రోత వినబడును) ఆయన వచ్చినట్టున్నారు.

తు : అవును నాగోజీగారే.

(నాగోజీ, భృత్యులు ప్రవేశిస్తారు)

ర : నమస్కారం నాగోజీగారూ.

మొదటి, రెండవ, మూడవ, పొరులు. } నమస్కారం, ప్రభూ.

నా : నమస్కారం. ఏం, అనూ, నువ్వు ఎంతసేపయింది వచ్చి?

అ : ఇంకా అరగంటకూడా పూర్తిగా కాలేదండీ.

నా : నా వెనకాల బైలుదేరినదానివి నాకంటె ముందెలా వచ్చావ్?

అ : మీరు వెనక్కి వుండిపోతే నే ముందురాక యేంచేస్తాను?

నా : బాగా చెప్పావు. నిన్ను వచ్చి కలుసుకుందామన్న అభిలాషే నన్ను యిక్కడికి తీసుకొచ్చింది. అనుకోవాలి కాని, ఆ సుడిగుండాన్ని తప్పించుకుని బైట ఎలాపడ్డామో నేను చెప్పలేను. ఎన్నిసార్లు మా పడవ తలక్రిందులవడానికి సిద్ధమయిందో, యెన్నిసారులు నీరుపోసుకు మునగడానికి ఆయత్తపడి - నువ్వు చెపుతే నమ్మవు. మెట్టికి, నీ మంగళసూత్రం గట్టిదే అని చెప్పాలి. ప్రమాదావస్థ తప్పి మేం బైటపడ్డాకకూడా నువ్వేమయిపోయావో అన్న ఆదుర్దా నేనాట్టే పడకక్కరలేకుండా - నాకంటె ముందే వచ్చికూర్చున్నావ్! భేష్! యీవేళ యెలాంటి సుదినం! ఇంత సంతోషం నే ఎప్పుడూ యెరగను. రా, అనూ, రా. ఈ వూళ్ళో మనకి ఎవరూ క్రొత్తలేరు. వీళ్ళందరూ - నిన్నూ నన్నూ నెత్తిమీద పెట్టుకుంటారు. నేనేం మాట్లాడుతున్నానో నాకే తెలియకుండా వుంది. రఘునాధరావు మనకి అన్నీ అమర్చి వుంటాడు, పద. రఘునాధరావూ, నీతో చెప్పడం మరచిపోయాను. అరబ్బుల ఓడలన్నీ సముద్రుడి పాలయ్యాయి. కురపయ్యా, నువ్వు నా సామానూ అదీ తెప్పించు. లక్ష్మయ్య కలాసుకి బట్ట యేర్పాటుచెయ్యి. పద, అనూ, పద.

(శరపయ్య, మోహనరావు తప్ప తక్కిన వాళ్ళు అందరూ వెడతారు)

శ: చూడు, మోహనరావ్, నీతో ఓ సంగతి చెప్పవలసివుంది. నాగోజీ యీ రాత్రి - అరబ్బీ ఓడలు మునిగిపోయినందుకుగాను - వూళ్ళో ఉత్సవాలు చేయిస్తాడు. ఆ ఉత్సవాలప్పుడు కొట్లాటలు లేకుండా చూడమని తుకోజీని యేర్పరుస్తాడు. నాగోజీ క్రొత్తవూరు వెళ్ళినప్పుడల్లా - ఆ వూళ్ళో ప్రజకీ తన వాళ్ళకీ ఏవిధమైన తగువులాట రాకుండా ముందు చూసుకుంటాడు. ఆపని తన వుద్యోగస్థులలో ముఖ్యుడికే పురమాయిస్తాడు. అందుచేత రాత్రి వూళ్ళో గస్తీ తిరగడం తుకోజీ నెత్తినే పడుతుంది. అతను గస్తీ తిరుగుతూ వున్నప్పుడు నువ్వు యేం చెయ్యాలంటే - ముందు నాకొక్క సంగతి చెప్పు - అనూరాధకోసం నీ వెలాంటి సాహసపు పని చేసుకురమ్మన్నా నువ్వు చెయ్యడానికి సిద్ధంగా వున్నావా, లేకపోతే మధ్యలో పరుగుపుచ్చుకుంటావా?

మో: ఏమిటి చెప్పు; నువ్వు చెప్పడం తడవుగా చేసుకురాకపోతే నన్నను.

శ: అదీ మొగతనం అంటే. నువ్వేం చెయ్యాలంటే - ముందు నీకొక్క సంగతి చెప్పనీ. అనూరాధ అప్పుడే తుకోజీమీద కన్ను వేసింది చూశావా?

మో: నువ్వు అన్నీ కలిపించి చెపుతున్నావ్.

శ: వెళ్ళవోయ్, కలిపించి చెపుతే నాకేంవచ్చింది. నువ్వు దేముడిచ్చిన కళ్ళు మూసుకు కూర్చున్నావ్; నేను యెదుట జరుగుతూన్న విషయాలన్నీ కనిపెట్టి చూస్తూవున్నా. ఇంతే మనిద్దరికీ వున్న తేడా. అనూరాధ వచ్చీ రావడంతో తుకాజీ ప్రక్కకివచ్చి యెలానిలబడిందో చూశావా? ఆ నిలబడింది కాస్త యెడంగా నిల్చోకూడదూ? ప్రక్క-ప్రక్కని భుజాల రాసుకుంటూ, యీవిడ చెంగు యెగిరివెళ్ళి అతనిమీద పడుతూవుంటే - యేమిటి యీ నాటకం అంతా? అనూరాధకి అప్పుడే నాగోజీమీద అసహ్యంపుట్టింది అనడానికి - యిదంతా ఆధారం. ఎన్నికూడితే అనుకూలదాంపత్యం ఏర్పడుతుందీ? ఓసారి మొగుడూ పెళ్ళాం గదిలోకి వెళ్ళడంతోనే అయిపోయిందా? దీపం ఎగసన త్రోసినట్టుగానే - ప్రతినిత్యం - ప్రేమానుబంధం బలపర్చుకుంటూ వస్తేనే అందులో అందమూ చందమూను. ఆవిధంగా బలపర్చుకోడానికి - అనుకూల పరిస్థితులేర్పడాలి. ఇద్దరికీ వయస్సు కలవాలి; ఓలాంటి సరదాలు వుండాలి; వీళ్ళరూపం వాళ్ళనీ వాళ్ళరూపం వీళ్ళనీ ఆకర్షించాలి. ఇన్నిటిలోనూకూడా నాగోజీ తీసికట్టే అయినప్పుడు. 'అయ్యో, యితన్నెందుకు చేసుకున్నాను?' అని అనూరాధ విచార పడిందంటే అందులో ఏమీ ఆశ్చర్యంలేదు. అలా విచారపడుతూ వున్నమనిషి

యింకొకడికేసి దృష్టి మళ్ళిస్తుందంటావా, మళ్ళించదంటావా? అక్కడ యీ తుకాజీ సిద్ధమేగా? వీడెలాంటివాడో చెపుతా విను. పైకి ఎంత మంచివాడిలా కనిపిస్తాడో అంతకి అంతా దొంగ, వీడు చెరిపిన కొంపలు ఎన్నున్నాయో నీకు యింకా తెలియదు. వీడు - అవకాశం వచ్చేదాకా కాసుకు కూర్చునే రకంకాడు. ఎవరెళ్ళి లేనిచోట అవకాశం పుట్టించుకొచ్చే రకం. వీడికీ అనూరాధకీ అప్పుడే తటపటాంగం జరుగుతూ వుందనే నా నమ్మకం.

మో: అనూరాధ ఎందుకు ఒప్పుకుంటుందోయ్, యిలాంటివాటికి?

కు: ఒప్పుకోక యేంచేసుంది తమ్ముడూ - ఒప్పుకోని మనిషి అయితే బెంగ. అతనిమీద పడ్డప్పుడేనా వెనక్కి లాగుకోవడం మానేసి - అతని మొహంమీద మొహం పెట్టుకు వూరుకుంటుందా? ఇష్టమేనయ్యా, ఆవిడికీ యిష్టమే - అతని కేసే చూస్తూ నిలుచోడం యిష్టమే. ఇందరమూ చూస్తూ వుండగానే యింత చేసిన మనిషి - రేపు చాటుగా గదిలోకి పిలిపించుకున్నా పిలిపించుకుంటుంది. నే నిలాంటి వాళ్ళని చాలామందిని చూశానోయ్. నువ్విక్కడ లొట్టలు వేసుకు కూచునివుంటే అవతల తుకాజీ అసలుపని పూర్తిచేస్తున్నాడు.

మో: అయితే నన్నేం చెయ్యమంటావ్?

కు: ఏం చెయ్యమంటావా, తుకాజీకి అడ్డు తగలమంటాను. నువ్వు యీ రాత్రి యేంచేస్తావంటే తుకాజీతో గిల్లికజ్జం పెట్టుకుని - అతను నిన్నేంగడుతే - అతనికి ఒళ్ళు తెలియని కోపం తెప్పించు. ఓవేళ అతను నిన్ను తరుముకు కొనివస్తే గట్టిగా కేకలు వేసుకుంటూ పారిపో. నువ్వు రాత్రి పదీ అప్రాంతాలకి కోట దక్షిణపు గుమ్మందగ్గరకురా. ఆ చుట్టుపట్ల తుకాజీ నీకు సందర్భపడతాడు. అవసరమైతే - ఓవేళ నువ్వు తుకాజీకి దొరికిపోతే - మీయిద్దరినీ విడదియ్యటానికి నేనూ దగ్గరే వుంటాను. ఏమంటావ్, వస్తావా?

మో: అలాగే వస్తాకాని, యిదంతా ఎందుకోసం, కురపయ్యా?

కు: ఎందుకోసమో నేను తరువాత చెపుతాకాదూ. నువ్వీ రాత్రి నేను చెప్పినట్టు చేద్దూ. నువ్వు యిహ వెళ్లు; నే నిటువైపు వెళ్ళాలి (మోహనరావు వెడతాడు) ఇక్కడికి యిది పూర్తిఅయింది. నాగోజీకి అనూరాధ అంటే పంచప్రాణాల్లోను, ఏ అవాంతరమూ రాకుండా ఉండాలికాని—పెళ్ళాన్ని అన్ని విధాలా సుఖపెట్టే మొగుడు. సందేహంలేదు. తుకాజీ అనూరాధమీద కన్నువేసే ఉంటాడా? ఏమో వేసినా వేసివుండొచ్చు—వయస్సులో ఉన్నవాడు—చక్కని ఆడదానిమీద కన్నువెయ్యడం ఓ అబ్బురమా ఏమిటి? తుకాజీ రమ్మంటే

అనూరాధ రావంటుందా? ఈ అనూరాధ ఎందర్ని ఆకర్షించింది: నాగోజీని, తుకాజీని, మోహనరావుని—నన్నూను! ఇందర్నీ దాటి నాదాకా రావడం అనుమానమే. నాగోజీ నా పెళ్ళాన్ని ఎలా చెరపాడో అతని పెళ్ళాన్ని నేనూ చెరిపినా—తప్పులేదు. కాని యిది సాధ్యపడడమే కష్టం. పోనీ—మొగుడికీ పెళ్ళానికీ మధ్య రంధి పెడితే—దెబ్బకి దెబ్బ తీసినట్టు ఉండదూ. 'నీ పెళ్ళాం తుకాజీతో తిరుగుతూంది' అని నాగోజీకి కాస్త అనుమానం తగిలించేస్తే—ఆ తగిలించేది కాస్త కూస్త తగిలించడం ఎందుకు ఘాటుగానే ఎక్కిద్దాం. ఈ మోహనరావుగాడు తుకాజీకి అడ్డుతగిలి—యిద్దరూ వీధివెంట పరుగులెడుతూ నాగోజీ కంటపడ్డారంటే—నాగోజీ తుకాజీమీద ఉగ్రుడైపోతాడు. అలాంటప్పుడు 'నాగోజీ మంచి నువ్వ సంపాదించదలుచుకుంటే వెళ్ళి అనూరాధని ఆశ్రయించు' అని తుకాజీకి సలహా చెపుతా. అదే సమయంలో తుకాజీని నిలువునా మింగేద్దాం అన్నంత కావేషీ నాగోజీకి పుట్టిస్తా. ఆ తుకాజీని చూస్తేనే నాకు భయం—ఏదోవిధంగా వాడిని అణగద్రొక్కించెయ్యాలి. ఇదంతా నాగోజీచేత చేయిస్తూ—నాగోజీ శివమెక్కి గంతులువేసేలా చేయిస్తూకూడా—మళ్ళీ అతని చేతే 'కురపయ్య అంత మంచివాడు లేడు' అనిపించుకోవాలి. చూద్దాం: అవసరాన్నిబట్టి ఓదానికీ ఓదానికీ ముడిపెట్టుకుంటూ పోదాం.

(వెడతాడు; తెరపడును)

## ద్వితీయాంకము, ద్వితీయరంగము

[వీధి; పగటివేళ; దండోరావాడు డప్పుకొడుతూ వస్తాడు; వాడి వెంట కొందరు పౌరులుంటారు.]

దం: సేనాపతి నాగోజీగారి సెలవు ఏమిటంటే—అరబ్బుల ఓడలన్నీ—అమాంతంగా సముద్రంలో మునిగిపోయాయి కాబట్టి—ఆ దుర్మార్గులు మనదేశం ఆక్రమించుకుంటుకున్నారన్న భయమేమీ యిహ లేదు. కాబట్టి—యీ ఊరు ప్రజలందరూ ఉత్సవాలు సంభరాలు చేసుకోవలసిందండోయి—అంతా క్రొత్త బట్టలు కట్టుకు ముస్తాబవవలసిందండోయి—ఎవరిళ్ళకు వాళ్ళు యిష్టంవచ్చిన అలంకారాలు చేసుకోవలసిందండోయి—ఊరేగింపులూ సంభరాలూ రాత్రి పదిగంటలదాకా చేసుకోవడానికి ఎవ్వరూ అభ్యంతరపెట్టేవారు లేరంటూ యావన్మంది ప్రజకు తెలియజేయమని సేనాధిపతి నాగోజీగారి ఉత్తరవు అయిందండోయి!

(టముకు కొడుతూ వెడతాడు, తెరపడును)

## ద్వితీయాంకము, తృతీయరంగము

[రాత్రి; కోటలో ఒక హాలు; ప్రవేశం నాగోజీ, తుకాజీ]

నా : నువ్వీరాత్రి బహుజాగ్రత్తగా మసులుకోవాలి సుమా. ఈ సంధికాలాలలోకి అనేకరకాలవాళ్ళు వస్తూ ఉంటారు—నువ్వేమాత్రం అశ్రద్ధచేసినా ఏదో కొట్లాట జరిగిపోతుంది.

తు : నాతో కురపయ్యా గస్తీతిరుగుతున్నాడులెండి. మేం జాగ్రత్తగానే చూచుకుంటాం.

నా : కురపయ్య చాలా నమ్మకస్థుడే. అయినా నువ్వే అన్నీ స్వయంగా చూసుకో. జాగ్రత్త (వెడతాడు; కురపయ్య వస్తాడు)

తు : ఏమోయ్ నేను చెప్పిన ఏర్పాట్లు చేశావా?

కు : చేశా.

తు : మనం ఉత్తరవైపున పెట్టిన సిబ్బందే కాస్త తక్కువగా ఉంది. తూర్పు వైపు ఉన్నవాళ్ళని కొందర్ని ఉత్తరపువైపుకు పంపిస్తేనో?

కు : పంపించవచ్చు.

తు : అయితే వెళ్ళి ఆపని పూర్తిచేసివద్దాం, పద.

కు : వెడదాం లెద్దురూ, యిప్పుడే ఏం తొందరవచ్చింది? ఏరీ, నాగోజీగారు ఎక్కడా కనపడరేం? అప్పుడే పడకటింటికి దారితీశారా ఏమిటి?

తు : లేదోయి, యిప్పటిదాకా యిక్కడే ఉన్నారు.

కు : ఉండకపోతే ఆయన్ని అడిగేవాళ్ళెవరులెండీ. అదృష్టవంతుడంటే ఆయన. చేసుకుంటూ చేసుకుంటూ—ఎంత చక్కటి ఆవిడ్ని చేసుకున్నాడు : ఆవిడ యితన్ని అంటిపెట్టుకు ఉంటుందా అనే అనుమానంకాని—

తు : ఉండకేమోయ్ - అనూరాధమ్మని నువ్వు యెరగక యిలా అంటున్నావు - అంత మంచిమనిషిని మనం ఎక్కడా చూడమనుకో, ఆవిడ చక్కదనంకంటె కూడా ఆవిడ మంచిగుణాలే నాగోజీగారిని యెక్కువ ఆకర్షించాయి అంటే నమ్ము.

కు : వాళ్ళిద్దరూ పదికాలాలపాటు సుఖంగా బ్రతకనివ్వండి: మీరూ నేనూ చూసి సంతోషిద్దాం. అవునుగాని, మీరిందాకా రఘునాధరావుగారు పిలుస్తూంటేకూడా వినిపించుకోకుండా వచ్చేశారుట, యేమిటి? ఆయన ఎంతో నొచ్చుకుంటున్నాడు.

తు : ఆయన నన్నెప్పుడు పిలిచారు?

కు: ఇందాకా ఇందాకానే—గంట స్తంభం ప్రక్కనుంచి మీరు వెడుతూంటే ఆయన వెనుకనుంచి కేకవేశారుట. మీరు వినిపించుకోకుండా వెళ్ళిపోయా రనుకున్నారు.

తు: నాకు వినపడితే ఎందుకు వెళ్ళిపోతానోయ్? నాకు వినపడలేదు.

కు: అయివుంటుంది. మెట్టికి రఘునాథరావుగారు చాలా సరదా అయిన మనిషిసుమండీ. తనేదో పెద్ద వుద్యోగస్థుడనన్న భేషజం యేమీలేకుండా అందరితోనూ సమానస్థాయీగా మసులుతాడు. ఈ వూరివాళ్ళూ ఆయన సరదాకి తగ్గవాళ్ళు. ఆయన యీపాటికి యింటికి వచ్చేసుంటాడు. మీరు వెళ్ళి పిలుచుకువస్తే బాగుంటుందిసుమండీ—మీరు ఆయన పిల్చినా అగలేదన్న వుద్దేశం ఆయనకి యెందుకు కలగనివ్వాలి?

తు: అలాగే వెళ్ళి పిల్చుకువస్తానోయ్. (వెడతాడు)

కు: (తనలో) రఘునాథరావు యింటిదగ్గర చేరినవాళ్ళు త్రాగుడులో గట్టివాళ్ళు. వాళ్ళూ తుకాజీ సమావేశం కావడంతో—యితనిచేతా ఓచుక్క వేయించకుండా విడిచిపెట్టరు. కాస్త ఆ వాసన చూపిస్తేచాలు—తందనాలాడే బ్రహ్మాణ్యుడీ తుకాజీ. ఈ వూళ్ళోవాళ్ళూ—పేచీకి పెదబాబులే. ఆ మోహనరావుగాడికి—అనూరాధ వెర్రిపట్టుకుని—వున్న కాస్తమతీ యేనాడో పోయింది. వాడిచేత తలమునగ త్రాగించా. ఇందరు త్రాగుమోతువాళ్ళని పెట్టుకుని యేదో ఓ రభస చెయ్యలేకపోతానా?

(రఘునాథరావు, తుకాజీ, పౌరులు, నౌకర్లు వస్తారు. నౌకర్ల చేతులలో సీసాలూ, గ్లాసులూ ఉంటాయి)

ర: పొయ్యండయ్యా, పొయ్యండి; తలోగ్లాసూ అందివ్వండి; నాగోజీగారు యీవేళ పండుగ చేసుకోమని సెలవిచ్చారుగా? ఇహ అభ్యంతరం యేమిటి?

తు: నాకొద్దండీ.

ర: ఫరవాలేదు. ఒక్క గ్లాసు పుచ్చుకోండి

(తుకాజీ త్రాగుతాడు)

తు: ఓ గ్లాసు యిస్తే నాకు చాలదండోయ్! ఆ సీసా యిటు పెట్టెయ్యండి

పాట *

హాయి కలిగించును సారాయీ
రుచిచూడుము భాయీ ॥ హా ॥

* పై పాట 'రంగూన్‌రౌడీ' నాటకము లోనిది

మదిగలకలతల నిముషములోపల
మరపింపదగు హుషారి నొసంగును ॥హా॥
బ్రహ్మానందము చేకూర్పన్ గల
పరమమాత్రమిదె హహ్వారె హహ్వా ॥హా॥

తు : భలే పాటపాడావ్, కురపయ్యా!

కు : పాటకు మించిన పద్యం చదువుతా వినండి

(అందరికీ తలోగ్లాసూ అందిచ్చి తనో గ్లాసు పుచ్చుకుంటాడు)

†లాలనముచేసి మన్మథకేలి నేడు
కుసుమకోమలి యెవ్వని కూడునొక్కొ

ర : ఎవరోయ్, ఆ కుసుమకోమలి?

కు : ఉందిలెండి, ఒకావిడ.

లాలనముచేసి మన్మథకేలి నేడు
కుసుమకోమలి యెవ్వని కూడునొక్కొ
అతడు తొలుజన్మమందు శ్రీహరిని పైడి
పూలపూజయొనర్చిన పుణ్యతముడు

తు : ఆ కుసుమకోమలిని నా దగ్గరికి పంపించు, కురపయ్యా. ఎందుకయ్యా నవ్వుతారు? నే అన్నదాంట్లో తప్పేముంది? ఎర్రి మొహాలలారా, నేను త్రాగి తందనాలాడుతున్నా అనుకుంటున్నారా? త్రాగినవాడికి ఎక్కడైనా తెలివి ఉంటుందా? నాకు ఫస్టుకలాసైనా తెలివి వుంది. అంచేత నేను త్రాగలేదు. నువ్వు రఘునాథరావువి; యీడు కురపయ్య; ఇది నా కుడిసెయ్యి, యిది ఎడం సెయ్యి. ఇంతమాత్రం నాకు తెలియదనుకున్నారా? మీ బాబులలాంటివాళ్ళని చూశాను. (మోహనరావ్ వస్తాడు) మీలో ఎవడైనా మొనగాడుంటే నా ఎదుటి కొచ్చి నిలబడమను — నా తడాఖా చూపిస్తాను. అశ్వసేనాపతి తుకాజీ బహద్దుర్ అన్నదానికి ఎక్కడా తిరుగులేదు.

(వెడతాడు; మోహనరావు అతని వెంట వెళ్ళమని
కురపయ్యకు సంజ్ఞ చేస్తాడు)

ర : ఇతను ఎప్పుడూ యింతేనా కురపయ్యా?

కు : ఇంకా ఏం చూశారు; ఒక్కొక్క రోజున మనిషి వంటిమీద గుడ్డే ఉండదు. పండుగేదైనా రావడం తడవు, మనిషి యీ అవతారం ఎత్తడానికి.

† 'వైజయంతీ విలాసము' లోనిది

ర: నాగోజీగారికి యీ భోగట్టా తెలుసా?

కు: తెలుసుండదు. ఈ భాగోతం ఆయనకెప్పుడూ పడనట్టు నే వినలేదు.

ర: పోనీ నువ్వే ఓసారి నాగోజీగారితో చెప్పి ఆయన చేత కూకలు వేయించలేక పోయావా?

కు: తుకాజీగారి చేతిక్రింద నేను పనిచేస్తూ, ఆయన యిలాంటివాడనీ అలాంటి వాడనీ పై యజమానితో చాడీలు చెప్పనా? నేను మళ్ళీ తుకాజీగారి మొహం ఎత్తి చూడడానికి అస్కారం ఉండాలా?

ర: నువ్వు తుకాజీ సంగతే ఆలోచించావు కాని దీనివల్ల నాగోజీగారికి ఏం అప్రతిష్ఠ వస్తుందో అని ఆలోచించావా? (తెరలో 'రక్షించండి బాబూ రక్షించండి' అనే కేక వినబడును) ఏమిటా కేక?

(ముందు మోహనరావు పరుగెత్తుతూవుండగా కత్తి చేతపట్టుకు
అతనిని తరుముతూ తుకాజీ వస్తాడు)

తు: చావు వెధవా చావు.

ర: ఏం జరిగింది తుకాజీగారూ?

తు: ఈ కుంక, ఈ వాజమ్మ, ఈ దగుల్బాజీ నాకు చెప్పొస్తున్నాడు! వీడిని—

ర: కాస్త శాంతించండి, తుకాజీగారూ, ఏమన్నాడితను?

తు: ఏమన్నాడో నేను నీతో చెప్పకోవాలా? నువ్వు ముందు అడ్డంతప్పుకో.

ర: ఎందుకంత గట్టిగా కేకలువేస్తారు? జరిగింది ఏమిటో చెప్పండి.

తు: నువ్వు ముందు ఒత్తిగిలు.

ర: ఒత్తిగిలను.

తు: అయితే చూసుకో నా తడాఖా

(తుకాజీ రఘునాథరావుమీదకు కత్తి ఎత్తగా అతను కత్తి
ఒరనుండి తీసి దెబ్బ కాసుకుంటాడు. ఇద్దరూ కత్తియుద్ధం చేస్తారు;
కురపయ్య మోహనరావుని వెళ్ళిపొమ్మని సంజ్ఞ చేస్తాడు; మోహన
రావు బొబ్బలు పెడుతూ వెళ్ళిపోతాడు)

కు: (గట్టిగా) ఆగండయ్యా ఆగండి. ఇదేం కర్మం? పోయినవాడెలాగా పోయాడు మధ్యని మీరు కలపడ్డారేమిటి? తుకాజీగారూ, మీరు వెనక్కి తగ్గండి. రఘునాథరావుగారూ, మీరైనా ఊరుకోండి. ఇద్దరూ కూడా వినికించుకోరే. (తెరలో పెద్దగంట మ్రోగినచప్పుడు) మీరొహారు వెళ్ళి ఆ గొడవ ఆపుచేసి

రండి (ఒక పౌరుడు వెడతాడు) ఇంకా ఎంతసేపు యుద్ధంచేస్తారు బాబూ ఒకళ్ళని ఒకళ్ళు పొడుచుకునేదాకా ఆగరా? మిమ్మల్ని బ్రతిమాలుకుంటూ, నా మాట వినండి, వెనక్కి తగ్గిపొండి.

(నాగోజీ నౌకర్లను వెంటపెట్టుకు వస్తాడు)

నా : ఏమిటీ గందరగోళం?

కు : తగ్గండయ్యా, యిప్పటికేనా తగ్గండి; నాగోజీగారు వచ్చారు.

నా : ఆగండి—తుకాజీ నువ్వు ముందుకి అడుగువేశావంటే—నీ ప్రాణం నీదికాదు. రఘునాధరావ్వూ, నువ్వు వెనక్కి ఒత్తిగిలు. మీ యిద్దరికీకూడా మతులుపోయాయా? ఏమిటీ కత్తిసాము? ఏమిటీ రక్తప్రవాహాలు? ఏం జరిగింది కురపయ్యా—ఎక్కడో మూలకు నక్కావేం—యిలా ముందుకొచ్చి—ఈ గొడవ ఎవరు ప్రారంభిచాగో చెప్పు. ఆ గంటేమిటి—నువ్వు వెళ్ళి ఆపుచేయించి రా.

(ఒక నౌకరు వెడతాడు; కొద్దిసేపటిలో గంట ఆగిపోతుంది)

కు; ఏం చెప్పను ప్రభూ, నాకంతా అగమ్యగోచరంగా ఉంది. ఇద్దరికి యిద్దరూ—అన్నాతమ్ముడిలా వున్నవాళ్ళే—అంతలో ఏమొచ్చిందో కత్తు లూడ తీసి గర్భశత్రువులలా కలియబడ్డారు. నే నెత్తీ నోరూ మొత్తుకుని 'ఎందుకొచ్చిన తగువులాటయ్యా, ఆగండి ఆగండి,' అంటే ఆయనా వినిపించుకోడు యీయనా వినిపించుకోడు.

నా : నువు చెప్పు తుకాజీ ఏం జరిగిందో.

తు : నన్నేమీ అడగకండి, ప్రభూ.

నా : (రఘునాధరావుతో) నువ్వు చాలా నిదానమైన మనిషివని పేరు సంపాదించుకున్నావ్ ; ఈ విధంగా తొందరపడవలసిన అగత్యం ఏమివచ్చింది?

ర : నేనేమీ తొందరపడలేదండీ—నన్ను నేను రక్షించుకోవడమూ తప్పేఅని మీరంటే చెప్పలేనుకాని—

నా : ఎవ్వరూ ఏమీ చెయ్యకుండా ఈ దెబ్బలాట ఎందుకొచ్చింది? దెబ్బలాటకేనా మహా మంచిసమయం ఏరుకున్నారు. ఈవేళ ప్రొద్దున్నదాకా అరబ్బులెక్కడ వచ్చి మీదపడతారో అని ఊళ్ళో ప్రజ హడలిపోతూవుంటే—వాళ్ళకింకా కాస్త కునుకుపట్టిందో లేదో—మీరిక్కడ బొబ్బలుపెట్టుకుంటే—ఖణేలు ఖణేలుమని కత్తులు ఎగురవేసుకుంటూ—కొట్లాటకు దిగారూ? ఎవడు దీనికి కారకుడు? కురపయ్యా, అసలు యిది ఎలా ప్రారంభమయిందో నువ్వు

చెప్పు—ఎవడు యిందులో తప్పుచేశాడో—వాడ్ని నిర్దాక్షిణ్యంగా దండించక పోతే నన్ను నాగోజీ అని పిలువవద్దు.

ర : కురపయ్యా, నువ్వు నిజం నిజంలా చెప్పక ఏమాత్రం పక్షపాతంగా మాట్లాడినా—నాగోజీగారి నమ్మిక వమ్ముచేసినవాడ వవుతావు సుమా.

కు : నన్నంతగా నిర్బంధపెట్టకండి, రఘునాథరావుగారూ. నాకు మాటవస్తే ఒకటీ తుకాజీగారికి మాటవస్తే ఒకటీనా ? అయినా, నేను నిజంచెప్పినందువల్ల తుకాజీగారికి చెడుగువుండకూడదు. వినండి, ప్రభూ, నేను చూసినదేదో చూసినట్టుగా చెపుతాను. నేనూ రఘునాథరావుగారూ యిక్కడే నిల్చుని మాట్లాడుతూవుంటే—మీరువచ్చిన వైపునుంచే ఎవడో బికారివాడు కేకలువేసుకుంటూ మాదగ్గరకు పరుగెత్తుకువచ్చాడు. వాడి వెనకాలే వాడ్ని తరుముకుంటూ తుకాజీగారు వచ్చారు. వాడు మాదగ్గరకు వచ్చాక కూడా కేకలువేస్తూనే వున్నాడు—తుకాజీగారు వాడిమీదికి వెడుతూవుండగా—యీయన మధ్యకి వెళ్ళి ఆపు చేశాడు. ఆ వచ్చినవాడీ దోసందు చూసుకుని బొబ్బలెట్టుకుంటూ పారిపోయాడు. ఆ బొబ్బలతో ఊళ్ళో ఏం కగ్గోలుపుడుతుందో అని—వాడి గొడవ ఎలాగైనా మానిపిద్దామని—వాడివెంట నేపడ్డా. వాడు ముందు, నే వెనుక ఆలా కొంత మార్గం పరుగెత్తాక వాడో సందులోదూరి మాయమయ్యాడు. నే మళ్ళీవచ్చి చూసేసరికి—ఏంచెప్పను ?—ఉభయులూ కత్తులు ఎగురవేసుకుంటూ—నెత్తురు చిమ్ముకుంటూ—ఆరోజు అభిమన్యుడూ లక్ష్మణకుమారుడూ కలబడ్డట్టుగానే కలబడ్డారు. మీరురావడం ఓక్షణం ఆలస్యమయితే ఒకళ్ళని ఒకళ్లు పొడుచుకు చచ్చిపోయేవాళ్ళే. ఇంతకుతప్ప యేంజరిగిందో నే ఎరగను. ఏం చెప్పం—యిదంతా గ్రహచారమే అనుకోవాలి. గ్రహచారం కాకపోతే, ఈయనంటే పంచప్రాణాలూను తుకాజీగారికి—ఈయనతో కలబడడం యేమిటి ? ఇంతకీ ఆ పారిపోయినవాడు తుకాజీగారిని ఏమన్నాడో—ఏంచేశాడో—లేకపోతే ఆయనకి అంత కోపంవచ్చివుండదు.

నా : నాకు బోధపడింది, కురపయ్యా, ఈ గొడవ అంతా తుకాజీ లేవతీసి నదే. (తుకాజీతో) నువ్వు రేపటినుంచి పనిలోకి రానక్కరలేదు. రావోయ్, రఘునాథరావ్, మీ ఊరొచ్చి మావాళ్లుచేసిన ఉపకారమిది. చూడు, కురపయ్యా, యిళ్ళ [illegible] యేమీలేకుండా నువ్వు జాగ్రత్తగా చూసుకో. నేనింకొకళ్ని [illegible]చేదాకా [illegible]పలా నీదేసుమా.

(నాగోజీ, రఘునాథరావు, నాగోజీ భృత్యులు, రఘునాథరావు వెంటవచ్చిన పౌరులు వెడతారు.)

కు : మీకెక్కడైనా గాయంతగిలిందండీ?

తు : తగిలింది కురపయ్యా. గాయం అంటే అలాంటీ యిలాంటీగాయం గాదు.

కు : ఎక్కడేమిటి?

తు : ఎక్కడని చెప్పను? ఒంటికి తగిలినవుండు ఎప్పటికో ఓ అప్పటికి మానుతుందనుకోవచ్చు కాని—మనస్సే గాయపడితే యిహ మానేది యేముంది? పరువూ ప్రతిష్ఠా పోగొట్టుకుని—నలుగురిలోనూ తలగొత్తుకు తిరగడానికి అసాక్కారంలేకుండా యీ దౌర్భాగ్యపు బ్రతుకు బ్రతికేకంటె రఘునాథరావు చేతులలో చచ్చిపోతే ఎంతబాగుండును!

కు : ఇదా? గాయమంటే నేనేదో నిజంగా గాయంతగిలింది అనుకున్నా. పరువు ప్రతిష్ఠలకేమిటిలెండి. అవి ఎంతసేపు రావాలి. ఎంతసేపు పోవాలి? పరువున్నవాళ్ళంతా మహాయోగ్యులా, పరువులేనివాళ్ళు అయోగ్యులా? మీకు పోయింది యేమీలేదు—ఏదో పోయిందని మీరు అనుకోవడమే పొరపాటు. మీ మీద నాగోజీగారికి నిజంగా కోపంలేదు—రఘునాథరావుగారితో కలబడ్డానికి మారుగా యింకెవ్వరితో మీరు కలబడ్డా నాగోజీగారేమీ అనకే పోయివుండురు—రఘునాథరావుగారేమనుకుంటారో అని మిమ్మల్ని పనికి రావద్దన్నారు కాని యింకొకటి కాదు. ఏముంది, యీకోపం కాస్తా చల్లబడిపోయాక మీరు మళ్ళీ నాగోజీగారి దగ్గరకువెళ్ళి మీపని మీకిచ్చేయమని అడగండి—యిచ్చేస్తారు.

తు : నే అసలు యేమోహాంపెట్టుకు ఆయనదగ్గరకు వెళ్ళను? యేవిధంగా ఆయన గౌరవం నిలబెట్టానని—నన్ను మళ్ళీవేసుకోండి అనను? తాగుబోతువాడికి నీకు వుద్యోగం ఏమిటంటే యేంజవాబుచెప్పను? త్రాగినవాడిని త్రాగినట్టు పడుండక—తప్పట్లూ తందనాలూ మొదలెట్టి—దారమ్మట పోతూన్న వాళ్ళందరితోనూ గిల్లికజ్జా పెట్టుకున్నందుకా నాకు వుద్యోగం యివ్వవలసినది? నాలాంటి త్రాగుబోతువాళ్ళను యేంచేసినా పాపంలేదు. నౌఖరీతీసేసి అవతలకి పొమ్మనడం ఓ శిక్షేకాదు. నన్నడుగుతే—

కు : పోనివ్వండి కాని, నేనొక్కటి అడుగుతా చెప్పండి. మీరిందాకా తరుముకువచ్చిన ఆసామీ యెవరు?

తు : ఏమో?

కు: మీరతనిని ఎరగరూ?

తు: ఊహుఁ.

కు; అయితే అతన్ని యెందుకు తరుముకొచ్చారు?

తు: ఏమో, అదీ చెప్పలేను. యేమేమి జరిగాయో—అన్నీ కలగాపులగమయి వున్నాయి కాని—నాకొక్కటీ సరిగ్గా జ్ఞాపకంలేదు. ఈ దిక్కుమాలిన త్రాగుడు ఎందుకువచ్చిందో, మనిషి తెలివితేటలన్నిటినీ ధ్వంసంచేసే యీ సారాకోసం—యిదే మోక్షం యిదేస్వర్గం అనుకుని ప్రాకులాడడం ఎందుకొచ్చిందో—కోరి, ముచ్చటపడి, కొరివి నెత్తినిపెట్టుకున్నట్టు దీనికి ప్రజలు యెందుకు ఆయత్త పడతారో—నాకేమీ బోధపడకుండావుంది, కురపయ్యా. నీకేమైనా బోధపడితే చెప్పు.

కు: అమ్ముండాకొడుకు యెవడో వాడు పోయాకేనా మీరు శాంతపడ్డారు కాదం?

తు: శాంతపడడానికి నా ఒంటిమీద తెలివి వుండిటోయి? అంతవరకు పిచ్చి గంతులు వేస్తూన్నవాడిని—అంతలోనే వుగ్రనరసింహమూర్తిని అయిపోయాను. నాగోజీగారు వచ్చేదాకా నే యేంచేస్తున్నానో నాకే తెలియదు. అటునుంచి అంతందాకా యీవేళ యెంత బుద్ధితక్కువగా సంచరించాను! యెన్ని తెలివి మాలిన పనులు చేశాను!

కు: మీరిలా పశ్చాత్తాపపడుతూ కూర్చుంటే యేమొచ్చింది—జరిగింది యేదో జరిగిపోయింది—అస్తమానూ దాన్నే తలుచుకుంటూ కూర్చుంటే ముందుపనికూడా తోచదు. మీకే యిక్కట్టు రాకపోతే బాగానే వుండును—వచ్చాక, యేదో వుపాయం ఆలోచించి యివతలపడే దారి చూసుకోవద్దూ?

తు: నన్నేం చెయ్యమంటావు కురపయ్యా? నాకేమీ పాలుపోకుండావుంది. నాగోజీగారి దగ్గరకు మళ్ళీ వెళ్ళడానికి నాకు ధైర్యం చాలదు. వెళ్ళినా యేమీ వుపయోగం వుంటుందని నే అనుకోను. అసలీవేళ, లేవడంతోటే యెవరి మొహం చూశానో కాని, ఆ సారాచుక్క కాస్తా త్రాగకపోతేనేం, అక్కరమాలిన తిమ్మకలన్నీ తెచ్చిపెట్టుకోకపోతేనేం—ఆ పాపిష్టిసారా అంటనేనా అంట కూడదు, కురపయ్యా—అదే నాకొంపతీసింది కురపయ్యా.

కు; ఆ సారాని యెందుకు అనడం, హద్దెరిగి పుచ్చుకుంటే సారా యేమీ బాధించదు—ఒంటికి మంచిదికూడాను. అ— అలావుండనిచ్చి—నాగోజీగారి దయ మళ్ళీ ఎలాసంపాదించడమా అనే మీ రాలోచించవలసినది. నాకో ఆలోచన

తోస్తూవుంది. ఏదో మీరిలాంటి యిబ్బందిలో వున్నారుకదా అన్న భావం కొద్ది చెపుతున్నాకాని...

తు: లేకపోతే నీకేమి పట్టిందోయ్? నువ్వు ఎప్పుడూ నా మిత్రుడిలాగే వ్యవహరించావు. ఏమిటి చెప్పు. నీకు తోచిన సలహా ఏమిటో చెప్పు.

కు: పెద్ద చెప్పడానికి ఏముంది, మీరూ ఈ విషయం కనిపెట్టే వుంటారు. నాగోజీగారు పెళ్ళిచేసుకున్నాక—మనం అనకూడదుకాని—పూర్తిగా పెళ్ళాం కూర్చోమంటే కూర్చున్నట్టు నిల్చోమంటే నిల్చున్నట్టు అయిపోయారు. ఆవిడ ఆలోచన తప్పితే ఆయనకి యింకో ఆలోచన వున్నట్టు కనిపించదు. అందుచేతే ఆవిడ అలా రాజ్యం చలాయిస్తూంది. అదీ మనకి ఓ అందుకు మంచికే వచ్చింది. మీరు నింపాదిగా ఆవిడదగ్గరకు వెళ్ళి, 'ఈ కష్టంలోనుంచి ఎలాగైనా నన్ను తప్పించాలి' అని ప్రతిమాలుకుంటే ఆవిడ కాదనదు. ఆవిడది మహా సున్నితమైన మనస్సు—ప్రక్కని ఎవరైనా బాధపడుతూవుంటే వాళ్లు అడక్కుండానే చేతనైనంత ఉపకారం చేసొచ్చే మనిషి. వాళ్ళు అపేక్షించేదానికంటె యీవిడ చేసేదే ఎక్కువవుంటుంది. అందుచేత, నామాట విని మీ రావిడ్ని ఓ సారి కలుసుకోండి.

తు: అలాగే కురపయ్యా, నువ్వు చెప్పిన సలహా చాలా బాగుంది. అనూరాధమ్మ శిఫారసుచేసిందంటే—మళ్ళీ నాగోజీగారి అనుగ్రహం ఎలాగో ఓలాగు సంపాదించుకోగలుగుతానని నా కాశ పుడుతూవుంది. రేపు ప్రొద్దున్నే వెళ్ళి ఆవిడ్ని కలుసుకుంటా. మహా మంచి సలహా చెప్పావు, కురపయ్యా. ఇప్పటికే చాలా ప్రొద్దుపోయింది—యిహ నే వెడుదునా?


కు; మంచిది (తుకాజీ వెడతాడు)

కు: (స్వగతము) మహామంచి సలహాగాక నే చెప్పినది చెడ్డసలహా అని ఎవడనగలడు? ఇదంతా నా మాదర్ఛోదీ అనడానికి ఎక్కడా అవకాశంలేదు. తుకాజీ చిక్కులలోనుంచి బైటపడడానికి యిదితప్పితే యింకోరిదారి లేదాయె—ఈదారి చూపిపెట్టడం నే అతనికి ద్రోహంచేసినట్టా? అతనికీ కష్టంవచ్చినట్టు అనూరాధకి తెలుస్తేచాలు—తుకాజీని మళ్ళీ పిలిపించి ఉద్యోగంయిచ్చేదాకా మొగుడ్ని ఊరుకోనివ్వదు. నిజంగా ఆవిడది జాలిగుండే ఆవిడ చెయ్యమన్నపని నాగోజీ చెయ్యక ఏం చెయ్యగలడు—అవతల పడకటింట్లో యితన్ని వాజమ్మని చేసిపారేసిందాయె. అందుచేత తుకాజీ వెళ్ళి అనూరాధమ్మని ఆశ్రయిస్తే తప్పకుండా పనవుతుంది. అయితే నేను యిందులోచేసిన మాదర్ఛోదీ ఏముంది? మాదర్ఛోదీలా

కూడా కనబడకుండా అంతా మన పరోపకారబుద్ధి అనుకునేటట్టు వుండాలి, అందులోనేవుంది తమాషా. అనూరాధ తుకాజీతప్పు క్షమించమని మొగుడితో సిఫారసు చెయ్యగా చూసి, యీ అభిమానానికి కారణం వేరేవుందని నాగోజీ తలకెక్కిస్తా. దానితో బిగుసుకున్నముడి, ఒదిలించుకుందామని చూసినప్పుడల్లా యింకా బిగుసుకుపోయి, యింకా బిగుసుకుపోయి, ఆఖరికి పీకల్ని ఉత్తరించేదాకా తీసుకురావాలి. అనూరాధ తుకాజీ ఊసెత్తినప్పుడల్లా ~~ఆవిడకి~~ తెలియకుండానే— నాగోజీ అనుమానం వృద్ధిచెయడంవల్ల— ఆవిడ ఔదార్యం అతగాడి అమాయకత్వం, యివే వాళ్ళ కొంపతీసేటట్టుచేస్తా (మోహనరావు వస్తాడు) ఏం మోహన్‌రావ్, యిలావచ్చావు?

మో: నాకు నీవెనకాల తిరిగితిరిగి ప్రాణం విసిగిపోయింది, కురపయ్యా. నాదగ్గరఉన్న డబ్బూ చాలాభాగం ఖర్చుపెట్టించావ్; నన్ను యిక్కడకు వెళ్ళమనీ అక్కడికి వెళ్ళమని పట్టి విశాఖం లేకుండా త్రిప్పించంపావ్; ఆఖరికి, నీమాట విన్నందువల్ల, యీరాత్రి ఆ తుకాజీచేత చావుదెబ్బలుకూడా తిన్నాను. ఎందుకు, నేనిహ యింటికి వెళ్ళిపోతా. నీవెనకాతల యీ ఊరువచ్చి—నువ్వుచెప్పిన పనల్లా చేసినందుకు నాకేం కలిసివచ్చిందో నువ్వుచెప్పు.

కు: నువ్వు వెర్రివాడవుకాని, యింత తొందరపడితే ఎలాగోయ్? నిముషాల మీద నువ్వు కోరినదల్లా చేసిపెట్టడానికి నాదగ్గర ఏమైనా మంత్రశక్తివుందా? వుంటే యీపాటికి నిన్ను అనూరాధ ప్రక్కలో చేర్చకపోదునా? నీకోరిక తీరుద్దామని నాకూ తొందరగానే వుంది. దానికోసమనే ఒక్కొక్కటీ ఒక్కొక్కటీ సానుకూలపరుస్తున్నాను. ఇవేవీ తొందరపడితే అయ్యేవికావు. దేనికి ఉండవలసిన వ్యవధి దానికి వుండాలి. పుట్టిన పిందె పండయ్యేదాకా కాస్త ఓపికపట్టాలి. మనం తలపెట్టినవన్నీ జరుగుతూనే వున్నాయి. నువ్వు దెబ్బలుతిన్నానంటూ గునుస్తున్నావుకాని నిన్నుకొట్టిన అతని ఉద్యోగమే ఊడిపోయింది. నువ్వు యిహ యింటికి వెళ్లు. నేనే వచ్చి నిన్ను కలుసుకుంటా. అనుకోకుండానే ఎంత చప్పున తెల్లారిపోయింది! నువ్వు యింకా ఎందుకు నిలబడ్డావ్, వెళ్లు (మోహనరావు వెడతాడు) నే యిప్పుడు చెయ్యవలసిన పనులు రెండు—ముందు నా పెళ్ళాంతో చెప్పి తుకాజీకీ అనూరాధకీ సమావేశం ఏర్పాటుచేయుడం; రెండోది, వాళ్ళిద్దరూ కలిసివుండగా నాగోజీని ప్రక్కచాటుగా తీసుకురావడం. ఒక్కొక్కటీ ఉపక్రమిద్దాం—యిహ ఆలస్యమెందుకు? (వెడతాడు, తెరపడును) (సశేషం)





# అతిథి సత్కారానికి అమోఘమైనది

సామ:—ఏమిటీ విన్నా, నిన్న [illegible]
యింటికి వచ్చిన పెద్ద మని
షిని కేవలం కుశల ప్రశ్నలు వేసి పంపించావు! కాస్త [illegible]
కొంచెం ఫలహారం గాని పానీయం గాని ఇవ్వలేక పోయావా!

విమ:—వస్తువుల ధరలు ఇలా మండి పోతూంటే ఏం ఫలహారాలు పెట్టగలను? [illegible]
పైగా అతడు ఓ గడియ కూర్చుండనైనా [illegible] ఏం పానీయం
ఇవ్వగలను?

సామ:—అదేమిటండీ, ఓగ్లాసుడు 'టీ' తయారు చేసి ఇవ్వొచ్చునే... మీకు
తెలుసు గదా—'టీ'...అతి చవకగా అతి త్వరగా శ్రమ లేకుండా తయారు
చేయవచ్చునే!

విమ:—అవును నిజమే. సమయానికి తోచలేదు. ఎంత మరపు బుద్ధి నాది!
అతిథి సత్కారానికి నిజంగా 'టీ' అమోఘమైనది.

## మంత్ర శక్తి నిచ్చే పానీయం

## "టీ" త్రాగండి



ఇండియన్ "టీ" బోర్డువారివల్ల ప్రచురింపబడినది.

Edited and published by B Nagi Reddi for Chandamama Publications, Madras-24.